Pubilshed from Kadapa

PRGI NO : APTEL/25/A1220

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




కడప KADAPA | సంపుటి : 02 | సంచిక : 296 | ఆదివారం | సెప్టెంబర్ 13, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 02 | Issue No : 296 | Sunday | 13 SEPTEMBER 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



## చెట్టికులంగర భగవతి అమ్మవారి సేవలో పవన్ కళ్యాణ్

- ఆలయంలో పుష్పాంజలి సేవ.. అమ్మవారికి ప్రత్యేక పూజలు
- దసరా శరన్నవరాత్రులకు వచ్చే వేలాది మంది భక్తుల అన్నదానానికి విరాళం

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి : కేరళం రాష్ట్రంలోని అలప్పుజ జిల్లా పరిధిలో చారిత్రక ఆలయంగా పేరున్న చెట్టికులంగర శ్రీ భగవతి అమ్మవారిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దర్శించుకున్నారు. శనివారం సాయంత్రం పుష్పాంజలి సేవలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

2 పేజీలో..

# బాబు గారు మీరు సూపర్

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ: అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటం బయో వ్యాలీకి జాతీయ స్థాయిలో గుర్తింపు కల్పించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా సానుకూలంగా స్పందించారు. క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటుకు కేంద్రం నుంచి సహకారం అందిస్తామని ప్రకటించారు. ఈ అంశంపై చర్చించేందుకు కేంద్రం నుంచి సాంకేతిక బృందాన్ని అమరావతికి పంపనున్నట్లు తెలిపారు.



- మీ ఆలోచనలు అమోఘం...
- మీ వినూత్న ఆలోచనల్ని మేము ఆలోచన చేస్తాం
- జాతీయ స్థాయిలో సంజీవని అమలును పరిశీలిస్తాంలి
- అమరావతి క్వాంటం బయో వ్యాలీకి కేంద్ర సహకారం
- సాంకేతిక బృందాన్ని అమరావతికి పంపుతాం
- సీఎం చంద్రబాబు సూచనలకు సానుకూలంగా స్పందించిన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా
- సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏపీ సేఫ్ హ్యాండ్స్ లో ఉందన్న కేంద్ర ఆరోగ్య మంత్రి

క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన బాగుందని, ఆయన చేసిన వివిధ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. శనివారం విజయవాడలో వైద్యారోగ్య శాఖకు చెందిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబుతో కలిసి పాల్గొన్న కేంద్రమంత్రి నడ్డా ఈ మేరకు ప్రకటన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంజీవని కార్యక్రమంపైనా నడ్డా ప్రశంసలు కురిపించారు. సంజీవని కార్యక్రమం అద్భుతంగా ఉందని పేర్కొంటూ, దాన్ని జాతీయ స్థాయిలో అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

2 పేజీలో..



## ఈ ఆటలేంటి చంద్రబాబూ?

- వైఎస్ జగన్ ఫైర్

ప్రజాభూమి ప్రతినిధి, తాడేపల్లి: ఏపీ మెగా డీఎస్సీ స్కామ్‌పై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి స్పందించారు. వెరిఫికేషన్ పేరుతో అసలేం సాధించారంటూ కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. ఏడు దశలు పెట్టినా.. ఒక్కో కేసులో ఒక్కో అంశం బయటపడుతోందన్నారు. ఉపాధ్యాయ అభ్యర్థుల భవిష్యత్తుతో చంద్రబాబు సర్కార్ ఆటలాడుతోందంటూ సోషల్ మీడియా వేదికగా మండిపడ్డారు. "వెరిఫికేషన్? నో, నో.. ఏడు దశల వెరిఫికేషన్!" అంటూ జగన్ ట్వీట్ చేశారు. ముందుగా విజేతల జాబితాను పరిశీలిస్తే.. అందులో సంబంధిత అభ్యర్థుల పేర్లు కనిపించడం లేదని పేర్కొన్నారు. ఆ తర్వాత ఖోఖో అధికారులను సంప్రదిస్తే.. సర్టిఫికెట్ నకిలీదని తేలిందని ఆరోపించారు. అంతేకాకుండా నాగార్జున యూనివర్సిటీని సంప్రదిస్తే..

- మిగతా 2లో..



## నాడు ఆరోగ్యరంగం అనారోగ్యం అయింది

- నేడు అనారోగ్యానికి చక్కటి వైద్యం ఇస్తున్నాం...
- రూ.1,272 కోట్లలో మూడేళ్లకు ఖర్చు చేసింది రూ.28.85 కోట్లే
- చంద్రబాబు రాకతో ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు
- సీసీబీలు, సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలల ప్రారంభోత్సవంలో మంత్రి సత్యకుమార్

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ: ప్రజల ప్రాణాలతో ముడిపడిన ఆరోగ్య మౌలిక వసతుల విషయంలో గత వైకాపా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. కేంద్రం మంజూరు చేసిన రూ.1,272 కోట్ల ఆరోగ్య మౌలిక వసతుల పథకంలో 2019--24 మధ్య మూడేళ్లకు కేవలం రూ.28.85 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. అత్యవసర వైద్య సేవలకు కీలకమైన క్రిటికల్ కేర్ బ్లాకులు, సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలల ఏర్పాటులో తీవ్ర జాప్యం జరిగిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులకు ప్రాధాన్యం ఇచ్చి వేగవంతం చేసిందని చెప్పారు.సీసీబీలు, సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ మాట్లాడారు. వైకాపా హయాంలో నత్తనడకన సాగిన పనులు.. కూటమి ప్రభుత్వం వచ్చాక పరుగులు తీస్తున్నాయని అన్నారు. అవసరమైన నిధులు సమకూర్చడంతో పాటు అధికారులకు స్పష్టమైన గడువులు విధించి పనులను పూర్తి చేస్తున్నామని తెలిపారు.ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మౌలిక వసతుల పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు ఐదేళ్ల కాలానికి రూ.1,271.80 కోట్ల పరిపాలనా అనుమతులు లభించాయని మంత్రి తెలిపారు.

- మిగతా 2లో..



## కూటమి ధర్మంతో స్థానిక పోరుకు సిద్ధం

- మంత్రి కందుల దుర్గేష్
- విజయవాడ పార్లమెంట్ సమన్వయ సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల భాగస్వామ్యం
- బలాబలాల ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక.. అధినేతల నిర్ణయమే శిరోధార్యం
- గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలంటూ అభ్యర్థులను భయపెట్టి ప్రజాస్వామ్యాన్ని పూడ్చిపెట్టిన మాజీ - సీఎం జగన్.. నేడు నీతులు చెప్పడం విడ్డూరం
- ప్రజాస్వామ్యయుతంగా స్థానిక సంస్థల ఎన్నికలు.. 100% స్ట్రైక్ రేట్‌తో విజయం ఖాయం

- మిగతా 2లో..

## నడ్డాజీ ఓ సెల్ఫీ.. ఓకే అన్న బాబుజి..



- అమరావతి క్వాంటం బయో వ్యాలీకి జాతీయ గుర్తింపునివ్వాలి
- జనవరి 1 నుంచి హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్
- డబులింజన్ ప్రభుత్వంతో వైద్యారోగ్య రంగానికి కొత్త ఊపు
- వైద్యారోగ్య శాఖలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- రూ.249 కోట్లతో 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీలను ప్రారంభించిన కేంద్ర - ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి చంద్రబాబు

2 లో..

ప్రజాభూమి ప్రతినిధి, విజయవాడ: వైద్యారోగ్య రంగంలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సంజీవని అమలు చేయనున్నామని, వైద్యరంగంలో ఇది గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని చెప్పారు. జనవరి 1 నుంచి ప్రజల ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేస్తున్నామని తెలిపారు. అమరావతిలో ఏర్పాటు చేయబోతున్న క్వాంటం బయో వ్యాలీని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని కేంద్రాన్ని సీఎం చంద్రబాబు కోరారు. శనివారం వైద్యారోగ్య శాఖకు చెందిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ మేరకు విజయవాడ పాత ప్రభుత్వాస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన క్రిటికల్ కేర్ బ్లాక్, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీలను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, సీఎం చంద్రబాబు సందర్శించి.. కొత్తగా నిర్మించిన బ్లాక్, ల్యాబరేటరీని ప్రారంభించారు.



## ఎపిలో వానలు..

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో .... ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో రానున్న కొన్ని గంటల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. రాగల 6 గంటలపాటు శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు ఉన్న జిల్లాల్లో అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ముఖ్యంగా కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో రాగల రెండు గంటల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.

- మిగతా 2లో..

## గిరిజన విద్యార్థులకు అరుదైన అవకాశం

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముని కలవనున్న 10 మంది విద్యార్థులు
- న్యూఢిల్లీలోని 'అమృత్ ఉద్యాన్' సందర్శించనున్న విద్యార్థులు

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి : కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని జువీ=ూ పాఠశాలలకు చెందిన 10 మంది ప్రతిభావంతులైన గిరిజన విద్యార్థులు న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో గల 'అమృత్ ఉద్యాన్' సందర్శనకు ఎంపికయ్యారని ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఎం. గౌతమి, తెలిపారు. పర్యటనలో భాగంగా సెప్టెంబర్ 15న రాష్ట్రపతి భవన్, అమృత్ ఉద్యాన్‌లను సందర్శించడంతో పాటు భారత రాష్ట్రపతిద్రౌపది ముర్ము ని ప్రత్యక్షంగా కలిసే అరుదైన అవకాశాన్ని విద్యార్థులు పొందనున్నట్లు ఆమె వెల్లడించారు.

- మిగతా 2లో..





# సంపాదకీయం

## మొహం చాటేసిన వర్షాలు!

ఈ ఏడాది ఇప్పటివరకు వర్షాభావ పరిస్థితులే ఏర్పడ్డాయి. ఆయా ప్రాంతాల్లో అక్కడక్కడ చెదురుముదురు వర్షాలు మినహా ఎక్కడా అనుకున్న స్థాయిలో వర్షాలు కురవలేదు. మరోవైపు వర్షాకాలం చివరికి వస్తున్న కొద్దీ దేశంలోని రైతన్నల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వాతావరణ శాఖ వెల్లడించిన తాజా అంచనాల ప్రకారం.. సెప్టెంబర్ మూడో వారం నుంచి దేశవ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'ఎల్ నినో' ప్రభావం రబీ పంటల సాగుపై తీవ్ర ముప్పుగా పరిణమించేలా ఉంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బీహార్ వంటి పలు రాష్ట్రాల్లో సాధారణం కంటే 27 నుంచి 45 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైంది. వర్షాకాలం ముగిసే సమయానికి వర్షాలు మొహం చాటేస్తే.. వచ్చే శీతాకాలంలో వేసే రబీ పంటల పరిస్థితి ఏంటనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. సాధారణంగా రబీ సీజన్ అక్టోబర్ నుంచి ప్రారంభమవుతుంది. సెప్టెంబర్‌లో వర్షాలు పడకపోయినా విత్తనాలు వేసే సమయం మారకపోవచ్చు కానీ, నేలలో తేమ శాతం దారుణంగా పడిపోతుంది. ప్రస్తుతం దేశంలోని 178 ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు గత ఏడాదితో పోలిస్తే దాదాపు 20 శాతం తగ్గిపోయాయి. గతేడాది ఇదే సమయానికి 163.44 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు ఉండగా, ఇప్పుడు అది 130.55 బిలియన్ క్యూబిక్ మీటర్లకు పరిమితమైంది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్ , మధ్యప్రదేశ్ వంటి వ్యవసాయ ఆధారిత రాష్ట్రాల్లో నీటి నిల్వలు లేకపోతే విత్తనాలు మొలకెత్తడమే కష్టమవుతుంది. భారతీయ వ్యవసాయంలో రబీ కాలం చాలా కీలకమైనది. ముఖ్యంగా నీటి లభ్యత , నేలలోని తేమపై ఆధారపడే గోధుమ, ఆవాలు, శనగ పంటలు ఈసారి తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయి. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో గోధుమలు, ఆవాల సాగు ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ మొదటి తడికి రిజర్వాయర్ నీళ్లే ఆధారం. మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్‌లోని నల్లరేగడి నేలల్లో వేసే శనగ పంట కేవలం భూమిలోని తేమ ఆధారంగానే పెరుగుతుంది. వర్షాలు లేక భూమి ఎండిపోతే ఈ పంటల దిగుబడి దారుణంగా పడిపోతుంది. ఎల్ నినో వల్ల ఏర్పడే కరవు పరిస్థితులను అధిగమించడానికి 'ఇండియన్ ఓషన్ డైపోల్' కాస్త ఆశాకిరణంగా కనిపిస్తోందని నిపుణులు చెప్తున్నారు. హిందూ మహాసముద్రంలో ఏర్పడే ఈ సానుకూల మార్పు వల్ల భారత్ వైపు వర్షపు మేఘాలు తొలకరిచ్చే అవకాశం ఉంది. 1997, 2023 సంవత్సరాల్లో ఎల్ నినో తీవ్రతను ఈ ఐఓడీ కొంతవరకు తగ్గించగలిగింది. అయితే, ఇది ప్రధానంగా వర్షాకాలానికే పరిమితమవుతుంది కాబట్టి, ఎండిపోయిన భూగర్భ జలాలను, ఖాళీ అయిన రిజర్వాయర్లను ఎంతవరకు నింపుతుందనేది అనుమానంగానే ఉంది. ఒకవేళ అక్టోబర్, నవంబర్ నెలల్లో భూమిలో తేమ శాతం పెరగకపోతే రబీ పంటల విస్తీర్ణం తగ్గడమే కాకుండా దిగుబడులు కూడా దెబ్బతింటాయి. దీనివల్ల రాబోయే రోజుల్లో గోధుమలు, పప్పుధాన్యాలు, వంటనూనెల సరఫరా తగ్గి, నిత్యావసర ధరలు మళ్లీ ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉందని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం రైతుల ఆదాయాన్నే కాకుండా, సామాన్య ప్రజల జేబులకు కూడా పెద్ద కన్నం వేసేలా కనిపిస్తోంది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా కరవు తాండవిస్తోంది. ఓవైపు వర్షాధార పంటల సాగును చాలా వరకు తగ్గించినప్పటికీ మరోవైపు బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేసిన వరి సైతం చేతికందేలా లేదు. భూగర్భజలాలు దారుణంగా పడిపోయి, బోర్లు వట్టిపోతున్నాయి. ఎండిపోతున్న పంటలను చూడలేక అన్నదాతలు బావుల్లో పూడిక తీయిస్తూ కొత్త బోర్లు వేయిస్తున్నా చుక్క నీరు పడటం లేదు. ఈ వర్షాభావ పరిస్థితులు మరో వారం, పదిరోజుల పాటు కొనసాగితే పంటలపై ఆశలు వదిలేసుకోవాల్సిందేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో సాధారణంగా 1.32 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో సాగు నమోదయ్యేది. కానీ ఈ ఏడాది 1.21 కోట్ల ఎకరాలు అంటే సుమారు 92 శాతం మేరకే సాగు చేసినట్లు వ్యవసాయశాఖ గణాంకాలు నివేదిస్తున్నాయి. ప్రధానంగా 66 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు నమోదవుతుండగా ఈసారి 52.81 లక్షల ఎకరాల్లో(80 శాతం) మాత్రమే నాట్లు పడ్డాయి. ఇక పత్తి అంచనా సాగు 47 లక్షల ఎకరాలకు గాను 48 లక్షల ఎకరాల్లో సాగు నమోదైంది. 6.49 లక్షల ఎకరాల విస్తీర్ణంలో అపరాలు సాగవుతుండగా 7.86 లక్షల ఎకరాలకు చేరింది. అధికంగా నీటి ఆధారమైన వరి సాగు 20 శాతం వరకు తగ్గింది. కానీ చాలా ప్రాంతాల్లో నాట్లు వేసిన రైతులు మాత్రం పంటను కాపాడుకోడానికి ఎన్నో పాట్లు పడుతున్నారు.రాష్ట్రంలో ఈ సీజన్?కు సంబంధించి ఇప్పటిదాకా 49 రోజులే వర్షం కురిసింది. 598.9 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి గాను 478.2 మి.మీ మాత్రమే కురిసింది. మొత్తంగా 20 శాతం లోటు వర్షపాతం ఏర్పడగా 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. తక్కిన 18 జిల్లాల్లో లోటు వర్షపాతమే కొనసాగుతోంది. గత సంవత్సరం ఆగస్టు చివరి నాటికి 5.78 మీటర్ల లోతులో ఉన్న నీటిమట్టం ఇప్పుడు 7.87 మీటర్లకు పడిపోవడం గమనార్హం. జిల్లాల వారీగా చూస్తే సూర్యాపేట, వికారాబాద్ జిల్లాల్లో గతంతో పోలిస్తే అదనంగా 5 మీటర్ల మేర నీటిమట్టం తగ్గింది. నారాయణపేట, మహబూబ్‌నగర్, మేడ్చల్ జిల్లాల్లో 4 మీటర్లు, అలాగే వరంగల్, సంగారెడ్డి, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 3 మీటర్లకు లోతులోకి నీటిమట్టాలు పడిపోయాయి. వర్షాలు కురవక, సాగునీరు లేక అన్నదాతలు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. చెరువుల్లో నీటిని బయటకు తోడేందుకు మోటార్లను ఏర్పాటు చేసుకున్నారు. వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండలంలోని పుల్లర్ల గ్రామంలో ఉన్న కొత్త చెరువు పరిధిలో 50 ఎకరాలకు పైగా ఆయకట్టు సాగయ్యేది. నీటి వసతి ఉన్న కొందరు రైతులు అక్కడక్కడా సుమారు ఐదు ఎకరాల వరకు వరి సాగు చేశారు. మిగిలిన పొలాలు మాత్రం బీళ్లుగా ఉండిపోయాయి. ఆయకట్టు చివరన ఉన్న పంటలకు నీరందించేందుకు చెరువులో ఉన్న కొద్దిపాటి నీటిని తోడేందుకు రైతులు మోటార్లను ఏర్పాటు చేశారు. ఇలాంటి పరిస్థితులే ముమ్ముందు కొనసాగితే సాగు నీటికే కాదు తాగునీటికి కూడా ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ఈ ఆటలేంటి చంద్రబాబూ?

అసలు ఆ క్రీడా కార్యక్రమమే జరగలేదని తేలిందని జగన్ పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో డీఎస్సీ ప్రక్రియను న్యాయమైన, పారదర్శకమైన నియామక ప్రక్రియగా ఎలా పిలుస్తారని ప్రశ్నించారు.
కేసు--1: మెరిట్ లిస్టులో పేర్లు పరిశీలిస్తే.. అసలు పేర్లే కనిపించ లేదు. కేసు--2: ఖో-ఖో అధికారులను సంప్రదిస్తే ఆ సర్టిఫికెట్ నకిలీదని చెబుతున్నారు. కేసు--3: నాగార్జున యూనివర్సిటీలో ఆరా తీస్తే అసలు ఆ స్పోర్ట్స్ ఈవెంటే జరగలేదని తేలింది. మరి 7 దశల్లో వెరిఫికేషన్ చేశామన్న ప్రభుత్వం.. ఆ తనిఖీలు ఎక్కడ చేశారు?, ఏం తనిఖీ చేశారు? అని ప్రశ్నించారు. ఇలాంటి పరిస్థితుల్లో డీఎస్సీ ప్రక్రియను నిష్పక్షపాతంగా.. పారదర్శకంగా నిర్వహించామని ఎలా చెప్పగలరు? అని అన్నారు. ఈ లోపాలే డీఎస్సీ అక్రమాలకు అవకాశం కల్పించలేదా? దీనికి నైతిక బాధ్యతను మీరు తీసుకోరా?'' అంటూ చంద్రబాబును ఉద్దేశించి వైఎస్ జగన్ ప్రశ్నించారు. హ్యాష్‌ట్యాగ్‌తో ఆయన ఈ ట్వీట్ చేశారు.

## గిరిజన విద్యార్థులకు అరుదైన అవకాశం



ఈ విద్యార్థుల బృందం సెప్టెంబర్ 13న విజయవాడ నుంచి న్యూఢిల్లీకి బయలుదేరనుంది. పర్యటనలో భాగంగా సెప్టెంబర్ 15న రాష్ట్రపతి భవన్, అమృత్ ఉద్యాన్‌లను సందర్శించడంతో పాటు భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము గారిని ప్రత్యక్షంగా కలిసే అరుదైన అవకాశాన్ని విద్యార్థులు పొందనున్నారు.అలాగే సెప్టెంబర్ 16న న్యూఢిల్లీలోని పలు ముఖ్యమైన చారిత్రక, అధ్యయన ప్రాంతాలను సందర్శించే విద్యా మరియు అవగాహనా పర్యటన నిర్వహించబడుతుంది. అనంతరం ఈ బృందం సెప్టెంబర్ 17న న్యూఢిల్లీ నుంచి తిరిగి విజయవాడకు చేరుకోనుంది. విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించేందుకు ఒక మహిళా ఎస్కార్ట్ ఉపాధ్యాయురాలు కూడా ఈ బృందంతో వెళ్లనున్నట్లు తెలిపారు. దేశ రాజధానిలోని అత్యున్నత సంస్థలను ప్రత్యక్షంగా సందర్శించడం ద్వారా గిరిజన విద్యార్థులకు సమాజంపై మెరుగైన అవగాహన కలగడమే కాకుండా, వారిలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, విద్యా ప్రగతి మరియు సమగ్ర వికాసానికి ఈ పర్యటన ఎంతగానో తోడ్పడుతుందని గౌతమి అభిప్రాయపడ్డారు.

## బాబు గారు మీరు సూపర్...



ప్రజలకు ముందస్తుగా వ్యాధులను గుర్తించడం, నివారణ, మెరుగైన చికిత్సతో పాటు అందుబాటు ధరల్లో వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు కేంద్రం నుంచి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు.

**చంద్రబాబు విజన్‌పై నడ్డా ప్రశంసలు :** ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ సురక్షితమైన చేతుల్లో ఉందని కేంద్ర మంత్రి జేపీ నడ్డా అన్నారు. చంద్రబాబు విజన్, నిబద్ధత కలిగిన నాయకుడని ప్రశంసించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, విభజిత ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో చంద్రబాబు పోషించిన పాత్రను మరువలేమని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబు చేస్తున్న కృషిని కొనియాడారు. వైద్యారోగ్య రంగానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని నడ్డా తెలిపారు. రాష్ట్రంలో ఆరోగ్య మౌలిక సదుపాయాల అభివృద్ధికి చేపడుతున్న చర్యలను ప్రశంసించారు. కేంద్రం, రాష్ట్రం కలిసి పనిచేయడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన వంటిల్లే ఫార్మసీ--ఆహారమే ఔషధం అనే విషయాన్ని కేంద్ర మంత్రి జేపీ నడ్డా తన ప్రసంగంలో వివిధ సందర్భాల్లో ప్రస్తావించారు. చంద్రబాబు చెప్పిన మాటలు నూటికి నూరు శాతం నిజమని అన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఇదే మూల సూత్రమని పేర్కొన్నారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, జీవన విధానం ద్వారా వ్యాధులను నివారించుకోవడంపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

**సాగునీటి ప్రాజెక్టులపై చంద్రబాబు చిత్తశుద్ధి :** ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చూపుతున్న చిత్తశుద్ధిని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి అభినందించారు. పోలవరం ఎడమ కాలువ, వెలిగొండ, హంద్రీ--నీవా వంటి ప్రాజెక్టులను ప్రారంభించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సాగునీరు కీలకమని, నీటి వనరులను సమర్థంగా వినియోగించుకునేలా చేపడుతున్న ప్రాజెక్టులు రాష్ట్ర ప్రగతికి దోహదపడతాయని పేర్కొన్నారు.

# నడ్డాజీ ఓ సెల్ఫీ..ఓకే అన్న బాబుజి..

అనంతరం అంబేద్కర్ కళా వేదికలో ఏర్పాటు చేసిన సభలో రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీలను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్ గా లాంచ్ చేశారు. ఈ ప్రాజెక్టులతో రాష్ట్రంలో 500 క్రిటికల్ కేర్ బెడ్లు అందుబాటులోకి వచ్చాయి. అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, అల్ట్రాసౌండ్ సదుపాయాలతో పాటు కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ వంటి కీలక వైద్య విభాగాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన వైద్యం మరింత చేరువ కానుంది. అత్యాధునిక వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులను తగ్గించేలా ఈ సదుపాయాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.

**డబుల్ఇంజన్ సర్కారుతో అభివృద్ధి :** ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లలో వైద్య రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని అన్నారు. దేశంలో మెడికల్ సీట్లను 51 వేల నుంచి రెండింతలకుపైగా పెంచారని తెలిపారు. కోవిడ్ సమయంలో ప్రపంచానికి వ్యాక్సిన్ అందించిన ఘనత భారతదేశానికి, ప్రధాని నరేంద్ర మోదీకి దక్కుతుందని పేర్కొన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌ను అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని, జన ఔషధి కేంద్రాల ద్వారా పేదలకు మందులు అందుతున్నాయని చెప్పారు. అభా కార్డుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. ఫార్మా రంగానికి ఆంధ్రప్రదేశ్ చిరునామాగా ఉందని, మెడ్‌టెక్ పార్కు ద్వారా వైద్య పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. వంటశాలను ఫార్మసీగా... ఆహారాన్నే ఔషధంగా భావించాలని సూచించారు. ఈ మేరకు ఆరోగ్య పద్ధతులను మార్చుకోవాలని చెప్పారు. యోగా, ప్రాణాయామం, ధ్యానం వంటి వాటిని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని, యోగాభ్యాసంతో ఎనర్జీ లెవల్స్ పెరుగుతాయని అన్నారు. సంప్రదాయ పద్ధతులను పాటిస్తూనే సాంకేతికతను అందిపుచ్చుకుంటే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. రాష్ట్ర వైద్యారోగ్య రంగానికి నిధులు కేటాయిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. జేపీ నడ్డా నాయకత్వంలో దేశంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందన్న నమ్మకం ఉందన్నారు. కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కూడిన డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వల్లే ఇటువంటి అభివృద్ధి సాధ్యమవుతోందని చెప్పారు. వైద్యారోగ్య రంగంతో పాటు అన్ని రంగాల్లోనూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నీటిని అందిస్తున్నామని, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తున్నామని చెప్పారు. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తీసుకువచ్చామని గుర్తుచేశారు. కేంద్ర సహకారం, రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలుపుతామని చంద్రబాబు స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు సహకరించి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'హెల్తీ--వెల్తీ--హ్యాపీ ఆంధ్రప్రదేశ్' దిశగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**సాంకేతికతతో సత్వర ప్రగతి :** సంప్రదాయ ఆరోగ్య విధానాలను కొనసాగిస్తూనే ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటే వైద్యారోగ్య రంగంలో మరింత మెరుగైన సేవలు అందించగలమన్నారు. సాంకేతికతను అన్ని రంగాల్లో విస్తృతంగా వినియోగిస్తే రాబోయే పదేళ్లలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతి సాధించగలదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అమరావతిని భవిష్యత్ సాంకేతికతకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అమరావతిలో క్వాంటం బయో వ్యాలీని ఏర్పాటు చేస్తున్నామని, దీనికి జాతీయ గుర్తింపు ఇవ్వాలని కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు విజ్ఞప్తి చేశారు. దేశంలో తొలి క్వాంటం కంప్యూటర్ అమరావతిలోనే ప్రారంభం కానుందని తెలిపారు. అమరావతి గురించి లద్దాఖ్‌లోనూ చర్చించుకునే పరిస్థితి వచ్చిందని చంద్రబాబు అన్నారు. అన్ని ప్రాంతాల్లో అమరావతికి గుర్తింపు లభించిందని, భవిష్యత్తులో ఎక్కడికి వెళ్లినా అమరావతి గురించి చర్చించుకునే రోజు వస్తుందని చెప్పారు. ఏఐ రంగంలో నిపుణులను తీర్చిదిద్దేందుకు యువతకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ప్రజా ప్రతినిధులు కేశినేని శివనాథ్, బోండా ఉమ, సోము వీర్రాజు సహా వైద్యారోగ్య శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**చప్పట్లు... కేరింతలతో మార్మోగిన అంబేద్కర్ కళా వేదిక :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన కార్యక్రమంలో సీఎం వేదికపైకి రాగానే వైద్య విద్యార్థులు, సభికులు పెద్దఎత్తున హర్షధ్వానాలతో స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి ప్రసంగం సందర్భంగా అడుగడుగునా చప్పట్లతో కళావేదిక మార్మోగింది. దీంతో సీఎం చంద్రబాబు కూడా అంతే ఉత్సాహంతో స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమరావతి, సంజీవని ప్రాజెక్టు, ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి సీఎం చంద్రబాబు ప్రస్తావించిన ప్రతి సందర్భంలోనూ కళా వేదికలో పెద్ద ఎత్తున చప్పట్లతో సభికులు హర్షధ్వానాలు తెలిపారు. సభ ముగిసిన తర్వాత సభికుల ఆనందోత్సాహాల్లో పాలుపంచుకుంటూ.. వేదిక మీద నుంచే కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో కలిసి సీఎం చంద్రబాబు సెల్ఫీ తీసుకున్నారు.

## నాడు ఆరోగ్యరంగం అనారోగ్యం అయింది


ఇందులో 24 క్రిటికల్ కేర్ బ్లాకులు, 26 సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలలు సహా పలు ఆరోగ్య మౌలిక వసతుల పనులు ఉన్నాయని వివరించారు.అయితే 2019--24 మధ్య ఈ కార్యక్రమానికి సంబంధించి రూ.28.85 కోట్లు మాత్రమే ఖర్చయ్యాయని తెలిపారు. కరోనా వంటి విపత్తులను ఎదుర్కొనేందుకు అవసరమైన అత్యవసర వైద్య సదుపాయాలను సకాలంలో సిద్ధం చేయాల్సిన సమయంలో పనులు ముందుకు సాగకపోవడం బాధాకరమన్నారు.
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆరోగ్య రంగంలోని పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టారని సత్యకుమార్ తెలిపారు. ప్రతి నెలా పనుల పురోగతిని సమీక్షిస్తూ, జాప్యానికి కారణాలను తెలుసుకుని అధికారులకు స్పష్టమైన గడువులు విధిస్తున్నారని చెప్పారు. గతంలో నత్తనడకన సాగిన పనులు ఇప్పుడు పరుగులు తీస్తున్నాయని మంత్రి అన్నారు. అవసరమైన నిధులు సమకూర్చి, క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రానికి మంజూరైన 24 క్రిటికల్ కేర్ బ్లాకుల్లో 10 బ్లాకులను పూర్తి చేసి, ఈ కార్యక్రమంలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని మంత్రి తెలిపారు. అలాగే 26 సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలల్లో 12 ప్రయోగశాలలను ప్రారంభిస్తున్నామని చెప్పారు. మిగిలిన ప్రయోగశాలలను కూడా నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని వెల్లడించారు. 24 క్రిటికల్ కేర్ బ్లాకుల ద్వారా మొత్తం 1,275 అత్యవసర వైద్య పడకలు అందుబాటులోకి వస్తాయని సత్యకుమార్ తెలిపారు. ఇప్పటికే 500 పడకలు అందుబాటులోకి వచ్చాయని, మిగిలిన 775 పడకలను డిసెంబరు నాటికి అందుబాటులోకి తీసుకురానున్నామని చెప్పారు. తీవ్రమైన ఇన్ఫెక్షన్లు, శ్వాసకోశ వ్యాధులు, ప్రమాద గాయాలు, అత్యవసర తల్లి--శిశు వైద్యం, డయాలసిస్ వంటి ప్రాణాపాయ పరిస్థితుల్లో ఈ కేంద్రాలు కీలకంగా పనిచేస్తాయని వివరించారు.
సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలల ద్వారా సూక్ష్మజీవ శాస్త్రం, జీవరసాయన శాస్త్రం, రక్త పరీక్షలు, కణ పరీక్షలు వంటి ముఖ్యమైన పరీక్షలు జిల్లా స్థాయిలోనే అందుబాటులోకి వస్తాయని మంత్రి తెలిపారు. వ్యాధులను త్వరగా గుర్తించి సకాలంలో చికిత్స అందించేందుకు ఇవి దోహదపడతాయన్నారు. కరోనా అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని భవిష్యత్తులో ఎలాంటి ఆరోగ్య అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేలా దేశ ఆరోగ్య వ్యవస్థను సిద్ధం చేయాలన్న దూరదృష్టితో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మౌలిక వసతుల పథకాన్ని తీసుకొచ్చారని సత్యకుమార్ అన్నారు. కేంద్ర ఆరోగ్య, రసాయనాలు--ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా అందిస్తున్న సహకారంతో రాష్ట్రంలో ఆరోగ్య మౌలిక వసతుల పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. కేంద్ర సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించడానికే పరిమితం కాకుండా, వ్యాధిని ముందుగానే గుర్తించి నివారించే విధానాన్ని బలోపేతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి వ్యక్తికి సంబంధించిన డిజిటల్ ఆరోగ్య రికార్డులు రూపొందించి వ్యక్తి కేంద్రంగా వైద్య సేవలు అందించే వ్యవస్థను నిర్మిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను బలోపేతం చేస్తూ, ప్రాథమిక ఆరోగ్య సేవల నుంచి అత్యున్నత స్థాయి వైద్యం వరకు సమగ్ర ఆరోగ్య వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని సత్యకుమార్ వెల్లడించారు. ప్రజల ప్రాణాలతో ముడిపడిన ఆరోగ్య రంగంలో ఇక నిర్లక్ష్యానికి తావులేదని, కేంద్ర సహకారంతో రాష్ట్రంలో ఆరోగ్య మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

## కూటమి ధర్మంతో స్థానిక పోరుకు సిద్ధం

మొదటి పేజీ తరువాయి

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ధర్మాన్ని పాటిస్తూ భాగస్వామ్య పక్షాలన్నీ కలిసికట్టుగా పోటీ చేస్తాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. విజయవాడలోని భారతి నగర్ లో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన కూటమి సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), జనసేన పార్టీ తరపున తూర్పు నియోజకవర్గం, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అమ్మిశెట్టి వాసు, బండి కోమలి, మరియు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.
అనంతరం విజయవాడ తూర్పు నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈరోజు కూటమి పార్టీల సమన్వయ కమిటీ సమావేశాలు జరుగుతున్నాయి. కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య స్థానాల కేటాయింపును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ అధిష్టానం ఉమ్మడిగా నిర్ణయిస్తాయి.ఏ పార్టీకి ఎక్కడ బలం ఉందో పరిశీలించి, ఆ స్థానాల్లో సదరు పార్టీ పోటీ చేసేలా చర్యలు ఉంటాయి. ఎలాంటి పొరపొచ్చాలు
లేకుండా, అత్యంత స్పష్టతతో అంతిమంగా అధినేతల ఆమోదంతో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ముందుకు సాగుతుంది. ప్రజాస్వామ్య విలువల పట్ల అపరిమితమైన విశ్వాసం ఉన్న కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి పారదర్శకంగా, ప్రజాస్వామ్యయుతంగా నిర్వహిస్తుంది. ఈ ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్‌తో కూటమి క్లీన్ స్వీప్ చేయడం ఖాయం. మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలపై చేతులెత్తేసి, సాధారణ ఎన్నికల్లో పోటీ పడదామని వ్యాఖ్యానించడం 'దెయ్యాలు వేదాలు వల్లించినట్లు' ఉంది. 2021 స్థానిక ఎన్నికల్లో ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేసి, ఎక్కడా ఎన్నికలు జరగకుండా అడ్డుకుని, దౌర్జన్యంగా ఏకగ్రీవాలు చేసుకున్న చరిత్ర వైసీపీది. నాడొక న్యాయం, నేడొక న్యాయమా అని ప్రశ్నించారు.

**జనసేన పార్టీ కోఆర్డినేటర్లు, సపోర్ట్ టీంతో సమావేశం :** సమన్వయ సమావేశం అనంతరం విజయవాడ తూర్పు నియోజకవర్గం జనసేన కార్యాలయంలో జనసేన పార్టీకి సంబంధించి ఎంపిక చేసిన కోఆర్డినేటర్లు, కోఆర్డినేటర్ టీం మరియు సపోర్ట్ టీంతో మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేకంగా చర్చించి ఎన్నికల కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు అమ్మిశెట్టి వాసు, బొలిశెట్టి శ్రీకాంత్, బండి కోమలి, చెరుకుమిల్లి సురేష్, వేమన కిషోర్ కుమార్, తాటి శివకృష్ణ, చింతలపాటి వెంకటకృష్ణ, రుద్ర శేఖర్ నాయుడు, గాదిరెడ్డి పూర్ణ చంద్రరావు, కొప్పిరెడ్డి సూర్యనారాయణ, పాయింట్ ఆఫ్ కాంటాక్ట్స్ అక్కల గాంధీ, బొలిశెట్టి వంశీకృష్ణ, తంబళ్లపల్లి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



## చెట్టికులంగర భగవతి అమ్మవారి సేవలో పవన్ కళ్యాణ్

ఆరోగ్య ప్రదాయినిగా పేరున్న శ్రీ భగవతి అమ్మవారికి పుష్పాంజలి సమర్పణ సర్వదోష నివారణ నిమిత్తంచేస్తారని ప్రతీతి. దసరా శరన్నవరాత్రుల తొమ్మిది రోజులు శ్రీ భగవతి అమ్మవారి దర్శనానికి విచ్చేసే వేలాది మంది భక్తులకు అన్నదానానికి అయ్యే వ్యయం మొత్తాన్ని దేవస్థానం బోర్డుకు విరాళంగా పవన్ కళ్యాణ్ అందజేశారు. త్రిశక్తి స్వరూపిణి అయిన అమ్మవారి దర్శనానికి దసరా నవరాత్రుల రోజుల్లో వేలాదిగా భక్తులు తరలివస్తారు. అంతకు ముందు అమ్మవారి దర్శనానికి విచ్చేసిన పవన్ కళ్యాణ్ కి అధికారులు, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి ముందుగా బాలశివుని దర్శించుకుని అర్చనలు చేశారు. అమ్మవారి దర్శనానంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న వినాయకుడు, నాగదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మేల్ శాంతి ఉప ముఖ్యమంత్రివర్యులతో పూజలు చేయించారు. చెట్టికులంగర భగవతి అమ్మవారి ఆలయానికి 1200 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. రాక్షస సంహారం కోసం శివుడి మూడో కన్ను నుంచి అమ్మవారు జన్మించినట్టు పురాణాలు చెబుతున్నాయి. శ్రీ భగవతి అమ్మవారు త్రిశక్తి స్వరూపిణిగా భక్తుల పూజలు అందుకుంటున్నారు.

## ఎపిలో వానలు ...

ఈ వర్షాలతో పాటు గంటకు 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. పైన పేర్కొన్న మూడు జిల్లాలు మినహా మిగిలిన చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల హెచ్చరికల దృష్ట్యా, అత్యవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని కోరారు.

# పౌల్ట్రీ రైతుల సంక్షేమానికి పెద్దపీట

❖రూ.657 కోట్ల ప్యాకేజీతో రంగం బలోపేతం.. పాలసీని వేగంగా అమలు చేస్తాం ❖ఏటా 2,720 మదర్ పౌల్ట్రీ యూనిట్లు ❖ఆధునిక పౌల్ట్రీ ఫారాలకు భారీ ప్రోత్సాహకాలు ❖ మొక్కజొన్న ధరల నియంత్రణకు ప్రత్యామ్నాయాలపై దృష్టి ❖పౌల్ట్రీ అసోసియేషన్ సభ్యులతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:
రాష్ట్రంలో పౌల్ట్రీ రంగాన్ని మరింత బలోపేతం చేసి, పౌల్ట్రీ రైతులకు అండగా నిలిచేందుకు ఏపీ పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ 2026–29కు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చె న్నాయుడు తెలిపారు. పాలసీకి ఆమోదం తెలిపిన సందర్భంగా పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం విజయవాడలోని కార్యాలయంలో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సంద ర్భంగా మంత్రి మాట్లాడుతూ, పాలసీని త్వరితగతిన అమల్లోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పౌల్ట్రీ రంగానికి నూతన ఊతం అందించడంతో పాటు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించడం, పెట్టుబడులను ఆకర్షించడం, ఉత్పాదకతను పెంచడం, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం లక్ష్యంగా పాల సీని రూపొందించినట్లు తెలిపారు. పౌల్ట్రీ రంగ అభివృద్ధికి ప్రభుత్వం రూ.657 కోట్ల భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిందని వివరించారు. ఇందులో ఫుడ్ ప్రాసెసింగ్‌కు సంబంధించిన ప్రోత్సాహకాల కోసం రూ.209 కోట్లు, ఇండస్ట్రియల్ పాలసీ కింద రూ.152.18 కోట్లు, పశుసంవర్ధక శాఖ ద్వారా అమలు చేయనున్న కార్యక్రమాలకు రూ.296 కోట్లు కేటాయించనున్నారు.

కోళ్ల ఫారాలు, హేచరీల మౌలిక వసతుల అభివృద్ధికి తీసుకునే రుణాలపై 4 శాతం వడ్డీ రాయితీ కల్పిం చ నున్నామని, ఇందుకోసం మూడేళ్ల కాలానికి రూ.72 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. పౌల్ట్రీ రైతుల విద్యుత్ భారాన్ని తగ్గించేందుకు లో-టెన్షన్ కోళ్ల ఫారాలకు యూనిట్‌కు రూ.3.75, ఫీడ్ మిక్సింగ్ యూనిట్లకు యూనిట్‌కు రూ.4.75 చొప్పున టారిఫ్‌ను క్రమబద్ధీకరించినట్లు తెలిపా రు. కొత్తగా ఏర్పాటు చేసే ఎన్విరాన్‌మెంట్ కంట్రోల్డ్ (EC) పౌల్ట్రీ షెడ్లకు అవసరమైన మౌలిక వస తుల కల్పనపై 25 శాతం వరకు, గరిష్ఠంగా రూ.25 లక్షల వరకు క్యాపిటల్ సబ్సిడీ అందిం చనున్నాం. ఇప్పటికే ఉన్న పౌల్ట్రీ షెడ్లను ఆధునీకరించేందుకు కూడా 25 శాతం వరకు, గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు సబ్సిడీ అందించేలా ప్రతిపాదించాం. అర్హత కలిగిన EC పౌల్ట్రీ ఫారా లకు టర్మ్ లోన్లపై వడ్డీ సబ్సిడీతో పాటు విద్యుత్ చార్జీలపై యూనిట్‌కు రూ.2 వరకు, సంవత్సరానికి గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు, మూడు సంవత్సరాల పాటు విద్యుత్ టారిఫ్ సబ్సిడీ అందించనున్నాం.

అలాగే నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ (NLM) కింద అర్హత కలిగిన ప్రాజె క్టులకు 50 శాతం వరకు క్యాపిటల్ సబ్సిడీ, గరి ష్ఠంగా రూ.25 లక్షల వరకు అందించే అవకాశం కల్పించాం అని మంత్రి తెలిపారు.గ్రామీణ మహిళలకు ఉపాధి, అదనపు ఆదాయం కల్పించేందుకు బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా ఏటా 2,720 మదర్ పౌల్ట్రీ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. SERP, DRDAల ఆధ్వర్యంలో మహిళలకు 30–45 రోజుల శిక్షణ, వ్యాక్సినేషన్, డే-ఓల్డ్ చిక్స్ సరఫరా వంటి సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు. పౌల్ట్రీ ఉత్పత్తులకు విలువ జోడించి మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు PPP విధానంలో ఎగ్, చికెన్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తామని, ముఖ్యంగా చిత్తూరు, విజయవాడ, విశాఖపట్నం నగరాలను కేంద్రాలుగా చేసుకుని చికెన్ ప్రాసెసింగ్ ప్లాంట్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పౌల్ట్రీ షెడ్ల నిర్మాణానికి గతంలో ఉన్న డెవలప్‌మెంట్, బెటర్‌మెంట్ చార్జీల నుంచి పూర్తి మినహాయింపు కల్పించి, మున్సిపాలిటీలు, అర్బన్ అథారిటీల పరిధిలో గ్రామ పంచాయతీలకు సమానమైన తక్కువ ఫీజులతో అనుమతులు పొందేలా చర్యలు చేపట్టినట్లు మంత్రి వివరించారు. ప్రస్తుతం పౌల్ట్రీ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో మొక్కజొన్న ధరల పెరుగుదల కూడా ఒకటని పేర్కొన్న మంత్రి, ఫీడ్ వ్యయాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చించి నూక బియ్యాన్ని పౌల్ట్రీ ఫారాలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పౌల్ట్రీ రైతులు, పరిశ్రమ ప్రతినిధులు, సంబంధిత శాఖల సమన్వయంతో రాష్ట్ర పౌల్ట్రీ రంగాన్ని దేశంలోనే మరింత అభివృద్ధి చెందిన రంగంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.



## విజయవాడ ఇంద్రకీలాద్రి క్షేత్రంలో నూతన అన్నప్రసాద సదనంలో భక్తులకు అన్నప్రసాదాలు

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:
శనివారం ఉదయం నుంచి నూతన అన్నప్రసాద (భవనం) సదనంలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు శుచిగా, శుభ్రతతో, నాణ్యమైన అన్నప్రసాదాలను భక్తులకు అందిస్తున్నారు అమ్మవారి ఆలయ కార్య నిర్వహణ అధికారి శీనా నాయక్ స్వయంగా అన్నప్రసాదాల స్వీకరణ విభాగంలో భక్తులతో మాట్లాడి ఏర్పాట్లు ఏ విధంగా ఉన్నాయి, అన్నప్రసాదాలు స్వీకరణలో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే తెలియజేయుండని భక్తులకు సూచించారు. నూతన అన్న ప్రసాదాల సదనం ఎంతో అద్భుతంగా ఉందని ఆధ్యాత్మిక వాతావరణం శుభ్రతతో నాణ్యమైన ప్రసాదాల సేకరణ తమకెంతో సంతృప్తినిస్తోందని భక్తులు తెలియజేశారు.ఆలయ కార్యనిర్వహణాధికారి వికె శీనానాయక్ భక్తులతో మాట్లాడి, వారి సంతృప్తి స్థాయి తెలుసుకున్నారు. నూతన భవనంలోనే పూర్తి స్థాయిలో అన్నప్రసాద సేవలు కొనసాగిస్తామని ఈవో శీనా నాయక్ స్పష్టం చేశారు అన్నప్రసాద విభాగ అధికారులు తిరుమలేశ్వరరావు శ్రీనివాసరావు సిబ్బంది రమేష్, భక్తులకు కావలసిన ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు.

# చంద్రబాబు పాలనలో నే బీసీల కు ఆత్మగౌరవం

❖రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ❖ఆత్మగౌరవం పెంచేలా రక్షణ చట్టానికి మెరుగులు ❖స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతాం ❖గొడ్డలి పార్టీ హయాంలో బీసీ రిజర్వేషన్ల కుదింపు ❖ ❖2 ఏళ్ల కూటమి పాలనలో 90 శాతం హామీల అమలు ❖ చంద్రబాబు పాలనతో ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నాం ❖ జగన్ లో స్థానిక ఎన్నికల ఓటమి భయం : మంత్రి సవిత ❖విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్ లో బీసీ రక్షణ చట్టంపై అవగాహ సదస్సు లో పాల్గొన్న బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:
బీసీల ఆత్మగౌరవం పెంచేలా సీఎం చంద్రబాబు నాయుడు పాలిస్తున్నారని, ప్రజల్లోని కూటమి నాయ కులు, కార్యకర్తలు గర్వంతో తలెత్తుకుని వెళుతున్నారని, రాబోయే స్థానిక ఎన్నికల్లో తమదే విజయమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సం క్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ధీమా వ్యక్తంచేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి తీరు తామని స్పష్టంచేశారు. జగన్ లో మరో ఓటమి భయం కనిపిస్తోందన్నారు. కోర్టుల్లో నిలబడేలా బీసీ రక్షణ చట్టాన్ని రూపొందిస్తున్నామన్నారు. విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్ లో వివిధ బీసీ కార్పొరేషన్ చైర్మన్లతో శనివారం బీసీ రక్షణ చట్టంపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బీసీలంటేనే టీడీపీ అని స్పష్టంచేశారు. బీసీల ఆత్మగౌరవం పెంచేలా సీఎం చంద్రబాబు నాయుడు పాలిస్తున్నారన్నారు. గత ఎన్నికల ముందు మంత్రి నారా లోకేష్ నిర్వహించిన పాదయాత్రలో బీసీ రక్షణ చట్టం అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, బీసీ రక్షణ చట్టం అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోర్టుల్లో బలంగా నిలబడేలా ఈ చట్టానికి తుదిమెరుగులు దిద్దుతున్నామన్నారు. దీనిలో భాగంగా మంత్రివర్గ ఉప సంఘంతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో సమావేశాలు నిర్వహించామన్నారు. బీసీలను కులం, వృత్తుల పేరుతో దూషించినా, సంఘ బహిష్కరణలు చేసినా చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామన్నారు. జిల్లాల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తామని, రెండు నెలల్లో కేసుల దర్యాప్తు పూర్తి చేసేలా నిబంధనలు రూపొందించామని తెలిపారు. బీసీ రక్షణ చట్టాన్ని కోర్టుల్లో నిలబడేలా రూపొందిస్తున్నామన్నారు. ఇప్పుడు 156 బీసీ కులాలకు ప్రాతి నిధ్యం వహిస్తున్న కార్పొరేషన్ల చైర్మన్ల నుంచి అభిప్రాయాలు తీసుకున్నామని తెలిపా రు. దేశంలోనే మొట్టమొదటిసారిగా ఏపీలోనే బీసీ రక్షణ చట్టం అమలుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సవిత తెలిపారు.

### బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసి తీరుతాం...

స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని మంత్రి సవిత స్పష్టం చేశారు. 19987 అన్న ఎన్టీఆర్ తొలిసారిగా బీసీలకు రిజర్వేషన్లకు అమలు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు బీసీలకు 34 శాతానికి రిజర్వేషన్లు పెంచారన్నారు. 2019 తరవాత అధికారంలోకి వచ్చిన జగన్ ...బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి కుదించారన్నారు. గొడ్డలి పార్టీ చర్యతో బీసీలకు రాజ కీయంగా తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. మరోసారి 34 శాతం రిజర్వేషన్ల కల్పనకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి సవిత తెలిపారు.

### ధైర్యంగా ప్రజల్లోకి వెళుతున్నాం...

కూటమి ప్రభుత్వం ఏర్పడిన 26 నెలల్లో ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేశామని మంత్రి సవిత తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాల్లో అత్యధికంగా బీసీలే లబ్ధి పొందుతున్నారన్నారు. ఒకవైపు సంక్షేమ పథకాలు, మరో వైపు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం చంద్రబాబునాయుడు చేపడుతున్నారన్నారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా రహదారుల నిర్మా ణం చేపట్టామన్నారు. అన్ని ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రజల్లోకి ధైర్యంగా కూటమి నాయకులు, కార్య కర్తలు వెళ్లేలా సీఎం చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారని కొనియాడారు. త్వరలో ఆదరణ 3.0 ను అమలు చేస్తామని మంత్రి సవిత తెలిపారు.

### జగన్ కు ఓటమి భయం

సీఎం చంద్రబాబునాయుడు పాలనపై ప్రజల్లో సానుకూలత వ్యక్తమవుతోందని మంత్రి సవిత తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానిదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. జగన్ లో మరో ఓటమి భయం కనిపిస్తోం దన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీసీ కార్పొరే షన్ల చైర్మన్లకు మంత్రి సవిత దిశానిర్దేశం చేశారు. బీసీ రక్షణ చట్టంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలుకు కృషి చేస్తున్న సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు, మంత్రి నారా లోకేష్ కు, మంత్రి సవితకు వివిధ కార్పొరేషన్ చైర్మన్లు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి సవితకు ఘనంగా సత్కరించారు. అంతకు ముందు మం త్రి సవిత ... అన్న ఎన్టీఆర్, మహాత్మా జ్యోతిరా వు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షే మ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, పలు బీసీ సంక్షేమ శాఖ కార్పొరేషన్ చైర్మన్లు వీరంకి వెంకట్ గురుమూర్తి, నందం అబద్ధయ్య, పేరేపి ఈశ్వరరావు, నర్సింహాయాదవ్, మల్లెల ఈశ్వర్, దేవేంద్రప్ప, చిలకలపూడి పాపారావు, కొల్లు పెద్ది రాజు, సీఆర్ రాజన్, రుద్రకోటి సదాశివ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మంగినపూడి సాగర తీరంలో 63 అడుగుల మహాగణపతి

మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో

ఘనంగా సాగర తీర మహాగణపతి ఉత్సవాలు



ప్రజాభూమి ప్రతినిధి,
మచిలీపట్నం ప్రతినిధి:
మంగినపూడి సాగర తీరంలో నిర్వహిస్తున్న సాగర తీర మహాగణపతి ఉత్సవాలకు మచిలీపట్నం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. దేశ చరిత్రలోనే ప్రత్యేకంగా నిలిచే విధంగా సముద్ర తీరంలో వినాయక ఉత్సవాలను నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి.తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్యులు కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో జరుగు తున్న ఈ మహాగణపతి ఉత్సవాల్లో 63 అడుగుల భారీ గణపతి విగ్రహం భక్తులకు కనువిందు చేయనుంది. సాగర తీరంలో ఇంత భారీ స్థాయిలో మహాగణపతి ఉత్సవాలు నిర్వహించడం మచిలీ పట్నం నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

ఉత్సవాల ఏర్పాట్లను కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ దగ్గరుండి పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు.ఈ సందర్భంగా 63 అడుగుల మహాగణపతి స్వామివారిని దర్శించుకుని, సాగర తీరంలో జరుగుతున్న ఈ అద్భుతమైన గణపతి ఉత్సవాలను ప్రతి ఒక్క భక్తుడు కుటుంబ సమేతంగా విచ్చేసి తనివితీరా ఆస్వాదించాలని గోపు సత్యనారాయణ ఆహ్వానం పలికారు.

మచిలీపట్నం ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పేలా ఈ మహాగణపతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొల్లు రంగ, పామర్తి లక్ష్మణ్, బడే రమణ, గుమ్మడి అశ్విని తదితరులు పాల్గొన్నారు.

# మహాగణపతి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

## భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్ డీకే బాలాజి

ప్రజాభూమి ప్రతినిధి,మచిలీపట్నం:
మంగినపూడి బీచ్ తీరంలో సెప్టెంబర్ 14 నుంచి నిర్వహించనున్న మహాగణపతి ఉత్సవాలకు సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయం నుంచి వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ శాఖల వారీగా చేపట్టిన ఏర్పా ట్లను సమీక్షించి పలు కీలక సూచనలు చేశారు.ఉత్సవ ప్రాంగ ణంలో విద్యుత్ భద్రత విషయంలో ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా విద్యుత్ దీపాలు, వైరింగ్ తదితరాలను క్షు ణ్ణంగా పరిశీలించాలని, ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారులతో తనిఖీలు చేయించి భద్రతా ధ్రువీకరణ పొందాలని కలెక్టర్ ఆదేశించారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది, వాహనాలను అందుబాటులో ఉంచుతు న్నట్లు అధికారులు తెలిపారు. అవసరమైన వారికి వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉదయం నుంచి కార్యక్రమం ముగిసే వరకు రెండు షిఫ్టుల్లో వైద్యులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులతో కూడిన బృందాలు విధుల్లో ఉంటా యని, అంబులెన్స్‌ను కూడా అందుబాటులో ఉంచుతున్నట్లు అధికారులు కలెక్టర్కు వివరించారు. భారీగా భక్తులు తరలివచ్చే అవకా శం ఉన్నందున జన సమూహ నియంత్రణ, ట్రాఫిక్ రెగ్యులేష న్‌కు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా జనసందోహాన్ని నియంత్రించేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని, వాహనాల రాకపోకలు సజావు గా సాగేలా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేప ట్టాలని సూచించారు. విగ్రహాల నిమజ్జనం కోసం గిలకలదిండి హార్బర్ ప్రాంతాన్ని వినియోగిస్తున్న నేపథ్యంలో అక్కడ అవసరమైన బారికేడింగ్, లైటింగ్ తదితర ఏర్పాట్లను కలెక్టర్ సమీక్షించారు. అక్కడ అవసరమైన కనీస భద్రతా ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీ లించి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు స్వయంగా ప్రదే శాన్ని సంద ర్శించి పరిస్థితులను పరిశీలించాలని సూచిం చారు. నిమజ్జన ప్రాంతంలో మత్స్యశాఖ, మెరైన్ పోలీసు ల సమన్వయంతో మత్స్యకారులు, పడవలు, స్విమ్మర్లను లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్‌లతో సిద్ధంగా ఉంచుతున్నట్లు అధికారులు తెలిపారు.భక్తులకు నాణ్యమైన తాగునీరు, తగినన్ని మరుగు దొడ్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

తాగునీటి నాణ్య త ను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని, సరఫరా ప్రాం తాల్లో బాధ్యతాయుత సిబ్బందిని నియమించి నాణ్యతను నిర్ధారించాలని ఆదేశించారు. పారిశుధ్య చర్యల్లో భాగంగా ప్రధాన రహదారులు, పరిసర ప్రాంతాల్లో బుష్ క్లియరెన్స్, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు తదితర పనులు దాదాపు 95 శాతం పూర్త య్యాయని అధికారులు తెలిపారు. మిగిలిన పనులను త్వరి తగతిన పూర్తి చేసి ఉత్సవాలు జరిగే అన్ని రోజులూ పారిశు ధ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచిం చారు. ఉత్సవాల సందర్భంగా పది రోజుల పాటు ప్రతి రోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. భక్తుల రాకపోకలకు ఆర్టీసీ ద్వారా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రారంభంగా రెండు బస్సు లను నడిపి భక్తుల రద్దీని బట్టి అవసరమైన మేరకు బస్సుల సంఖ్యను పెంచుతామని తెలిపారు. బస్సుల టర్నింగ్, పార్కింగ్ ప్రాంతాలను పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని నిర్ణయించాలని కలెక్టర్ సూచిం చారు.



ఉత్సవా లకు వచ్చే ప్రతి భక్తుడికి సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వ యంతో పనిచేయాలని కలెక్టర్ డీకే బాలాజీ స్పష్టం చేశారు. చివరి నిమిషంలో తలెత్తే సమస్యలకు కూడా తక్షణమే స్పందించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి చిన్నపాటి లోపం కూడా పెద్ద సమస్యగా మారకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్లో బందరు ఆర్డీఓ కే సాంబశివరావు, కార్యక్రమ నోడల్ అధికారి డిఆర్డిఏ పీడీ హరిహరినాథ్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజాభూమి



## ఎస్సీ హాస్టల్ విద్యార్థినులకు శక్తి యాప్,సైబర్ నేరాలపై అవగాహన



ఏలూరు

ఏలూరు అమీనా పేటలోని ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థినులకు శక్తి యాప్, మహిళా భద్రత,సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్, డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో మహిళా ఎస్ఐ నాగ కళ్యాణి,శక్తి టీం సభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ నాగ కళ్యాణి మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో మహిళలు,బాలికలకు తక్షణ పోలీస్ సహాయం అందించేందుకు శక్తి యాప్ ఉపయోగపడుతుందని తెలిపారు.అత్యవసర సమయంలో 112కు కాల్ చేయడం ద్వారా సమీపంలోని శక్తి టీం సిబ్బంది వెంటనే స్పందిస్తారని చెప్పారు.అలాగే యాప్ ద్వారా మహిళల హక్కులు, చట్టాలు,హెల్ప్‌లైన్ నంబర్లు,సేఫ్టీ షేరింగ్ వంటి సదుపాయాలను ఉపయోగించుకోవచ్చని వివరించారు.అదేవిధంగా సైబర్ నేరాల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులు,అనుమానాస్పద మెసేజ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని,బ్యాంకు వివరాలు,ఓటీపీ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు.విద్యార్థినులు తమ తల్లిదండ్రులు, స్నేహితులకు కూడా సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.

## చింతలపూడిలో స్థానిక సంస్థల ఎన్నికలపై టీడీపీ విస్తృత స్థాయి సమావేశం




ఏలూరు జిల్లా

చింతలపూడిలో స్థానిక సంస్థల ఎన్నికలపై తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.ఏలూరు పార్లమెంట్ స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకురాలు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ఆధ్వర్యంలో, చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ సారథ్యంలో ఈ సమావేశం జరిగింది.ముఖ్య అతిథిగా ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) హాజరయ్యారు.ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, నియోజకవర్గ పరిశీలకులు రావి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి,జిల్లా ప్రధాన కార్యదర్శి జగ్గవరపు ముత్తారెడ్డి,రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శేషు పాల్గొన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు, నాయకులు,కార్యకర్తల సమన్వయంపై చర్చించారు.

## ప్రోటోకాల్‌పై టీడీపీ యువగళం అసంతృప్తి

ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి



మండలంలోని పెద్దేవం, తాళ్లపూడిలో శనివారం విలేజ్ హెల్త్ క్లినిక్ లను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకం మీద ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌కు ప్రోటోకాల్ ప్రకారం తగిన గౌరవం, ప్రాధాన్యం కల్పించలేదంటూ టీడీపీ యువగళం నాయకులు కాకర్ల సత్యేంద్ర అసంతృప్తి వ్యక్తం చేసారు. గత ఐదేళ్లుగా పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. వైసీపీ హయాంలో ప్రోటోకాల్ నాయకులకు ఇచ్చిన గౌరవంతో పోలిస్తే, ప్రస్తుతం కూటమి నాయకులకు తగిన ప్రాధాన్యం దక్కకపోవడం ఆలోచించాల్సిన విషయమని పేర్కొన్నారు. కార్యకర్తల బాధను అర్థం చేసుకుని, ప్రోటోకాల్ విషయంలో న్యాయం చేయాలని టీడీపీ యువగళం కోరింది.

## తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల అత్యవసర సమావేశం నిర్ణయించడం జరిగింది..




ప్రజా భూమి ప్రతినిధి–కూనవరం

మండలంలోని టేకుల బోరు తెలుగుదేశం పార్టీ ఆఫీసులో కార్యకర్తల అత్యవసర సమావేశం జరుపుకోవడం జరిగింది ఈ సమావేశంలో ముఖ్య ఉద్దేశం ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్టి సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీష దేవి 16/9/2026 బుధవారం మండలం లో పర్యటన కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమావేశంలో కార్యకర్తల నాయకుల సూచనలు సలహాలు తీసుకోవడం జరిగింది మన మండలంలో ఉన్న సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాలని కొందరు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ఎడవల్లి భాస్కరరావు క్లస్టర్ ఇన్చార్జి మోసం రాము కోశాధికారి సోమక సత్యనారాయణ కార్యదర్శి బట్టు భాస్కరరావు శ్రీమంతుల సతీష్ నియోజకవర్గ ఎస్టి కార్యవర్గ సభ్యులు సోడి మధుసూదన్ రావు బండారు శివయ్య బూతు ఇన్చార్జి బోడ వెంకటేశ్వర్లు యూనిటీ ఇన్చార్జి దాసరి నాగేశ్వరరావు గ్రామ శాఖ అధ్యక్షులు దన్నూరి శ్రీనివాసరావు మునేశ్వరావు కో యూనిట్ సోడి వీరభద్రం కార్యదర్శి నాసుపల్లి వెంకటేశ్వర్లు బూతు ఇన్చార్జి ఎడ్ల రాంబాబు ఎడ్ల వెంకటేశ్వర్లు యూనిటీ ఇన్చార్జి దాసరి నాగేశ్వరరావు మండల ఎస్టి కమిటీ అధ్యక్షులు కరక సర్వేశ్వరావు యూత్ ఎల్లంకి వెంకన్న గ్రామ కమిటీ అధ్యక్షులు చిచ్చుడి అప్పా రావు ప్రధాన కార్యదర్శి దర్మల లక్ష్మణరావు అంజన్ రావు చిన్నబి సోడి సీతయ్య మాడెం సీతా రాములు శ్రీమంతుల శ్రీనివాసరావు ముచిక వెంకటేశ్వర్ల కారం రత్తయ్య పోడియం బుచ్చిరాజు నాగిరెడ్డి సింహాద్రి శీను అరవ శేఖర్ తెల్లం పోద్దయ్య తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్తపేటలో 'ఇంటింటికీ తెలుగుదేశం-2026' విజయవంతం

ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట



కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం–2026' కార్యక్రమం కొత్తపేట నియోజకవర్గంలో విజయవంతంగా ముగిసింది. డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేట నియోజకవర్గంలో 47 రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు 81,999 కుటుంబాల్లో 73,603 ఇళ్లను సందర్శించి 90 శాతం లక్ష్యాన్ని చేరుకున్నట్లు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి తెలిపారు. మండలాల వారీగా చూస్తే ఆత్రేయపురం మండలంలో 18,958 కుటుంబాలను వంద శాతం సందర్శించగా, రావులపాలెం మండలంలో 23,965 కుటుంబాలకు గాను 19,457, కొత్తపేట మండలంలో 21,159 కుటుంబాలకు గాను 18,757, ఆలమూరు మండలంలో 19,053 కుటుంబాలకు గాను 16,431 కుటుంబాలను కలిశారు. అదేవిధంగా 20 వేలకుపైగా జనాభా ఉన్న కొత్తపేట గ్రామంలో 6,716 కుటుంబాలకు గాను 6,279, రావులపాలెంలో 6,940 కుటుంబాలకు గాను 4,179 కుటుంబాలను పార్టీ శ్రేణులు సందర్శించినట్లు తెలిపారు. గ్రామాల్లో కొంతమంది మరణించడం, మరికొన్ని కుటుంబాలు అందుబాటులో లేకపోవడం వల్ల అన్ని ఇళ్లను సందర్శించడం సాధ్యం కాలేదని పేర్కొన్నారు. అయినప్పటికీ దాదాపు ప్రతి కుటుంబాన్ని కలుస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను తెలియజేయడంతో పాటు ప్రజల సమస్యలు, అభిప్రాయాలను నేరుగా సేకరించినట్లు వివరించారు. క్షేత్రస్థాయి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడం ద్వారా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఈ కార్యక్రమం బలమైన వారధిగా నిలిచిందని, ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందేలా పార్టీ నాయకులు సమష్టిగా కృషి చేశారని ముత్యాల బాబ్జి తెలిపారు.

## పింఛన్లు దరఖాస్తుల గడువు తేది పొడిగించాలి

### తాసిల్దార్, ఎంపీడీవోల ద్వారా ప్రతి అర్హుడికి పింఛన్లు అందించాలి

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

సామాజిక పింఛన్లు దరఖాస్తులు పంపడానికి కనీసం ఈ నెలాఖరు నాటి వరకు గడువు తేదీని పెంచాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు. పింఛన్ల దరఖాస్తుల సమయం ఏడో తేదీ నుంచి 16వ తేదీ వరకు తీసుకునే సమయం ఇచ్చినప్పటికీ ఇందులో నాలుగు రోజులు ప్రభుత్వ సెలవులే ఉన్నాయని మిగిలిన ఏడు రోజుల్లో ఇన్ని కాగితాలు సమర్పించి దరఖాస్తులు సమర్పించుకోవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ల కోసం దరఖాస్తులు కు జతపరిచే కొన్ని కాగితాలు సమర్పణకు ఎంతో సమయం పడుతుందని అందువల్ల తప్పక గడవును పొడిగించాల్సిన అవసరం ఉందంటున్నారు. గడువు పెంచకపోతే వేలాదిమంది అర్హులైన నిరుపేదలకు సామాజిక పింఛన్లు అందకుండా పోతాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అదేవిధంగా హౌస్ హోల్డ్ మ్యాపింగ్ సౌకర్యం కూడా తక్షణమే కల్పించాలని కోరుతున్నారు. ఈ విషయమై సీఎం చంద్రబాబు నాయుడు దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**తాసిల్దార్, ఎంపీడీవోల ద్వారా ప్రతి అర్హుడికి పింఛన్ దారులను ఎంపిక చేయాలి**

సామాజిక పింఛన్లకు అర్హత కలిగిన పేదల పేర్లు పొరపాటున ఉద్యోగుల రేషన్ కార్డులో కలిసిపోవడం, ఒకే రేషన్ కార్డు కుటుంబములో ఇద్దరు సామాజిక పింఛన్లకు అర్హులైన వారున్నప్పటికీ పింఛను దరఖాస్తులు తీసుకోవడం లేదు. దీంతో వేలాదిమంది అర్హులైన వారు పింఛన్లకు నోచుకోకుండా కోల్పోతున్నారు. అందువల్ల నిజమైన అర్హులైన పింఛన్ లబ్ధిదారులను గుర్తించడానికి ఎంపీడీవో, తాసిల్దార్ల నేతృత్వంలో ఎంపిక చేయాలని దరఖాస్తు దారులు కోరుతున్నారు. దీనికోసం గడువును కూడా ఈ నెలాఖరు వరకు కనీసం పెంపుదల చేయాలని, దరఖాస్తుదారులు కోరుతున్నారు.

## ప్రతీ కుటుంబానికి ఆరోగ్య భద్రత కల్పించాలన్నదే ముఖ్యమంత్రి సంకల్పం

**మొత్తం 68మందికి రూ.60,16,241ల విలువైన చెక్కుల పంపిణీ చేసిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.**

ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట



రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి ఆరోగ్యభద్రత కల్పించాలనేదే ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం జరిగిన సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి కోసం ఎవరికి ఎటువంటి సహకారం కావల్సి ఉన్నా ఆఫీసులో సంప్రదించాలన్నారు. ఎవరైనా తక్షణం వైద్యం చేయించుకోవాలనుకుంటే లెటర్ ఆఫ్ క్రెడిట్ క్రింద ఆసుపత్రి నుంచి ఎస్టిమేషన్ తీసుకువస్తే ఉదాహరణకు ఆసుపత్రి వారు రూ.5లక్షలు ఖర్చవుతుందని అంచనా వేస్తే ఆ లేఖ పట్టుకు నివెళ్లి సీఎం సహాయనిధికి దరఖాస్తు చేస్తే ఎల్వోసీ కింద రూ.2.5 లక్షల వరకూ మంజూరు చేస్తున్నారని తెలిపారు.

మరో విధానం లో ఆసుపత్రిలో ఖర్చుల బిల్లులు తీసుకెళితే వాటిని బట్టి వైద్యానికి ఇంత ఖర్చవుతుందనే అంచనాను బట్టి సహాయం మంజూరు చేస్తు న్నారని తెలిపారు. మన నియోజకవర్గంలో ఎక్కువమందికి సీఎం చంద్రబాబు సహాయం అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా, పేదలకు మేలు కలగాలనే తలంపుతో కోట్లాది రూపాయలు ముఖ్యమంత్రి సహాయంగా అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా నాలుగు మండలాల పరిధిలో 62 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, 6 ఎల్వోసిలు మొత్తం 68 మందికి రూ.60,16,241ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.

## ముంపు ప్రాంత నిర్వాసిత గ్రామాలు చలో ఐటీడీఏ కార్యక్రమం జయప్రదం చేయండి

ప్రజా భూమి ప్రతినిధి–కూనవరం



మండలంలోని అయ్యవారిగూడెం,పల్లూరు కొండాయిగూడెం గ్రామాలలో పోలవరం నిర్వాసితుల సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు గిరిజన సంఘం నాయకులు పదం రాజు, మడకంపొద్దయ్య మడెం బాబురావు గ్రామస్తులతో సమావేశం నిర్వహించి ఈ సమావేశంలో నాగేశ్వరావు మాట్లాడుతూ కూనవరం మండలంలోని 39 గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ పరిహారము పునరావాసం కల్పించాలని 12 గ్రామాలకు భూ పరిహారం ఇవ్వాలని 2027 నాటికి ఈ ప్రాంతాన్ని కాళీ చేపిస్తామని పోలవరం ప్రాజెక్టులో నీటిని నిల్వ చేస్తామని రాష్ట్ర ప్రయోజనాలకు వినియోగిస్తామని ప్రకటనలు చేస్తున్నారు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాలు ఇప్పటివరకు ఎటువంటి పరిహారానికి నోచుకోని గిరిజన ప్రాంత ప్రజలు గ్రామాలకు సర్వేలు చేసి అసంపూర్తిగా వదిలేసిన ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా తప్పు పట్టారు మిగిలిన అన్ని గ్రామాలకు తక్షణమే సర్వేలు చేసి ఇప్పటికే చేసిన గ్రామాలతో పాటు సమానంగా మండల ప్రజలు ఒకేసారి ఖాళీ చేయించాలని నిర్వాసితుల పట్ల ఒకే దృక్పథంతో చూడాలని అలాగే 18 సంవత్సరాలు నిండిన యువత యువకులకు కట్ అఫ్డేట్‌తో సంబంధం లేకుండా పూర్తి పరిహారం నష్టపరిహారం కల్పించాలని తీవ్ర మనోవేదనకు గురవుతున్న యువత యువకులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ పోలవరం నిర్వాసితులంతా ఏకతాటిపై ఐటిడి చలో ఐటిడిఏ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ గ్రామాల సమావేశాలలో ఉదయ పొద్దయ్య గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కామ్రేడ్ సీతారాం ఏచూరి రెండవ ఘనంగా వర్ధంతి వేడుకలు

ప్రజా భూమి ప్రతినిధి–కూనవరం



మండల సిపిఎం పార్టీ కార్యాలయం మార్త శ్రీరామ్మూర్తి భవనము నందు కామ్రేడ్ సీతారం ఏచూరికి 2వ వర్ధంతి ఘన నివాళి అర్పించడం జరిగింది. మండల కార్యదర్శి బాబు బోరయ్య మాట్లాడుతూదభారత కమ్యూనిస్టు ఉద్యమంలో తనదైన ముద్ర వేసిన గొప్ప మార్క్సిస్టు సిద్ధాంతవేత్త, సీపీఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ఈ సందర్భంగా స్మరించుకుందాం.కామ్రేడ్ సీతారాం ఏచూరి 1952 ఆగస్టు 12న జన్మించారు. విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాల పట్ల ఆకర్షితులై, ఎస్ఎఫ్ఐలో చురుకైన పాత్ర పోషించారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో విద్యార్థి నాయకుడిగా ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడారు. అత్యవసర పరిస్థితి కాలంలో కూడా నిర్బంధాలను, అణచివేతను ఎదుర్కొని ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిలబడ్డారు.సీపీఐ(ఎం)లో అంచెలంచెలుగా ఎదిగిన ఆయన 1992లో పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2015లో పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యత లు స్వీకరించి, 2024 వరకు పార్టీకి నాయ కత్వం వహించారు. రాజ్యసభ సభ్యుడిగా కూడా ప్రజా సమస్యలను సమర్థవంతంగా ప్రస్తావించారు.మతతత్వానికి వ్యతిరేకంగా, లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, కార్మి కులు, రైతులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన నిరంతరం పోరాడా రు. మార్క్సిజం–లెనినిజం సిద్ధాంతాలను భారతదేశ సామాజిక పరిస్థితులకు అన్వయిస్తూ పార్టీ శ్రేణులకు మార్గదర్శనం చేశారు.

2024 సెప్టెంబర్ 12న కామ్రేడ్ సీతారాం ఏచూరి మనకు దూరమయ్యారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ప్రజా ఉద్యమాల పట్ల ఆయన చూపిన నిబద్ధత, మార్క్సిస్టు సిద్ధాంతంపై ఆయనకున్న విశ్వాసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేసిన పోరాటం మనకు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తాయి.ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి. కార్మికులు, కర్షకులు, గిరిజ నులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఐక్యంగా పోరాడుతూ, మతతత్వం–విభ జన రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య లౌకిక శక్తులను బలోపేతం చేయాలి. ఈ కార్య క్రమంలో పాల్గొన్న మండల కమిటీ సభ్యులు తాలూరి శ్రీనివాస్ తెల్లం తమ్మయ్య మాడెం బాబు మడకం నాగమణి ఎంపీటీసీ ధర్మల అమ్మాజీ సోడే శంకర్ మడకం శిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేవరపల్లి తల్లాడ హైవేపై ఆగి ఉన్న లారీని ఢీకొన్న ట్రావెల్ బస్సు.

**ప్రమాదంలో 1 మృతి, 17 మందికి పైగా గాయాలు.**

ప్రజాభూమి బ్యూరో–ఏలూరు జిల్లా



దేవరపల్లి, తల్లాడ గ్రీన్ఫీల్డ్ హైవే హైదరాబాదు తదితర ప్రాంతాలకు దూరం తగ్గించి ప్రయాణ సమయాన్ని వ్యయాన్ని తగ్గించాలన్న ముందస్తు ఆలోచనతో ఏర్పాటు చేసిన గ్రీన్ ఫీల్డ్ హైవేపై వరుస ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తరచుగా ఈ హైవేపై ఏదో ఒక చోట ప్రయాణికులు మృత్యువాత పడాల్సిందే. హైవే నిర్వాకులు ఇటువంటి ప్రమాదాలను జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు పైన దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తాజాగా శనివారం తెల్లవారుజామున ఒక ప్రమాదం చోటుచేసుకుంది.చింతలపూడి మండలం యండపల్లి సమీపం లో గ్రీన్ ఫీల్డ్ హైవే పై ప్రవేట్ ట్రావెల్ (ఏపీ 39 డబల్యు 3179 ) నెంబర్ గల బస్సు ప్రమాదానికి గురైంది. తెల్లవారుజామున ఆగిఉన్న లారీని( కే ఏ.8893) ఢీకొన్న బస్సు ఒకరు మృతి.17 మందికి పైగా ప్రయాణికులు తీవ్ర గాయాల పాలయ్యారు. ప్రయాణికులందరూ నిద్రావస్థలో ఉండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. క్షణాల్లో జరిగిపోయిన ప్రమాదంలో ప్రయాణికులు తీవ్ర ఆర్తనాధలు చేశారు. ప్రమాదానికి గురైన బస్సు హైదరాబాద్ నుండి విజయనగరం వెళ్తున్నట్లు ప్రయాణికులు తెలియజేశారు. బస్సు ప్రమాదంలో మృతు చెందిన వ్యక్తి ఆ బస్సు కు సంబంధించిన క్లీనర్గా గుర్తించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి చేరవేశారు. ప్రమాదం జరిగిన విషయాలు తెలుసుకున్న స్థానిక చింతలపూడి సర్కిల్ ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్. ఎస్సై సతీష్ సంఘటనకు స్థలానికి చేరుకుని ప్రమాదానికి సంబంధించిన విషయాలను సేకరిస్తున్నారు. జరిగిన ప్రమాదంపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ కొనసాగుతుందని సిఐ తెలిపారు. ప్రమాదం జరుగుతున్న ప్రాంతాలను హైవే అధికారులు ప్రమాదాలు నిరోధించేందుకు తగిన చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుకుంటున్నారు.

## మట్టి వినాయక ప్రతిమల ఉచితంగా పంపిణీ

ప్రజాభూమి ప్రతి నిధి–పాలకొల్లు


పాలకొల్లు యునైటెడ్ కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఈ రోజు స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర దేవస్థానం వద్ద మట్టితో తయారుచేసిన వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రకృతి పరిరక్షణ ధ్యేయంగా క్లబ్ సభ్యులు వారి చేతులతో మట్టిలో తులసి విత్త నాలు కలిపి వినాయక విగ్రహాలను తయారు చేయడం జరిగింది. ఇవి మరల నిమజ్జనాని మన పెరట్లోనే చేసినట్లయితే పూజా విధానానికి కూడా ఉపయోగపడతాయని సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ విధంగా తయారుచేసిన 150 వినాయక ప్రతిమలను, వినాయక వ్రతకల్పం పుస్తకాలను మరియు ప్లాస్టిక్ నివారణ ధ్యేయంగా క్లాత్ బ్యాగ్స్ ను కూడా ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ దేవరపు కాంచనమాల ట్రెజరర్ తోట గాయత్రి, మంగిన అరుణ, జక్కంపూడి మదన్,సంగినీడి రంగారావు, గంధం ఏసు పాదం, సిరిగినీడి



రాము,కానూరి ప్రభాకర్ మరియు సభ్యులు పాల్గొనడం జరిగింది.

# ఎల్ నినో.. మరింత భీకరం. అంచనాలకు మించిన స్థాయిలో...

ప్రజాభూమి బ్యూరో-ఏలూరు జిల్లా.
పసిఫిక్ మహాసముద్రంలో చోటుచేసుకుంటున్న వాతావరణ మార్పులపై భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ.. ఇస్రో జరిపిన తాజా పరిశోధనల్లో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పసిఫిక్ మహాసముద్ర పరిధిలో ఎల్ నినో ప్రభావం ముందుగా అంచనా వేసిన దాని కంటే తీవ్రంగా ఉన్నట్లు తేలింది. పసిఫిక్ మహాసముద్రం గగనతలంపై భారీగా మార్పులు చోటు చేసుకుంటోన్నాయని, ఇవి భవిష్యత్తులో గ్లోబల్ క్లైమేట్ వ్యవస్థపై చూపించబోయే తీవ్ర పర్యావరణ ప్రభావాలకు కేంద్రబిందువు అవుతుందని నాసా ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇస్రోకు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సైంటిస్టులు తాజాగా ఎల్ నినోపై ప్రత్యేకంగా శాటిలైట్ల ద్వారా అధ్యయనం చేశారు. గతంలో ప్రయోగించిన ఓషన్ శాట్ 3, ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ డేటాను దీన్ని ప్రాతిపదికగా తీసుకున్నారు. ఓషన్



శాట్ కలర్ మానిటర్ 3 ( ఓ సీఎం -3), ఈఓఎస్-6 స్కాటెరోమీటర్ ఉపగ్రహాల నుంచి సేకరించిన కీలక డేటాను విశ్లేషించారు. దీని వివరాలను తాజాగా తన అధికారిక ఎక్స్ అకౌంట్ లో పొందుపరిచింది ఇస్రో.

ఇందులో భాగంగా 2023 నుంచి 2026 వరకు ఏప్రిల్, మే, జూన్ నెలల్లో సముద్ర ఉపరితల గాలులు, క్లోరోఫిల్ ఎ పరిమాణంలో సంభవించిన మార్పులను నిశితంగా అంచనా వేశారు. దీని ప్రకారం సాధారణంగా పసిఫిక్ రీజియన్ లో తూర్పు దిశగా వీచే గాలులు ఒక్కసారిగా బలహీనపడి, పడమర దిశగా వీచడం ప్రారంభించాయి. దీనివ్ల సముద్ర గర్భంలో సహజంగా చోటు చేసుకునే అప్ వెల్లింగ్.. అంటే కింది నీరు పైకి రావడం అనే ప్రక్రియ పూర్తిగా మందగించింది.

**గట్టిగా దెబ్బకొట్టిన ఎల్ నినో: విస్తుపోయే వాస్తవాలు**

ఫలితంగా చల్లటి నీరు సముద్ర ఉపరితలానికి చేరట్లేదు. ఫలితంగా.. సముద్రంలో పెరిగే ఏకకణ సూక్ష్మజీవులైన ఫైటోప్లాంక్టన్ వృద్ధి నిలిచిపోయింది. క్లోరోఫిల్ పరిమాణం భారీగా పడిపోయింది. సాధారణ వాతావరణ పరిస్థితులు నెలకొన్న 2024, 2025 జూన్ నెలతో పోలిస్తే, ఎల్ నినో పరిస్థితులు ప్రారంభమైన ఈ ఏడాది జూన్ నాటికి క్లోరోఫిల్ స్థాయిలో విపరీతమైన వ్యత్యాసం కనిపించింది. ఆందోళనకరంగా దీని స్థాయి పడిపోయింది. ప్రత్యేకించి.. పశ్చిమ, మధ్య పసిఫిక్ లోని భూమధ్యరేఖ ప్రాంతాల్లో ఈ మార్పు కొట్టొచ్చినట్లు కనిపించింది. సముద్ర ఉపరితల గాలులు, అక్కడ పెరిగే జీవజాతుల ఉత్పాదకతకు మధ్య ఎంతటి బలమైన పరస్పర సంబంధం ఉందో ఈ అధ్యయనం స్పష్టం చేసినట్టయింది. ప్రపంచ వాతావరణ సంస్థ గతంలో వెల్లడించిన అంచనాలకు అనుగుణంగానే ఇస్రో ఉపగ్రహాలు సేకరించిన తాజా డేటా ఉండటం వంటి ప్రాధాన్యతను సంతరించుకుంది.

**అత్యంత తేజోమయంగా వెలిగిపోనున్న ఆ గ్రహం: నేరుగా చూసే అద్భుత అవకాశం.**

ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో ఎల్ నినో పరిస్థితులు బలపడేందుకు దాదాపు 80 శాతం వరకు అవకాశాలు ఉన్నాయని డబ్ల్యూఎంఓ ముందే హెచ్చరించింది. ఇదే విషయాన్ని ఇస్రో సేకరించిన తాజా డేటా నిర్ధారించింది. జూలై నెలాఖరు నాటికి ఈ ప్రక్రియ మరింత వేగవంతమైంది. ఒకవేళ ఎల్ నినో ప్రభావం గనుక ఇంకా తీవ్రమైతే, క్లోరోఫిల్ తక్కువగా ఉండే ప్రాంతాలు మరింత ముప్పును ఎదుర్కొనడం ఖాయంగా కనిపిస్తోంది.

## ఘనంగా అమరజీవి కామ్రేడ్ సీతారాం ఏచూరి 2 వ వర్ధంతి

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.
మండలంలోని రేఖపల్లి సి పి యం పార్టీ కార్యాలయంలో అమరజీవి కామ్రేడ్ సీతారాం ఏచూరి 2 వ వర్ధంతి నీ సిపిఎం నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు అమరజీవి కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఆయనకు నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం రాజులు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సీపీఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగిస్తూ దేశంలోని కార్పొరేట్, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడటమే ఆయనకు అర్పించే ఘనమైన నివాళి అని పిలుపునిచ్చారు.

## ద్రాక్షారామం శ్రీ భీమేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వాహక అధికారిణి దుర్గాభవాని సింగిల్ ట్రస్టీగా ప్రమాణస్వీకారం

### మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు కృతజ్ఞతలు





ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానంనకు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్ కాకినాడ వారి ఉత్తర్వుల మేరకు ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానంకార్యనిర్వాహణాధికారిణి మరియు సహాయ కమిషనర్ ఎ.వి. దుర్గాభవాని శనివారం సింగిల్ ట్రస్టీగా ప్రమాణ స్వీకారం చేసారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారిణి దుర్గ భవాని మాట్లాడుతూ సింగిల్ ట్రస్టీగా తనకు అవకాశం కల్పించిన మంత్రి వాసంశెట్టి సుభాష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచనలనను అసరించి గ్రామస్తులు, భక్తుల కోరిక మేరకు శ్రీ స్వామివారి దేవస్థానంలో నిర్వహించు కార్తీకమాస దీపారాధన మహోత్సవాన్ని మరింత పటిష్టంగా, అంగరంగవైభవంగా నిర్వహించుటకు దేవదాయశాఖ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాణ స్వీకారం మహోత్సవంలో రామచంద్రపురం దేవాదాయ శాఖ తనిఖీదారు ఆర్ బాలాజీ రాంప్రసాద్, కూటమి నాయకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలు ఖాళీ చేసే నాటికి 18 ఏళ్లు నిండిన వారందరికీ ఆర్,ఆర్ వర్తింప చేయాలి.

### లేదంటే నిర్వాసితుల ఐక్యం చేసి పోరాడుతాం

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.
పోలవరం నిర్వాసితులను అన్యాయం చేయటం ఇప్పటికైనా ఆపాలని కటాఫ్ తేదీ తో సంబంధం లేకుండా గ్రామాలు ఖాళీ చేసే నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి నిర్వాసితుడికి ఆర్ అండ్ ఆర్ వర్తింపజేసి పురావాసం కల్పించాలని ఐద్వా (అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం) విఆర్ పురం మండల కార్యదర్శి సోడి రమాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నాడు ఆ సంఘం అధ్యక్షురాలు కారం లక్ష్మి అధ్యక్షతన జరిగిన మహిళా సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, నిర్వాసితులను పూర్తిగా అన్యాయం చేసే విధంగా ప్రభుత్వ కటాఫ్ తేదీలు ఉన్నాయని, నష్టపరిహారం ఇచ్చి పునరావాసం కల్పించి గ్రామాలు ఎప్పటికీ ఖాళీ చేస్తారో తెలియదు కానీ, హడావిడిగా కట్ ఆఫ్ తేదీలు ప్రకటించి సర్వేలు జరిపి అక్కడక్కడ కొంతమందికి ఆర్ అండర్ ప్యాకేజీ ఇవ్వడం అనేది సరైనది కాదని అన్నారు. ఒకే మండలంలో ఒకచోట కట్ ఆఫ్ తేదీ ప్రకటించి 10 సంవత్సరాలు అవుతుందని, మరోచోట నాలుగు సంవత్సరాలు అవుతున్నదని కానీ ఇప్పటికీ ఆయా గ్రామాల్లో పూర్తిస్థాయిలో నష్టపరిహారం భూమికి భూమి ఇచ్చిన దాఖలాలు లేవని, పునరావాసం కల్పించిన పరిస్థితి లేదని తెలిపారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో వివాహాలు చేసుకుని పిల్లలతో



కూడిన 18 సంవత్సరాలు నిండిన కుటుంబాలు అనేకం ఉన్నాయని వారందరికీ గ్రామాలు కాలిచేసేనటికి నాటికి ఆర్ అండ్ ఆర్ వర్తింపజేసి పునరావాసం కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. లేదంటే వేలాది కుటుంబాలు ఎక్కడికి వెళ్లాలో ఏమి చేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలోకి వెళ్తాయని రోడ్డున పడటం తప్ప ఆ కుటుంబాలకు మరో దారి లేదని ఆమె ఆవేదన చెందారు. రాష్ట్ర అభివృద్ధి కోసం రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడం కోసం ప్రాజెక్ట్ నిర్మాణం కొరకు త్యాగం చేసిన త్యాగదనులను రోడ్డున పడేస్తారా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా గ్రామాలు ఖాళీ చేసేనాటికి ఒక కటాఫ్ తేదీ ప్రకటించి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరికీ ఆర్ అండ్ ఆర్ వర్తింపజేసి పునరావాసం కల్పించాలని ఆలోచన చేయకపోతే అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో నిర్వాసితులందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మహిళా సంఘం నాయకులు సున్నం పార్వతి, పులి భద్రమ్మ, చిక్కాల వీరమ్మ, తోడం భూబమ్మ, మడకం దారమ్మ, రమాదేవి, భద్రమ్మ, రాధ, గొర్రె రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ గుమ్మా తనూజ రాణి పర్యటనను విజయవంతం చేయాలి

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.
నేడు ఆదివారం ఉదయం 10:00 నుండి వి.ఆర్ పురం మండలంలో మొట్ట మొదటి సారిగా అరకు పార్లమెంటరీ సభ్యులు గుమ్మ తనుజారాణి పర్యటన ఉన్నదనీ, అలాగే ఎంపీతోపాటు మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి వస్తున్నారని, వారి పర్యటనను విజయవంతం చేయాలని, వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు, మండల కమిటీ వైయస్సార్సీపి కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



రేఖపల్లి వద్ద శనివారం నిర్వహించిన అత్యవ సర సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యలు తెలుసుకుని రాబోవు పార్లమెంట్ సమావేశాల్లో సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వాన్ని నిలదీస్తారనీ, వి ఆర్ పురం మండలంలో రాజీవ్ సెంటర్లో ఒడ్డుగూడెం గ్రామ పంచాయతీకి సంబంధించిన నిర్వాసితులతో ఉదయం ఉదయం 10 గంటల 30 నిమిషాల కు మాట్లాడుతారనీ, తదనంతరం 2 గంటల సమయంలో చిన్న మట్టపల్లి గ్రామపంచాయతీ నిర్వాసితులతో చింతరేవుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతారనీ, కావున ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తాజా మాజీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు వివిధ హోదాల్లో ఉన్న నాయకులు కార్యకర్తలు అందరూ పాల్గొనవలసిందిగా కోరుతున్నామని అన్నారు.

## ఎంపీటీసీ ఎన్నికలకు ఫోటో ఓటర్ల జాబితా సిద్ధం

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి
ఆగిరిపల్లి మండల ప్రజాపరిషత్ పరిధిలో రెండో సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల ఫోటో ఓటర్ల జాబితాలను శుక్రవారం ప్రచురించినట్లు ఎంపీడీవో తెలిపారు. మండలంలోని 18 మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలకు సంబంధించిన ఫోటో ఓటర్ల జాబితాలను ప్రజల పరిశీల నార్థం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రదర్శించినట్లు చెప్పారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంతో పాటు మండల పరిధిలోని 25 గ్రామపంచాయతీ కార్యాలయాల్లోనూ జాబితాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సంబంధిత ఓటర్లు తమ పేర్లు, ఇతర వివరాలను జాబితాలో పరిశీలించుకుని, ఏవైనా అభ్యంతరాలు లేదా సవరణలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు.



## గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్

ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గణేష్ మండపాలకు ఉచితంగా తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు ఇవ్వనున్నట్లు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ ్యూాజ్యూణజూ, సూపరింటెండెంట్ ఇంజనీర్, బి. రాజేశ్వరి తెలిపారు. సెప్టెంబరు 14 నుంచి 22 వరకు గ్రామీణ ప్రాంతాల్లో 3KW, పట్టణాల్లో 5KW వరకు ఈ సదుపాయం ఉంటుందన్నారు. ఆసక్తిగల నిర్వాహకులు దరఖాస్తులను పూర్తి చేసి స్థానిక AEలకు అందజేయాలన్నారు. విద్యుత్ సిబ్బంది మండపాలకు వచ్చి ఉచితంగా లైను వేసి మీటరు బిగిస్తారని, డబ్బులు చెల్లించవలసిన అవసరం లేదని ఆమె సూచించారు.



## వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాలను ప్రతిష్టించే వారు ఈ క్రింది నిబంధనలను తప్పనిసరిగా పాటించవలెను ఎస్ఐ

ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం
మండలంలోని వినాయక చవితి పందిర్లు వినాయక చవితి గణేష్ ఉత్సవాలు సందర్భంగా సింగిల్ విండో విధానం ద్వారా ఆన్లైన్లో అప్లై చేసుకుని పర్మిషన్ తీసుకోవలెను, గణేష్ మండ పాల వద్ద గాని గణేష్ నిమజ్జన ఊరేగింపు సమయంలో గానీ డీజేలకు ఎటువంటి అనుమతి లేదు. గణేష్ మండపాల వద్ద గాని గణేష్ నిమజ్జన ఊరేగింపు సమయంలో ఎటువంటి గొడ వలు గాని అల్లర్లు గాని జరగకుండా చూసుకోవలసిన బాధ్యత మండపాలు పెట్టిన కమిటీ వారి దే, గణేష్ మండపాల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా చూసుకుంటూ గణేష్ మండపం వద్ద రాత్రి సమయంలో విగ్రహ భద్రత చూసుకొను నిమిత్తం కమిటీలోని ఒకరు లేదా ఇద్దరూ రాత్రి సమయంలో నిద్రించవలెను ఈ వినాయక చవితి పండుగ ను అందరూ సంతోషంగా జరుపుకోవాలని కోరుకుంటున్నాను అని స్థానిక ఎస్ఐ బొడ్డు రామకృష్ణ తెలియజేశారు.



## వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారికి గన్నవరం దంపతుల సేవాభావం

-అన్నప్రసాదానికి రూ. లక్ష విలువైన స్టీల్ పాత్రల విరాళం.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.
కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో అన్నప్రసాద సేవకు గన్నవరం వాస్తవ్యులు, యూనివర్సల్ ప్రింట్ సిస్టమ్స్‌కు చెందిన పామర్తి సుబ్బారావు, నాగలక్ష్మి దంపతులు సేవాభావాన్ని చాటుకున్నారు. సుమారు రూ.1 లక్ష విలువైన 1,000 స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులను స్వామివారి అన్నప్రసాద కార్యక్రమానికి విరాళంగా సమర్పించారు. భక్తులకు అన్నదాన సేవలు మరింత మెరుగ్గా నిర్వహించేందుకు ఈ విరాళం ఉపయోగపడుతుందని దేవస్థాన అధికారులు తెలిపారు. దాతల సేవాభావాన్ని కొనియాడుతూ దేవస్థాన ప్రతినిధులు వారికి స్వామివారి ఆశీర్వచనాలతో ప్రసాదం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి దాతలు ముందుకు రావడం ద్వారా అన్నదాన మహాయజ్ఞం మరింత విస్తృతంగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

# పాలకొల్లును రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుదాం...

- రూ.1170 కోట్ల నిధులు తీసుకొచ్చా....
- అభివృద్ధి, సంక్షేమంలో అందరూ భాగస్వాములు కావాలి-మంత్రి నిమ్మల పిలుపు
- నియోజకవర్గస్థాయిలో అధికారులు, కూటమి శ్రేణుల సమావేశం

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు
పాలకొల్లు, సెప్టెంబరు 12: పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో రాష్ట్రంలోనే ఆదర్శంగా, అగ్రగామిగా నిలిపేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేద్దామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాళ్లతో కూడుకున్నప్పటికీ గత రెండేళ్లలో పాలకొల్లు నియోజకవర్గానికి రూ.1170 కోట్ల నిధులు తీసుకొచ్చామని, ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ఇంత పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చానంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ ల సహకారమే అన్నారు. పాలకొల్లు లైన్స్ కమ్యూనిటీ హాల్లో శనివారం నియోజకవర్గ స్థాయిలో. జరిగిన సమీక్ష సమావేశంలో అన్ని శాఖల జిల్లా, రెవెన్యూ డివిజన్, నియోజకవర్గ స్థాయి అధికారులు, ఉద్యోగులు ముఖ్య కూటమి నాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి నిమ్మల మాట్లాడారు. నియోజకవర్గంలో పూర్తయిన, పురోగతిలో ఉన్న, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై శాఖల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. మంత్రి నిమ్మల మాట్లాడుతూ ప్రజలు కూటమి ప్రభుత్వంపై, తనపై విశ్వాసంతో ఆశీర్వదించి బాధ్యతలు అప్పగించారని, ఆ నమ్మకానికి తగ్గట్టుగా ప్రజా రుణం తీర్చుకునేందుకు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నానన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు నిజాయితీ, పారదర్శకతతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ నిధులతో చేపట్టే ప్రతి పని ప్రజలకు శాశ్వత ప్రయోజనం కలిగించేలా ఉండాలని, ఫలితాలు స్పష్టంగా కనిపించాలని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేయడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి వేగవంతమవుతుందని పేర్కొన్నారు. ప్రజల మన్ననలు



పొందే విధంగా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. కూటమి నాయకులు ప్రజలతో నిరంతరం మమేకమై ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గడపగడపకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు ప్రజలకు తెలియజేయడం కూడా ముఖ్య బాధ్యతేనని చెప్పారు. అప్పుడే ప్రభుత్వ పనితీరు మరింత మందికి చేరుతుందని అభిప్రాయపడ్డారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించిన మంత్రి, పనులు ఆలస్యం కాకుండా నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పలు శాఖల్లో జాప్యంగా సాగుతున్న పనులపై అధికారులను ప్రశ్నించి, కారణాలు తెలుసుకుని వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజల ఆశలకు అనుగుణంగా పాలకొల్లు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలని మంత్రి రామానాయుడు పిలుపునిచ్చారు. సమావేశంలో నర్సాపురం ఆర్డీవో దాసిరాజు, నర్సాపురం డి.ఎస్.పి సుధాకర్, ఇరిగేషన్ (ధవలేశ్వరం) ఎస్ ఈ శ్రీనివాసరావు, మోహన్ రావు, విద్యుత్ శాఖ ఎస్ ఈ ఉషారాణి, ఆర్ అండ్ బి ఎస్ ఈ విజయరత్నం, డిసిహెచ్ఎస్ సూర్యనారాయణ, డిఎం అండ్ హెచ్ వో భరత లక్ష్మి, డి ఆర్ డి ఏ పిడి వేణుగోపాల్, మెప్మా పీడీ హెప్సీ బా తదితరులు పాల్గొన్నారు. గత ఐదేళ్లు అధికారంలో ఉండి కూడా అభివృద్ధి , ప్రజలను పట్టించుకోలేని గొడ్డల పార్టీకి రాజకీయాల్లో కొనసాగే అర్హత లేదని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు స్వలాభం కోసం పదవులు మాత్రమే అనుభవించారన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన గొడ్డలి పార్టీ ధ్వంసం విధ్వంసంతో పాలన సాగించిందని, నేడు కూటమి ప్రభుత్వం వికాసం వైపు పరుగులు పెడుతుంది అన్నారు. గత గొడ్డల పార్టీ పాలనలో రాష్ట్రంతోపాటు పాలకొల్లు నియోజకవర్గ కూడా 20 ఏళ్లు వెనక్కి వెళ్ళిందన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ధ్వంసమైన అభివృద్ధి పనులను గాడిలో పెడుతూ పెద్ద ఎత్తున అన్ని శాఖల వారీగా నిధులు తీసుకువచ్చానని మంత్రి రామానాయుడు వివరించారు. గత టిడిపి ప్రభుత్వంలో విద్యుత్ శాఖకు సంబంధించి ఐదు సబ్‌స్టేషన్లను తీసుకువస్తే గొడ్డల పార్టీ ఐదేళ్లు ఒక్కటి కూడా తీసుకురాలేదన్నారు. ఈ రెండేళ్లలో మరో నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్ ల నిర్మాణాలతో పాటు లంకలకోడేరులో 220 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ను మంజూరు జరిగి స్థల సేకరణ దశలో ఉందన్నారు. ఇరిగేషన్ శాఖ పరంగా రైతులకు మేలు జరిగేలా పంట కాలువలు, మురుగు డ్రైన్ ల పనులతో పాటు పుంత రహదారులు అభివృద్ధికి మొత్తంగా 218 కోట్లు వెచ్చించామని గత ప్రభుత్వంలో తట్ట మట్టి పని కూడా నోచుకోలేదన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరంగా 90 కోట్లు, టూరిజం ఐదు కోట్లు, దేవాదాయ శాఖ 11 కోట్లు, ఆర్ అండ్ బి 84 కోట్లు , పబ్లిక్ హెల్త్ 18 కోట్లు , పంచాయతీరాజ్ 66 కోట్లు, ఆర్డబ్ల్యూఎస్ 296 కోట్లు ఇలా అన్ని శాఖల పరంగా మరిన్ని నిధులుతీసుకువచ్చానన్నారు. ప్రభుత్వ నిధులే కాకుండా తనకున్న పరిచయాల వలన పెద్ద కంపెనీలు ఏజెన్సీలో నుంచి సిఎస్ఆర్ నిధులను తీసుకువచ్చినట్లు మంత్రి నిమ్మల తెలిపారు. ఆర్ డి ఓ దాసి రాజు, డీఎ స్పీ,కూటమి నాయకులు, నియోజకవర్గం కు చెందిన అన్ని డిపార్ట్మెంట్ల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

## అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

ఆదివారం 13 సెప్టెంబరు 2026


# పింఛన్ దరఖాస్తు గడువు ఈనెలాఖరు వరకు పొడిగించాలి

### భారతీయ జనతా పార్టీ శింగనమల నియోజకవర్గం బిజెపి కో కన్వీనర్ కుందూ శ్రీనివాసుల రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి, పుట్లూరు



పింఛన్ల గడువునుఈ నెల ఆఖరి వరకు పొడిగించాలని పుట్లూరు మండల పరిధిలోని 229 వ పోలింగ్ బూత్ లో ఒక సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ పింఛన్ దరఖాస్తు ప్రక్రియను ఈనెల ఆఖరి తేదీ వరకు పొడిగించాలని శింగనమల నియోజకవర్గ బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యే గారికి పత్రిక ముఖంగా వినతి కోరారు. ఈ మేరకు వారు పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, ప్రస్తుతం అమలవుతున్న పింఛన్ దరఖాస్తు ప్రక్రియలో అర్హులైన చాలా మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ కార్మికులు, నిరుపేద కుటుంబాల మహిళలు, వలస కార్మికులు తమ దరఖాస్తులను సకాలంలో సమర్పించలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాల్లో ఆన్‌లైన్ సర్వర్లు నెమ్మదిగా పనిచేయడం, సిబ్బంది కొరత, పత్రాల సమీకరణలో ఆలస్యం, ఆధార్--రేషన్ కార్డు లింక్ సమస్యలు, బ్యాంకు ఖాతాల సమస్యలు, పలు గ్రామాల్లో సరైన అవగాహన లేకపోవడం వంటి కారణాలతో అర్హులైన వారు దరఖాస్తు చేయలేకపోతున్నారని బీజేపీ నాయకులు తెలిపారు. ముఖ్యంగా వృద్ధాప్యం కారణంగా సచివాలయాలకు వెళ్లలేని వారు, బయట ప్రాంతాల్లో ఉంటున్న వలస కార్మికులు ఈ ప్రక్రియలో వెనుకబడిపోతున్నారని వారు వివరించారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి, పింఛన్ దరఖాస్తు గడువును ఈనెల ఆఖరి వరకు పొడిగించాలని, అన్ని గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని, సిబ్బందిని పెంచాలని, సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ నాయకులు కోరారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ స్వయంగా జోక్యం చేసుకుని, శింగనమల నియోజకవర్గంలోని అర్హులందరూ పింఛన్ దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని భారతీయ జనతా పార్టీ నాయకులు వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రామ్మోహన్, వేమయ్య, మధుసూదన్ రెడ్డి, ఉత్తమ రెడ్డి మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా మట్టి వినాయకున్నే పూజించాలి

### -ఎమ్మెల్యే దగ్గుబాటి

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం




పర్యావరణ పరిరక్షణ కోసం పిలుపు నిచ్చిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శాప్ డైరెక్టర్ బొమ్మినేని శివ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ ఇంటింటికీ వెళ్లి మట్టి విగ్రహం, పూలమొక్కను అందజేసారు. ఎమ్మెల్యే 4వేల విగ్రహాలు పంపిణీ చేసి శివను ప్రత్యేకంగా అభినందించిన ఎమ్మెల్యే దగ్గుపాటి పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం శాప్ డైరెక్టర్ బొమ్మినేని శివ ఆధ్వర్యంలో 25వ డివిజన్ హౌసింగ్ బోర్డ్ లో ఆయన మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. 25వ డివిజన్‌లో ఎమ్మెల్యే స్వయంగా ఇంటింటికి వెళ్లి మట్టి వినాయక విగ్రహాలను, ఒక పండ్ల మొక్కను అందజేశారు. పర్యావరణ పరిక్షణపై అవగాహన కల్పిస్తూ.. మట్టి విగ్రహాలను పూజించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ వినాయక చవితి అంటే ప్రతి ఇంట, ప్రతివాడలో ఘనంగా జరిగే భారీ పండుగ అన్నారు. అయితే చాలా మంది ఆకర్షణీయంగా ఉంటాయని ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలను పూజించడం అలవాటుగా మార్చుకున్నారన్నారు. ఈ విగ్రహాలను నిమజ్జనం చేస్తే అక్కడ నీరు మొత్తం కలుషితమవుతుందన్నారు. ఇది పర్యావరణానికి హాణి కల్గిస్తుందన్నారు. అందుకే మన సాంప్రదాయం ప్రకారం మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలన్నారు. శాప్ డైరెక్టర్ బొమ్మినేని శివ 4వేల మట్టి విగ్రహాలు పంచి పర్యావరణానికి మేలు చేస్తున్నారన్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

### -ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజా భూమి శింగనమల

శింగనమల: స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త, నాయకుడు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పిలుపునిచ్చారు. శింగనమల మండల కేంద్రంలోని ఆత్మ రామస్వామి దేవాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎన్నికలు, "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కృషి చేసిన మండల



నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, యూనిట్ మరియు బూత్ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తల కృషి అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావంతో తాగునీటి సమస్య ఎక్కువ ఉందని తాగునీటి సమస్య ఎక్కడైనా సంభవించినచో స్థానిక నాయకులకు గాని అధికారులకు గాని వెంటనే చేరచేయాలని తాగునీటి సమస్యకి మొదటి ప్రాధాన్యత ఇస్తామని తాగునీటి సమస్య ఎక్కడ ఉండకూడదని నాయకులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ గోరంట్ల మారుతి నాయుడు, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి, సింగిల్ విండో చైర్మన్ గుర్రం లక్ష్మీనారాయణ, నాయి బ్రాహ్మణ డైరెక్టర్ ఆదినారాయణ, మాజీ ఎంపీపీ లక్ష్మీ దేవమ్మ మాజీ మండల్ పార్టీ కన్వీనర్లు రాఘవరెడ్డి గుత్తా ఆదినారాయణ ఆయకట్టు చైర్మన్ సత్యనారాయణ వెంకటేష్ పెద్దిరెడ్డి మాసుల చంద్రమోహన్ పరుశురాం ముంత నరేష్, కొయ్యగూర పెద్దన్న, విశ్వనాథరెడ్డి, మాజీ ఎంపీటీసీ కుల్లాయప్ప, మాజీ సర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకుడిని పూజించాలి- పర్యావరణాన్ని పరిరక్షించాలి జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

వినాయక చతుర్థి సందర్భంగా మట్టి వినాయకుడిని పూజించాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ పేర్కొన్నారు. శనివారం అనంతపురం నగరంలోని రాజేంద్ర మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన వినాయక చతుర్థి సందర్భంగా మట్టి విగ్రహాల స్టాల్ ప్రారంభోత్సవంలో జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక చవితి విశిష్టతను కాపాడేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. సహజ రంగులతో చేసిన మట్టి ప్రతిమలతో పర్యావరణ అనుకూల వినాయక చవితిని జరుపుకోవాలన్నారు. వినాయక చవితి



పండుగను సుస్థిరంగా మరియు పర్యావరణానికి అనుకూలంగా జరుపుకోవాలని, చెరువులు, జల వనరులకు నష్టం కలిగించే వ్యర్థ పదార్థాల వినియోగం తగ్గిద్దాం లేదా పూర్తిగా మానేయాలన్నారు. మట్టితో చేసిన ప్రతిమలను వాడాలని, విగ్రహాల తయారీకి సహజసిద్ధమైన రంగులను



ప్రకృతిలో లభ్యమయ్యే పత్తి, నారా వంటి పదార్థాలను వినియోగించాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌విగ్రహాల వాడకం నిషేధించబడిందని పిఓపిలో హానికరమైన రసాయనాలు నీటి కాలుష్యానికి దారితీస్తాయన్నారు. నీటి వనరుల కాలుష్యాన్ని నివారించడానికి పర్యావరణ అనుకూలమైన (క్లే) గణేష్ విగ్రహాలను మాత్రమే ఉపయోగించాలన్నారు. సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు అనుగుణంగా విగ్రహాల తయారీ, నిమజ్జన కార్యక్రమం జరగాలని సూచించారు. వినాయక మండపాలకు అనుమతులు జారీ చేసేటప్పుడు, విగ్రహాల ఏర్పాటు సమయంలో కూడా రెవెన్యూ డిపార్ట్‌మెంట్, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పంచాయతీ డిపార్ట్‌మెంట్, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖ, పోలీసు డిపార్ట్‌మెంట్‌లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన సవరించిన మార్గదర్శకాలను అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ శ్రీమతి శశికళ, ఏఈఈ కృష్ణా రెడ్డి, కుమారి హరిణి, ఉమా మల్లేశ్వరీ దేవి, కబ్రిస్తాన్ బాబా వలి తదితరులు పాల్గొన్నారు.

# గుంతకల్లు నియోజకవర్గంలో గ్రామీణ రహదారి అభివృద్ధికి రూ.4.23 కోట్ల నిధులు

### -గుంతకల్లు డిఆర్ఎం కార్యాలయంలో రైల్వే సమస్యలపై చర్చ: ఎంపీ అంబిక

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలోని డిఆర్ఎం కార్యాలయంలో శనివారం గుంతకల్లు రైల్వే డివిజన్ డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాని అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిసారు. గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని పలు రైల్వే సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే పలుమార్లు కేంద్ర మంత్రికి వినతిపత్రాలు సమర్పించిన విషయాన్ని డిఆర్ఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలపై రైల్వే ఉన్నతాధికారులతో జరిగే సమావేశాల్లో మరోసారి ప్రత్యేకంగా ప్రస్తావించి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిఆర్ఎంని కోరారు. అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గంలో ఆలూరు రోడ్డు నుంచి బంటనహాల్ గ్రామం వరకు పథకం కింద రూ.4.23 కోట్లతో చేపట్టనున్న సుమారు 6.5 నుంచి 7 కిలోమీటర్ల బీటీ రోడ్డు పనులకు సంబంధించిన కార్యక్రమంలో అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న రహదారి సమస్యకు పరిష్కారం లభించడం ఎంతో సంతోషంగా ఉంది. గుంతకల్లు శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని నిధులు తీసుకురావడంలో చేసిన కృషి అభినందనీయం. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిధులు కేటాయిస్తూ రహదారులు, ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేస్తోంది. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని వేగవంతం చేయడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మరిన్ని అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తాను. ఈ కార్యక్రమంలో గుంతకల్లు శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీరాజ్ అధికారులు,





పార్టీ నాయకులు, కార్యకర్తలు, వెంకటేశ్వర్ రెడ్డి, బందుకు రాజా, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "జి.కొట్టాల-- ఖాజీపురం రహదారి నిర్మాణానికి భూమి పూజ" అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణ సమీపంలోని జి.కొట్టాల గ్రామం నుంచి ఖాజీపురం వరకు నిధుల ద్వారా రూ.3.80 కోట్లతో నిర్మించనున్న బీటీ రహదారి పనులకు అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ, గుంతకల్లు శాసనసభ్యులు గుమ్మనూరు జయరాంతో కలిసి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల వంటి మౌలిక వసతులను కల్పించడం ద్వారా ప్రజల రవాణా కష్టాలను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. గుంతకల్లు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంని అభినందించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని వేగవంతం చేయడం మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి నా వంతు కృషిని నిరంతరం కొనసాగిస్తాను. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేషన్ డైరెక్టర్లు, చైర్మన్లు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గుంతకల్లు ఏరియా ఆసుపత్రిలో ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లేబొరేటరీ ప్రారంభం

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

రాష్ట్రవ్యాప్తంగా 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీలను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా వర్చువల్ గా ప్రారంభించారు. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి క్రిటికల్ కేర్ బ్లాకులు, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీలను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ప్రారంభించారు. రూ.249 కోట్ల వ్యయంతో 22 ప్రాజెక్టులను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఇందులోభాగంగా ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పీఎం-ఏబీహెచ్ఐఎం) కింద గుంతకల్లు పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రయోగశాలను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్



ప్రకాశ్ నడ్డా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో వర్చువల్‌గా ప్రారంభించారు. శనివారం గుంతకల్లు పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లేబొరేటరీ (ఐపీహెచ్ఎల్)ను వర్చువల్ విధానంలో ప్రారంభించిన కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, తదితరులు.



పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐపీహెచ్ఎల్ అందుబాటులోకి రావడం గుంతకల్లు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో ప్రయోజనకరం అని అన్నారు. వివిధ రకాల వైద్య పరీక్షలను స్థానికంగానే నిర్వహించుకునే అవకాశం కలగడంతో వ్యాధులను సకాలంలో గుర్తించడం, సరైన చికిత్స అందించడం మరింత సులభతరం కానుందన్నారు. ముఖ్యమైన వైద్య పరీక్షల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో ప్రజలకు సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి గుంతకల్లు ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు ఈ సౌకర్యం మరింత మెరుగైన వైద్య సేవలను అందించడంలో కీలకంగా నిలుస్తుందన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గుంతకల్లు నియోజకవర్గంలో ఆరోగ్య మౌలిక వసతులను మరింత బలోపేతం చేసేందుకు నా వంతు కృషి కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డా.ఈ.వెంకటరావు, ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.ఆర్.అజేంద్రరావు, ఆర్ఎంఓ డా. జయవర్ధన్ రెడ్డి, వైద్యులు, సీనియర్ రెసిడెంట్ వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# క్రిటికల్ కేర్ తో మెరుగైన వైద్య సౌకర్యాలు

### -వర్చువల్ లో ప్రారంభించిన కేంద్రమంత్రి -ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎంపీ పార్థసారథి, జేసీ

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ప్రజల ఆరోగ్యం కోసం కూటమి ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తున్నట్టు హిందూపురం పార్లమెంటు సభ్యులు బి.కె.పార్థసారథి పేర్కొన్నారు. హిందూపురం ప్రభుత్వ అస్పత్రిలో అత్యాధునిక క్రిటికల్ కేర్ యూనిట్ ను కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి జగదీష్ ప్రసాద్ నడ్డా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యప్రసాద్ విజయవాడ నుండి వర్చ్యువల్ లో ప్రారంభించగా హిందూపురంలో జరిగిన పూజా కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు బీకే పార్థసారథి, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పెనుగొండ ఆర్డీఓ ఆనంద్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత



కార్యదర్శి వీరయ్య, బాలాజీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఫైరోజాబేగం, జిల్లా ప్రభుత్వాసుపత్రుల సమన్వయాధికారిణి డాక్టర్ శ్రీకాంతి, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆఫ్తాబ్ పాల్గొన్నారు. ఈ జ్యోతిప్రజల్వన చేసి క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ క్రిటికల్ కేర్ యూనిట్ ద్వారా రోగులకు మరింత అత్యవసర వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి వస్తాయన్నారు. స్థానికంగానే నాణ్యమైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ క్రిటికల్ కేర్ యూనిట్ ను అందుబాటులోకి తెచ్చిందని, ప్రాణాపాయ స్థితిలో వున్న రోగులకు గుండె సంబంధిత, శ్వాసకోస సమస్యలకు రోడ్డుప్రమాద భాదితులకు తక్షణమే అత్యుత్తమ వైద్యసేవలు అందించుటకు వీలుగా ఈ యూనిట్ లో అన్ని అందుబాటులో ఉంటాయన్నారు. అత్యాధునిక లైఫ్ సపోర్ట్ సిస్టం, వెంటిలేటర్లు, కార్డియాక్ మానిటర్లు, రౌండ్ ది క్లాక్ వైద్యసేవలు, ప్రత్యేక వైద్యనిపుణులు, నర్సింగ్ సిబ్బంది నియామకం, ప్రతిబెడ్డుకు నేరుగా సెంట్రలైజడ్ ఆక్సిజన్ సరఫరా వ్యవస్థలు ఉంటాయన్నారు. ఇప్పటివరకూ అత్యవసర వైద్యం కోసం బెంగళూరు, అనంతపురం తదితర సుదూర ప్రాంతాలకు వెళ్ళే అవసరం లేకుండా ఇక్కడే పొందవచ్చని తెలియజేస్తూ తొందరలోనే అవసరమైన సామాగ్రి, సిబ్బంది నియామకం జరిగిన తర్వాత పూర్తిస్థాయిలో వైద్యసేవలు పొందవచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాజీ మార్గంతో ఎన్నో ప్రయోజనాలు

### -జాతీయ మెగా లోక్ అదాలత్ లో 271 కేసులు పరిష్కారం -అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్వరరావు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు జాతీయ మెగా లోక్ అదాలత్ ను సీనియర్ సివిల్ జడ్జి హేమలత, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు నిఖిల్ రెడ్డి, లలితా లక్ష్మీ హారిక కోట, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్య, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రమాదేవిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా జడ్జి మాట్లాడుతూ, కోర్టులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగి వ్యయప్రాయాసాలకు గురి కాకుండా రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. తద్వారా సమయం వృధా కాకుండా ఉండడంతోపాటు ఆర్థికంగా కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ముఖ్యంగా లోక్ అదాలత్ లో కేసులను పరిష్కరించుకుంటే అప్పిల్ సౌకర్యం కూడా ఉండదని తెలిపారు. దీనివల్ల ఇరు పార్టీలకు ఉపశమనంగా ఉంటుందని తెలిపారు. అనంతరం నాలుగు బెంచ్ లను ఏర్పాటు చేసి



271 కేసులను పరిష్కరించారు. 43 అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న కేసులను పరిష్కరించి రూ.1,62,610 అపరాధ రుసుం విధించారు. దీనికి తోడు చెక్ బౌన్స్ కేసులను పరిష్కరించి బాధితులకు నగదు ఇప్పించారు. ప్రమాద బీమా కేసులను పరిష్కరించి బాధితులకు ఇన్సూరెన్స్ కంపెనీల తరపున ఆర్థిక సహకారం అందించారు. అదేవిధంగా సివిల్ ఎడ్యుకేషన్ కేసులను పరిష్కరించారు. దీనికి తోడు 143 చిన్నపాటి కేసులను పరిష్కరించి అపరాధ రుసుం ప్రభుత్వ ఖజానాకు జమ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా కోర్టు ఏపిపి అనంత గోపాలకృష్ణ, లోక్ అదాలత్ సభ్యులు సంతోషి కుమారి, ఈశ్వర్, కళావతి, యూసఫ్, రవిచంద్ర, దివ్య, మురళి, భాగ్యలక్ష్మి తో పాటు వివిధ బ్యాంకుల మేనేజర్లు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణహితంగా నిర్వహించాలి..!

**- అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలి: కడప ఆర్డీఓ**



ప్రజాభూమి ప్రతినిధి,కడప: వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో, పర్యావరణహితంగా నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని కడప రెవెన్యూ డివిజనల్ అధికారి మురళి సూచించారు. శనివారం కడప ఆర్డీవో కార్యక్రమంలో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి రెవెన్యూ డివిజన్ స్థాయి సమన్వయ కమిటీ సమావేశం ఆర్డీవో మురళి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణ, వినాయక విగ్రహాల ఏర్పాటు, నిమజ్జన కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో ఆర్డీఓ సమీక్షించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.వినాయక విగ్రహాల తయారీలో మట్టి విగ్రహాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, పర్యావరణానికి హాని కలిగించే పదార్థాల వినియోగాన్ని నివారించాలని సూచించారు. మండపాల ఏర్పాటు, విద్యుత్ సరఫరా, భద్రత, పారిశుధ్యం తదితర అంశాల్లో సంబంధిత నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా చూడాలన్నారు.ఉత్సవాల సందర్భంగా అధిక శబ్దం, బాణసంచా వినియోగాన్ని నియంత్రిస్తూ నిర్ణీత నిబంధనలు, సమయాలను పాటించాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు తనిఖీలు నిర్వహించాలని తెలిపారు.వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఊరేగింపుల మార్గాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని, నిమజ్జన ప్రాంతాల్లో బారికేడ్లు, తగినంత వెలుతురు, భద్రతా చర్యలు, పారిశుధ్య ఏర్పాట్లు కల్పించాలని ఆర్డీఓ సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వైద్య, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.నిమజ్జనం అనంతరం పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను కాపాడేందుకు పారిశుధ్య సిబ్బందితో ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆర్డీఓ ఆదేశించారు. ఈ సమావేశంలో మునిసిపల్, పోలీసు, విద్యుత్, అగ్నిమాపక, వైద్య, పర్యావరణ, ఇంజినీరింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు

## రాంగోపాల్ రెడ్డి మాటలు అబద్ధాల పుట్ట

**డీఎస్సీలో అంటిన మరక మీకు ఎన్నటికీ పోదు - లోకేష్ పూర్తిగా విఫలం**
**వైసీపీ యువజన విభాగం నేత సుంకర రవి కుమార్ ఫైర్**

ప్రజాభూమి, పులివెందుల



టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఒక అబద్ధాల పుట్టలా మారిపోయారని, చంద్రబాబు, నారా లోకేష్ డైరెక్షన్ లో స్క్రిప్ట్ చదవడం, అబద్ధాలు ఆడటమే పనిగా పెట్టుకున్నారని వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకర రవి కుమార్ ధ్వజమెత్తారు. శనివారం పాత ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.మెగా డీఎస్సీ పేరుతో కూటమి ప్రభుత్వం లక్షలాది నిరుద్యోగుల జీవితాలను నట్టేట ముంచిందని విమర్శించారు. అధికారంలోకి రాగానే ఆర్భాటంగా ప్రకటించి, ఇప్పుడు కోర్టు కేసులు, వాయిదాల పేరుతో కాలయాపన చేస్తూ యువత భవిష్యత్తుతో ఆడుకుంటున్నారన్నారు. డీఎస్సీలో కూటమి ప్రభుత్వానికి అంటిన మరక వందేళ్లయినా పోదన్నారు. ఐటీ, యువజన సర్వీసుల శాఖ మంత్రిగా నారా లోకేష్ పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. ఎన్నికల ముందు 'జాబ్ రావాలంటే బాబు రావాలి' అన్న నినాదం ఇప్పుడు 'బాబు వచ్చాడు.. ఉన్న ఉద్యోగాలు ఊడాయి' అనేలా మారిందని ఎద్దేవా చేశారు. ఏటా డిసెంబర్‌లో జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కొన్ని లక్షల మంది నిరుద్యోగుల జీవితాలను భ్రష్టు పట్టించిన బాధ్యత లోకేష్ దేనన్నారు.స్క్రిప్ట్ చదవడం మానేసి నిజాలు మాట్లాడటం నేర్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారనిరాంగోపాల్ రెడ్డిని హెచ్చరించారు. నిరుద్యోగుల పక్షాన వైసీపీ అండగానిలబడి పోరాడుతుందని, తక్షణమే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో వైసీపీ నాయకులు దేవదత్త రాజా నాయుడు, రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నేత చెంద్రాయుడిని పరామర్శించిన బిటెక్ రవి

**- ఇడుపులపాయ గ్రామ సమస్యలపై ఆరా**

ప్రజాభూమి, వేంపల్లె



మండలంలోని ఇడుపులపాయ గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు వివి చెంద్రాయుడిని పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి శనివారం పరామర్శించారు. అనారోగ్యంతో సర్జరీ చేయించుకుని ఇంటికి వచ్చిన చెంద్రాయుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని, ఏ సహకారం కావాలన్నా తనకు ఫోన్ చేయాలని బిటెక్ రవి తెలిపారు. అనంతరం ఇడుపులపాయ గ్రామంలోని సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి, గండి క్షేత్రం ఛైర్మన్ వెంకటస్వామి, టిడిపి మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, టౌన్ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహమ్మద్, బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఆస్పిరేషనల్ జిల్లా పురోగతిలో కడపకు అగ్రస్థానం..!

**- నీతిఆయోగ్ సమీక్షలో జిల్లా అభివృద్ధి పురోగతిని వివరించిన కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**



ప్రజాభూమి ప్రతినిధి,తిరుపతి: ఆస్పిరేషనల్ జిల్లా కార్యక్రమం కింద వైఎస్ఆర్ కడప జిల్లా అభివృద్ధిలో గణనీయమైన పురోగతి సాధిస్తూ జాతీయ స్థాయిలో వరుసగా మూడు త్రైమాసికాల్లో మొదటి స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శనివారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో.. వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన ఆకాంక్ష జిల్లాలు, బ్లాకుల అభివృద్ధి పురోగతిపై సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నీతిఆయోగ్ సభ్యుడు డా. ఎం. శ్రీనివాస్ హాజరు కాగా.. నీతీ ఆయోగ్ రాష్ట్ర నోడల్ అధికారి కార్తీక్ రెడ్డి, సీపీవో హాజరతయ్యా, అనుబంధ శాఖల జిల్లా అధికారులు హాజయయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ కడప జిల్లాలో నీతీఅయోగ్ పొందుపరిచిన ప్రమాణికాల్లో సాధించిన పురోగతిని జిల్లా కలెక్టర్ వివరించారు.

ఆస్పిరేషనల్ జిల్లా కార్యక్రమంలో ఆరోగ్యం--పోషకాహారం, విద్య, వ్యవసాయం--నీటి వనరులు, ఆర్థిక సమ్మిళితం, నైపుణ్యాభివృద్ధి, మౌలిక వసతులకు ప్రాధాన్యతనిస్తూ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. మార్చి 2025లో 78.53, జూన్ 2025లో 73.60, మార్చి 2026లో 80.06 సమ్మిళిత స్కోరుతో కడప జిల్లా జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఉత్తమ పనితీరు కనబరిచిన ఆస్పిరేషనల్ జిల్లాగా నీతిఆయోగ్ నుంచి ?6.5 కోట్ల ప్రోత్సాహక బహుమతి లభించిందని వివరించారు.ఆరోగ్య, పోషకాహార రంగంలో గర్భిణీల నమోదు, ప్రసవ సేవలు, రక్తహీనత పరీక్షలు, సంస్థాగత ప్రసవాలు, శిశు సంరక్షణ, టీకాల కార్యక్రమాల్లో మెరుగైన ఫలితాలు సాధించినట్లు తెలిపారు. సంస్థాగత ప్రసవాలు 100 శాతంగా ఉండగా, పీహెచ్‌సీలను ఆరోగ్య--సంక్షేమ కేంద్రాలుగా మార్చడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రమాణీకరణ, అత్యవసర వైద్య సేవలు వంటి అంశాల్లో 100 శాతం పురోగతి సాధించినట్లు చెప్పారు.విద్యారంగంలో ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత పాఠశాల స్థాయికి విద్యార్థుల మార్పిడి రేటు 98.13 శాతం, ఉన్నత ప్రాథమికం నుంచి మాధ్యమిక స్థాయికి 99.13 శాతంగా ఉందన్నారు. పాఠ్యపుస్తకాల పంపిణీ, బాలికల మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాల్లో కూడా దాదాపు పూర్తి స్థాయి పురోగతి సాధించినట్లు వివరించారు.వ్యవసాయ రంగంలో సూక్ష్మ సాగునీటి విస్తీర్ణం 100 శాతానికి చేరగా, పశువుల టీకాలు, కృత్రిమ గర్భధారణ కార్యక్రమాల్లో 100 శాతం పురోగతి నమోదైందన్నారు. యువతలో ఔత్సాహికతను పెంచేందుకు స్టార్టప్ కడప, పెట్టుబడిదారులకు భూమి నుంచి అనుమతులు, ప్రాజెక్టు అమలు వరకు సమగ్ర సహకారం అందించేందుకు ఇన్వెస్ట్ కడప వంటి వేదికలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాను అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాల్లో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు శాఖలన్నీ సమన్వయంతో పనిచేస్తున్నాయని ఆయన సమీక్ష సమావేశంలో పేర్కొన్నారు

## వినాయక మండపాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి

**- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు- సీఐ టి. నరసింహులు**

ప్రజాభూమి, వేంపల్లె



వినాయక చవితి సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా పొందాలని సీఐ టి. నరసింహులు సూచించారు. మండపాల ఏర్పాటు, విద్యుత్ సదుపాయాలు, శబ్ద కాలుష్యం, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా మండపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా వైరింగ్, విద్యుత్ కనెక్షన్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అధిక శబ్దంతో డీజేలు, సౌండ్ సిస్టమ్స్ వినియోగించకుండా నిబంధనలు పాటించాలని తెలిపారు. అత్యవసర మార్గాలను ఖాళీగా ఉంచాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా రోడ్లను ఆక్రమించి మండపాలు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేయడం, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సీఐ టి. నరసింహులు హెచ్చరించారు. వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖకు సహకరించాలని సీఐ నరసింహులు కోరారు.

## మట్టి గణపతిని పూజిద్దాం -- ప్రకృతిని కాపాడుదాం బద్వేల్ నియోజకవర్గ ప్రజలకు నారిశెట్టి సుప్రజ పిలుపు

ప్రజాభూమి పోరుమామిళ్ల :



బద్వేల్ నియోజకవర్గ ప్రజలందరికీ బద్వేల్ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటూనే ప్రకృతిని కాపాడే విధంగా మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని ఆమె కోరారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారైన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, అందుకే పర్యావరణానికి అనుకూలమైన మట్టి గణపతి విగ్రహాలను ప్రోత్సహించాలని సూచించారు. మట్టి గణపతిని పూజిద్దాం... మన సంస్కృతిని కాపాడుకుందాం... ప్రకృతిని పరిరక్షిద్దాం" అని నారిశెట్టి సుప్రజ పేర్కొన్నారు. ప్రతి కుటుంబం పర్యావరణ హితమైన గణపతిని పూజించి, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు.

## రెండు డీఏలు విడుదలపై ఎన్జీవో నేతల హర్షం

**ఉద్యోగుల మిగిలిన డిమాండ్లను కూడా నెరవేర్చాలి**

ప్రజాభూమి,పులివెందుల



ఉద్యోగ సంఘాలతో ఈ నెల 5న జరిగిన చర్చల్లో ఇచ్చిన హామీ మేరకు రెండు విడతల డీఏలను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై పులివెందుల తాలూకా ఏపీఎన్జీవోస్ యూనిట్ సహాధ్యక్షుడు సుకుమార్, ఉద్యోగ ప్రతినిధి నరేష్ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఏపీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర జేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ, కడప జిల్లా ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు బలపనూరు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి నిత్యపూజయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ సంఘాలతో జరిగిన చర్చల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రెండు డీఏలను విడుదల చేయడం పట్ల ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోందన్నారు. ఇదే విధంగా ఉద్యోగుల మిగిలిన డిమాండ్లను కూడా రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని సుకుమార్, నరేష్ లు కోరారు.

## శ్రీకృష్ణుడి ప్రతిమతో ఘనంగా ఊరేగింపు

**- పులివెందులలో ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు**

ప్రజాభూమి, పులివెందుల:

త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక పులివెందుల కమిటీ ఆధ్వర్యంలో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం ఘనంగా ముగిశాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఈ నెల 4న పులివెందులలోని పుష్పగిరి స్కూల్ ప్రాంగణంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి శ్రీకృష్ణుడి ప్రతిమను కొలువుదీర్చారు. తొమ్మిది రోజులపాటు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం నిత్య పూజలు, భగవద్గీత శ్లోక పారాయణం, భజనలు నిర్వహించారు.వేడుకల ముగింపులో భాగంగా శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి



సాయంత్రం 5 గంటల వరకు శ్రీకృష్ణుడి ప్రతిమతో పట్టణ పురవీధుల్లో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. పుష్పగిరి స్కూల్ ప్రాంగణం నుంచి ప్రారంభమైన ఊరేగింపు బైపాస్, అంకాలమ్మ గుడి, పార్లపల్లి రోడ్డు, పులంగళ్ల సర్కిల్, రవి బుక్ స్టాల్, ముత్యాలవారి వీధి, అమ్మవారిశాల వీధి, మెయిన్ బజార్, పాత బస్టాండు, జ్యోతిక హాస్పిటల్ మీదుగా తిరిగి పుష్పగిరి స్కూల్ వద్దకు చేరుకుంది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని జై శ్రీకృష్ణ నినాదాలతో హోరెత్తించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుష్పగిరి స్కూల్ కరెస్పాండెంట్ ఓబులరెడ్డి హాజరై శ్రీకృష్ణుడికి కాయ, కర్పూరం సమర్పించి పూజలు నిర్వహించి ఊరేగింపును ప్రారంభించారు.త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక పులివెందుల కమిటీ అధ్యక్షుడు వరుణ్ కుమార్ తో పాటు గురుమూర్తి, హరిశివ, వెంకటయ్య, పోతులూరు, మహేశ్వర్ రెడ్డి, నాగమల్లేష్, సాయికుమార్, హరీష్, నరహరి, చంద్రశేఖర్, దత్త, రామాంజనేయులు, గంగులయ్య, ఆదర్శ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం - పర్యావరణాన్ని కాపాడుదాం- బీటెక్ రవి, లతారెడ్డి

ప్రజాభూమి, పులివెందుల



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రజలంతా మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి, జడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి పిలుపునిచ్చారు.శనివారం పులివెందుల పట్టణంలోని శ్రీరామ్ హాల్ రోడ్డులోని ఫిజియోథెరపీ సాయి క్లినిక్ ఆధ్వర్యంలో బీటెక్ రవి, లతారెడ్డి కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి భక్తులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో ప్రజల్లో పర్యావరణ అవగాహన కల్పించేందుకు వెయ్యికి పైగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పీవోపీ, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల నిమజ్జనం వల్ల జలవనరులు కలుషితమవుతాయని, అందువల్ల ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే వాడాలని కోరారు.అశ్లీల గీతాలు, రాజకీయ ప్రచార పాటలకు డీజే అనుమతులు ఇవ్వబోమని, డీజేలను కేవలం భక్తి గీతాలు, ఆధ్యాత్మిక సంకీర్తనలకు మాత్రమే నిబంధనల మేరకు వినియోగించాలని సూచించారు. ప్రజలంతా శాంతిభద్రతలకు సహకరిస్తూ భక్తి భావంతో వినాయక చవితి వేడుకలను ఘనంగా జరుపుకోవాలని కోరారు.అంతకుముందు సాయి క్లినిక్ నిర్వాహకులు బీటెక్ రవి, లతారెడ్డిలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్థసారథి రెడ్డి, మహబూబ్ బాషా, గంగాధర్ రెడ్డి తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## రాజంపేట టీడీపీలో ప్రక్షాళన అవసరం

**సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలి: సీనియర్ నేత కొమర వెంకట నరసయ్య**



ప్రజాభూమి, సిద్ధవటం: రాజంపేట నియోజకవర్గంలో టీడీపీని ప్రక్షాళన చేసి, నాయకులు-కార్యకర్తల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని టీడీపీ సీనియర్ నేత, రాష్ట్ర మాజీ కల్లుగీత కార్పొరేషన్ డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య కోరారు. శనివారం భాకరాపేటలో టీడీపీ సీనియర్ నేత, మాజీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పుత్త రామచంద్రయ్య ఎస్టేట్‌లో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పార్టీ కోసం ఇబ్బందులు ఎదుర్కొన్న టీడీపీ కార్యకర్తలకు తగిన గుర్తింపు, న్యాయం జరగలేదని నరసయ్య ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కొందరికే ప్రాధాన్యం లభిస్తోందని ఆరోపించారు. పార్టీ బలోపేతం కోసం 43 ఏళ్లుగా పనిచేస్తున్న సీనియర్ నాయకులు, కార్యకర్తలకు సముచిత ప్రాధాన్యం కల్పించాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. నియోజకవర్గంలోని పార్టీ సమస్యలను ఇప్పటికే రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో పుత్తా రామచంద్రయ్య, మామిళ్ల ఈశ్వరయ్య, అసెంబ్లీ అధికార ప్రతినిధి రామ్మోహన్ నాయుడు, సుబ్రహ్మణ్యం, కిరణ్ స్వామి, మైనార్టీ నేత సత్తార్, మౌలాలి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిలో లావాదేవీలు చేయొద్దు

**- సర్వే నంబర్ 427/1లో 2.3 ఎకరాలు ప్రభుత్వ భూమిగా నమోదు**



ప్రజాభూమి, సిద్ధవటం: శాకరాజుపల్లె రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 427/1లో ఉన్న 2.3 ఎకరాల భూమి ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూమి/ఆక్రమణ నిషేధం అంటూ బోర్డు ఏర్పాటు చేసిన ప్రాంతం కూడా ప్రభుత్వ భూమికే చెందుతుందని ఎంఆర్ఓ స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సదరు భూమిలో ఆక్రమణలు, నిర్మాణాలు, ప్లాట్ల విభజన, అమ్మకాలు, కొనుగోళ్లు చేపడితే చట్టపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. భూమి కొనుగోలు లేదా ఎలాంటి చెల్లింపులు చేసే ముందు యాజమాన్యం, భూమి వర్గీకరణ, అనుమతులు, సంబంధిత రికార్డులను తహసీల్దార్ కార్యాలయంలో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఇప్పటికే కొనుగోలు చేసిన వారు రిజిస్ట్రేషన్, కొనుగోలు పత్రాలతో రెవెన్యూ అధికారులను సంప్రదించి వాటి చెల్లుబాటును నిర్ధారించుకోవాలని తెలిపారు. అనుమానాస్పద ఆక్రమణలు, లావాదేవీలను ఆధారాలతో అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అధికారిక ధ్రువీకరణ లేకుండా ఎలాంటి ఒప్పందం, అడ్వాన్స్ లేదా చెల్లింపు చేయవద్దని హెచ్చరించారు.

## పంట పొలాల్లో విద్యుత్ వైర్ల చోరీ

**- పేరయ్యగారివల్లెలో నాలుగు చోట్ల చోరీ.. రూ.35 వేల నష్టం**



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని పేరయ్యగారిపల్లె గ్రామ పరిధిలో రైతుల పంట పొలాల్లో గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ వైర్లను చోరీ చేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం రాత్రి నాలుగు పంట పొలాల్లో మోటార్ల వద్ద ఉన్న వైర్లను దొంగలు అపహరించుకెళ్లారు. రైతు రావూరు సుబ్బారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తరచూ పంట పొలాల్లో చోరీలు జరుగుతున్నాయని, తాజాగా నాలుగు చోట్ల వైర్లు చోరీ కావడంతో సుమారు రూ.35 వేల విలువైన నష్టం వాటిల్లిందన్నారు. పంట పొలాల్లో చోరీలను అరికట్టేందుకు పోలీసులు చర్యలు చేపట్టాలని కోరారు. చోరీలపై ఎస్సై హారికను వివరణ కోరగా, ఇప్పటివరకు రైతుల నుంచి ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే విచారణ చేపడతామని పేర్కొన్నారు.

## వినాయక చవితి ఉత్సవాల్లో భక్తి పాటలకే డీజే పర్మిషన్ - హద్దులు దాటితే రద్దుబీటెక్ రవి

ప్రజాభూమి, పులివెందుల



వినాయక చవితి పండుగను శాస్త్రీయంగా, సాంప్రదాయ పద్ధతిలో భక్తి పాటలతో జరుపుకుంటేనే డీజేలకు అనుమతి ఇచ్చేలా పోలీసు అధికారులతో మాట్లాడతానని పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి స్పష్టం చేశారు.విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల్లో అశ్లీల పాటలు, అసభ్యకర నృత్యాలు లేదా రాజకీయ పార్టీల పాటలు పెడితే డీజేలకు పర్మిషన్ ఇచ్చే ప్రసక్తే లేదని హెచ్చరించారు.దేవుని పాటలు పెడతామని చెప్పి రాజకీయ పాటలు పెడితే కేసులు పెట్టిస్తామని, ప్రజలకు, శాంతిభద్రతలకు ఇబ్బంది కలగకుండా క్రమశిక్షణతో వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. వినాయకుని పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాల న్నారు.కార్యక్రమంలో జడ్పీటీసీ లతారెడ్డి, హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మహబూబ్ బాషా, సాయి తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

ఆదివారం 13 సెప్టెంబరు 2026


## వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపు కోవాలి

### -డీజేలకు ఎలాంటి అనుమతి లేదు.

### -చవితి వేడుకలపై పేట అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు

### కఠినమైన నిబంధనలు



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట
గణపతి 9 రోజుల నవరాత్రుల పండుగ సందర్భంగా వారి,వారి ప్రాంతాల్లో పందిళ్లు ఏర్పాటుకు అనుమతులు మరింత సులభతరంగా పొందవచ్చని అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ సందర్భంగా శుక్రవారం నాయుడుపేట అర్బన్ సిఐ వెంకటేశ్వర్లు ""సింహపురి టుడే""పత్రికతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా నాయుడుపేట మండల,అర్బన్ పరిధిలోని ఆంధ్ర ప్రదేశ్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వినాయక మండపాలు,పందిల్లు ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన అనుమతులు కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఏకీకృత ఆన్ లైన్ అనుమతులకు వ్యవస్థ అందుబాటులోకి వచ్చిందన్నారు.2026 సంవత్సరం గాను సెప్టెంబర్ 14వ తేదీ నుండి తొమ్మిది రోజులపాటు గణపతి నవరాత్రులు రావడంతో వేడుకల నిర్వహణకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.. ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, అలాగే ప్రతిరోజు మండపం వద్ద ఒకరు ఇద్దరు రాత్రిపూట నిద్ర చేయాలని అన్నారు, అనివార్య చర్యలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బాణాసంచాలు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నిమజ్జనికి అనుకున్న టైంలో తీసుకొని వెళ్లాలని,5మందితో కూడిన ఉత్సవ కమిటీ మెంబర్లు ను ఏర్పాటు చేసుకుని వారి వారి వివరాలను పోలీసులకు తెలియజేయాలని తెలిపారు. పోలీసు,అగ్నిమాపక, మున్సిపాల్,విద్యుత్,రెవెన్యూ శాఖల సమన్వయంతో అనుమతులను ప్రక్రియ నిర్వహించబడుతుందని సీఐ వెంకటేశ్వర్లు తెలియజేశారు.అనుమతి మంజూరైన అనంతరం క్యూఆర్ కోడ్ తో కూడిన డిజిటల్ అనుమతి పత్రం గణేష్ మండపం నిర్వాహకులకు అందజేస్తారని తెలిపారు.ఈ సేవలను పూర్తి ఉచితం అని, గణేష్ ఉత్సవాలలో పోలీసుల వారికి ప్రజలు సహకరించాలని నాయుడుపేట అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

## రేణిగుంట విమానాశ్రయంలో విష్ణువర్ధన్ రెడ్డికి సాదరస్వాగతం లభించింది



ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.
బిజెపినేషనల్ఆల్ సెల్ జాయింట్ ఇంచార్జ్ విష్ణువర్ధన్ రెడ్డి శనివారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. తిరుమల దర్శనార్థం విచ్చేసిన ఆయనకు రేణిగుంట మండల బిజెపి నాయకులు సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల అధ్యక్షుడు ప్రేమ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొంగా పురుషోత్తం, మండల ఉపాధ్యక్షులు రాజా రాయల్, ఉపాధ్యక్షుడు హరీష్, సోంగా పురుషోత్తం యువ మోర్చా అధ్యక్షులు బొమ్మి శ్రీకాంత్ తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## మాట ఇచ్చారు.. మరచిపోలేదు.. ప్రజల కష్టాన్ని తీర్చారు

### బంగ్లా సెంటర్, చర్చ్ కాంపౌండ్‌లో విద్యుత్ సమస్యకు పరిష్కారం



ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు
ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా వాకాడు మండల కేంద్రంలోని బంగ్లా సెంటర్, చర్చ్ కాంపౌండ్ ప్రాంతాల నివాసులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. విద్యుత్ స్తంభాలు సరిగా లేకపోవడం, విద్యుత్ లైన్లు దెబ్బతిన్న పరిస్థితిలో ఉండటంతో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు.స్థానికుల సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు ఆయా ప్రాంతాల్లో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో పాటు, విద్యుత్ లైన్లను పునరుద్ధరించారు.దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ తమ సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. "ప్రజలకు మాట ఇచ్చాం.. ఆ మాటను నిలబెట్టుకున్నాం " అని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వాకాడు మండల టీడీపీ నాయకులు సన్నారెడ్డి విజయశేఖర రెడ్డి, వేము దినకర్ బాబు, టీడీపీ యువ నాయకుడు బల్లి హర్ష నంద దయాల్ తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలతో ద్వారా సత్వర న్యాయ పరిష్కారం



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,
క్షణికావేశంలో తగాదాలు వేసుకొని కేసులు పెట్టుకొని సంవత్సరాల తరబడి కోర్టులు చుట్టూ తిరిగి సమయాన్ని డబ్బుని వృధా చేసుకో కుండా లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాల వారు రాజీవ్ చేసుకొని ఇద్దరు ఆనందంగా ఉండవచ్చని లోక్ అదాలతో కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని గూడూరు జడ్జ్ మధుబాబు వెల్లడించారు.గూడూరు పట్టణంలోని కోర్టు హాల్లో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు కక్షిదారులతో మాట్లాడి పలు కేసులను పరిష్కరించారు జడ్జ్ మధు బాబు మాట్లాడుతూ చిన్న చిన్న తగాదాలు వేసుకొని కేసులు పెట్టుకుని కోర్టు చుట్టూ సంవత్సరాల తరబడి తిరగడం వల్ల సమయాన్ని డబ్బుని పోగొట్టుకుంటామని అన్నారు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించినట్లయితే ఇరువర్గాల వారు విజయం సాధించినట్లేనని రాజీమార్గమే రాజీమార్గమని పేర్కొన్నారు కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి మూడు నెలలకు ఒకసారి జాతీయ మెగా లోక్ అదాలత్ జరుగుతుందని కక్షిదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు ఈ సమావేశంలో లాయర్లు సాయికుమార్ రెడ్డి ,కోటేశ్వరరావు ,పార్వతయ్య ,మహబూబ్ భాష ,భాస్కర్ రెడ్డి ,కోర్టు సిబ్బంది కక్షిదారులు పాల్గొన్నారు

## ఎన్ఎస్ఆర్ దళిత కాలనీలో వైకాపా ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

### అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ఎంపీ గురుమూర్తికి దళితులు వినతిపత్రం.

### రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటుకు కృషి చేస్తాం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య.



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.
తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణ మున్సిపాలిటీ పరిధిలో ఎన్.ఎస్.ఆర్ కాలనీ రైల్వే ట్రాక్ అవతల దళితులు,ఎస్టీ,500 కుటుంబాలు ఉన్నాయి..రైల్వే అధికారులు కొత్త రూల్స్ తీసుకురావడంతో అక్కడ ఉన్న 78 నెంబర్ గల గేటును మూసి వేయడంతో దళితులు ఎన్నో నెలల నుండి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వివరాల్లోకి వెళితే అక్కడ ఉన్న 78 నెంబర్ గల గేటును మూసివేయడంతో దళితుల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కోవడంతో మూసివేసిన గేటును తెరిపించాలని,జిల్లా కలెక్టర్, ఆర్డీవో,ఎమ్మార్వో, రైల్వే,అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగడం జరిగింది..ఆ దళిత కుటుంబాల్లో చిన్నపిల్లలు స్కూలుకు వెళ్లాలన్న, మరణించిన వారిని స్మశాన వాటికకు తీసుకొని వెళ్లాలన్న, కూలినారి పనులకు వెళ్లేందుకు ఇబ్బందులుగా మారడంతో(ఎస్సీ మాదిగ)దళిత కాలనీవాసులు వైయస్సార్సీపి తిరుపతి పార్లమెంటు సభ్యులు మద్యలో గురుమూర్తితో వారి సమస్యను చెప్పుకున్నారు..
ఉన్నతాధికారులతో మాట్లాడి అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తాం-వైకాపా తిరుపతి పార్లమెంటు మెంబర్ మద్దెల గురుమూర్తి. ఈ సందర్భంగా ఎస్సీ దళితుల సమస్యలు విన్న ఎంపీ గురుమూర్తి,మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య ఎన్.ఎస్.ఆర్ కాలనీ రైల్వే ట్రాక్ అవతలకు నాయకులతో చేరుకున్నారు. అనంతరం అక్కడ (అండర్ బ్రిడ్జి పాస్)ఏర్పాటు కోసం అక్కడ ఉన్న స్థలాన్ని క్షుణంగా పరిశీలించారు..అక్కడ ఉన్న దళిత,ఎస్టి గిరిజన మహిళలతో మాట్లాడటంతో రైల్వే గేట్ వద్ద అండర్ బ్రిడ్జి లేనందున అవస్థలు పడుతున్నామని సత్వరమే రైల్వే అధికారులతో మాట్లాడి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎంపీ గురుమూర్తిని కోరగా...! వారి సమస్యలు తెలుసుకున్నారు..అనంతరం ఎంపీ గురుమూర్తి నాయుడుపేట రైల్వే స్టేషన్ లోపలికి వెళ్లి పరిశీలించడం జరిగింది..ఈ కార్యక్రమంలో ఎస్.ఎం.ఆర్.పి ఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మాసారం గోపాల్ మాదిగ, కప్పల మునస్వామి, నక్కీనబోయిన శ్రీనివాసులు (జెమిని)గోవిందు మోహన్,జడ వెంకటేష్,తడుకు చందు,ధార శేఖర్,కంటే పల్లి నారాయణ,గోవిందు శ్రీనివాసులు, కప్పల మునిరాజా,కంట్లం చిన్న బాబు,ఆరం వెంకయ్య,చెంచు గోపాల్,తులసి,అశోక్, హర్షమహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు..

## ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలి..

### -నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు.



ప్రజాభూమి ప్రతినిధి నాయుడుపేట.
నాయుడుపేట డివిజన్ పరిధిలో వినాయక చవితి వేడుకలను భక్తి శ్రద్ధలు,సోదరభావంతో ప్రశాంతంగా నిర్వహించాలని నాయుడుపేట డీఎస్పీ చెంచు బాబు పిలుపునిచ్చారు..ఈ సందర్భంగా శనివారం నాయుడుపేట డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయుడుపేట డీఎస్పీ చెంచు బాబు మాట్లాడుతూ ప్రజలందరికీ ముందుగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వినాయక పండుగను ఘనంగా నిర్వహించుకునేందుకు పోలీసు శాఖ తరపున నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు..విగ్రహాలు ఏర్పాటు చేసుకునే క్రమంలో ఆన్‌లైన్ లేదా ఫిజికల్ రూపంలో దరఖాస్తు చేసుకోవాలని,సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి పరిశీలన జరిపి అనుమతి ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎలాంటి ట్రాఫిక్ అంతరాయాలు కలగకుండా,ఇతర మతస్థుల మనోభావాలు దెబ్బతినకుండా ఉండేటట్లు పండుగను చూసుకోవాలని సూచించారు.. మండపాల నిర్వహణలో భాగంగా ప్రతిరోజు రాత్రి సమయాల్లో కాపలాగా ఒకరు లేదా ఇద్దరు మనుషులు విధిగా ఉండాలని,లౌడ్ స్పీకర్లను రాత్రి 10 గంటలకల్లా ఆపివేయాలని స్పష్టం చేశారు. ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నా ముందుగా కమిటీ సభ్యులు పోలీసుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు..విగ్రహాలు ఏర్పాటు చేసిన రోజుల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు,ఈవ్ టీజింగ్ వంటి చట్టవ్యతిరేక పనులు జరగకుండా కమిటీ సభ్యులు బాధ్యులుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. నిమజ్జన వేడుకలకు వెళ్లే రూట్లు, వెహికల్ వివరాలను ముందుగానే పోలీసులకు తెలపాలని,ఆ రూట్లలో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఉంటుందని తెలిపారు. సూళ్లూరుపేట నియోజకవర్గం పరిధిలో నిమజ్జనం చేసేవారు సాయంత్రం 5 గంటలకల్లా అక్కడికి వెళ్లాలని,ఐదు తర్వాత మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు మాత్రమే నిమజ్జనానికి అనుమతి ఉంటుందని చెప్పారు.రాత్రి పూట సముద్రంలోకి నిమజ్జనానికి వెళ్లడం పూర్తిగా నిషేధించబడిందని వెల్లడించారు.. వినాయక విగ్రహాల వద్ద గానీ,నిమజ్జన సమయంలో గానీ ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలు వాడకూడదని,డీజేల వాడకానికి ఎలాంటి అనుమతి లేదని డీఎస్పీ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే నిర్వాహకులు,డీజే ఓనర్లపై తప్పనిసరిగా కేసులు నమోదు చేసి, రెండు లక్షల వరకు జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు. ఇప్పటికే డివిజన్ పరిధిలో సుమారు 80 మంది డీజే ఆపరేటర్లను తహశీల్దార్ సమక్షంలో బైండోవర్ చేయడం జరిగిందని తెలిపారు. విగ్రహాలను తరలించే వాహనాలను డ్రైవర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి నడపకూడదని, అలా ఉంటే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయబడతాయని చెప్పారు.. గ్రామాల్లో రాజకీయాలకు తావు లేకుండా, రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి కక్షలు, కార్పణ్యాలు లేకుండా అందరూ శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని కోరారు. గ్రామాల్లో కచేరీలు ,రన్నింగ్ ప్రోగ్రామ్స్ ,వంటివి నిర్వహించకూడదని ఆయన స్పష్టం చేశారు...

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి- జిల్లా జడ్జి అరుణ సారిక



ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు:
జాతీయ లోక్ అదాలత్ ద్వారా న్యాయపరమైన సమస్యలకు త్వరితగతిన, ఎటువంటి ఖర్చు లేకుండా, స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కారం లభించే అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి అరుణ సారిక తెలిపారు. శనివారం జిల్లా కోర్టు హాల్ నందు మొదటి అదనపు జిల్లా జడ్జి కోర్టు హాల్ నందు సుప్రీంకోర్టు మార్గదర్శకత్వంలో జాతీయ న్యాయ సేవా సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సేవా సంస్థల పర్యవేక్షణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. మొదటి అదనపు సివిల్ జిల్లా జడ్జి కోర్టు హాలు నందు 1 బెంచ్ నందు మోటార్ వాహన ప్రమాద పరిహార కేసులు, ఇరు వర్గాలకు సంబంధించిన విషయాలపై మొదటి అదనపు సివిల్ జడ్జి కే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేసులు విచారిం చారు. కేసులకు సంబంధించి. ఇరువర్గాలను రాజీ చేశారు. అనంతరం ఆర్థిక భరోసా కు సంబంధించిన ధ్రువపత్రాలను జిల్లా జడ్జి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూలోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా కక్షిదారులకు సమయం, ధనం రెండూ ఆదా అవుతాయని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో వెలువడే తీర్పులు తుది నిర్ణయాలుగా ఉంటాయని, వాటిపై తదుపరి అప్పీల్‌కు అవకాశం ఉండదని తెలిపారు.
లోక్ అదాలత్‌లో రాజీకి అవకాశం ఉన్న
క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలు,
మోటార్ వాహన ప్రమాద పరిహార కేసులు,
చెక్ బౌన్స్ కేసులు, ఈపీ కేసులు, డీవీసీ కేసులు,
ఎంసీ కేసులు, బ్యాంకుల రుణ బకాయిలకు సంబంధించిన కేసులు, బీఎస్ఎన్ఎల్ కేసులు, పీఎల్‌పీకి సంబంధించిన కేసులు తదితర కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్. భారతి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చిత్తూరు మరియు 13 మండలాలలో ఉన్న అన్ని కోర్టులు యందు ఈరోజు లోక్ అదాలత్ లో రాజీ పడదగ్గ, క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, మోటార్ వాహనాల కేసులు మొదలైన కేసులు రాజీ చేయబడును. జిల్లావ్యాప్తంగా అన్ని కోర్టులలో జరిగే జాతీయ లోక్ అదాలత్‌కు గాను 30 బెంచ్ లను ఏర్పాటు చేయడం జరిగింది. కేసుల పరిష్కారంలో చిత్తూరు జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. జిల్లా కోర్టు నందు 4 బెంచ్ లను ఏర్పాటు చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, వివిధ కేసులకు సంబంధించిన, ఇరు వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వినాయక చవితి ఉత్సవాల పై మార్గదర్శకాలు నియమ నిబంధనలు పాటించాలి... పాకాలసీ. ఐ టి.చిన్నగోవిందు..!

### అశ్లీల నృత్యాలు చేయరాదని, డీ.జేలు పెట్టరాదని హెచ్చరించారు



ప్రజాభూమి ప్రతినిధి, పాకాల:( చంద్రగిరి)
చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలంలోని వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు సమావేశం శనివారం ప్రవేట్ ఫంక్షన్ హాలులో పాకాల సి.ఐ టి.చిన్న గోవిందు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా పాకాల సీఐ మాట్లాడుతూ నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలని ఉత్సవ కమిటీ సభ్యులకు తెలియజేశారు.మండపాల వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు, అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ వైర్లు, జనరేటర్లు తదితరాలను సురక్షితంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించడమైనది.వినాయక విగ్రహం



ఏర్పాటు చేయాలంటే ముందుగా ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకొని అనుమతులు తీసుకోవాలని చెప్పారు. అశ్లీల నృత్యాలు చేయరాదని,డీజేలు ఉపయోగించరాదని అట్లా నిర్వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మూడో రోజే వినాయక విగ్రహాల నిమజ్జనం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు.నిమజ్జనం ఊరేగింపు సమయంలో జాగ్రత్తలు:వాహనాలపై పరిమితికి మించి వ్యక్తులను ఎక్కించరాదని,వాహనాలపై ప్రమాదకరంగా నిలబడటం,వేలాడటం చేయరాదని,డ్రైవర్‌ను ఇబ్బంది పెట్టే విధంగా ఎటువంటి చర్యలకు పాల్పడరాదని సూచించడమైనది.ట్రాఫిక్ నిబంధనలు మరియు పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని తెలియజేయడమైనది.
శాంతిభద్రతల పరిరక్షణ:వినాయక చవితి మరియు నిమజ్జనం కార్యక్రమాలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని,ఇతర మతాలు,వర్గాలు మరియు ప్రజల మనోభావాలను గౌరవిస్తూ సామరస్యపూర్వకంగా పండుగను జరుపుకోవాలని నిర్వాహకులకు సూచించడమైనది.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించడమైనది.కార్యక్రమంలో పాకాల ఎస్.ఐలు సి.తరుణ్,నాగ మంజుల,విద్యుత్ శాఖ ఏఈ హరి ప్రసాద్ రెడ్డి,వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఇంటి వ్యర్థాలు ఇవ్వండి.. పవిత్ర మట్టి వినాయకుడిని తీసుకెళ్లండి..!

### చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాలతో వినూత్న కార్యక్రమం... గ్రీన్ షాప్‌లో నిరుపయోగ వస్తువులను సేకరించి ప్రతిమల పంపిణీ...



ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి:
పర్యావరణ పరిరక్షణతో పాటు సనాతన ధర్మ సంప్రదాయాలను ప్రోత్సహించే దిశగా చంద్రగిరిలో ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్థానిక శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) ఆదేశాల మేరకు, ఇళ్లలో నిరుపయోగంగా పడివున్న వ్యర్థాలను తీసుకువచ్చి ఇచ్చే భక్తులకు పవిత్రమైన మట్టి వినాయకుని ప్రతిమలను అందజేస్తున్నారు. చంద్రగిరిలోని 'గ్రీన్ షాప్' వేదికగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు తమ ఇళ్లలోని ప్లాస్టిక్, ఇనుము, అట్టపెట్టెలు, పాత పుస్తకాలు, న్యూస్ పేపర్లు వంటి వ్యర్థాలను తీసుకువచ్చి గ్రీన్ షాప్‌లో అందజేయగా, అందుకు బదులుగా అక్కడికక్కడే సిద్ధం చేసిన సహజసిద్ధమైన మట్టి ప్రతిమలను డిపిఓ సుశీల దేవి, డిప్యూటీ ఎంపీడీవో ఐ.ఎన్ షణ్ముగం, చంద్రగిరి పంచాయతీ ఈవో చంద్రశేఖర్ రెడ్డి స్థానికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. శాస్త్రోక్తంగా పంచభూతాలలో ఒకటైన సహజసిద్ధమైన మట్టితో చేసిన విఘ్నేశ్వరుడిని పూజించడం ఎంతో శ్రేయస్కరమని తెలిపారు. రసాయనాలు కలిసిన విగ్రహాల వల్ల జలవనరులు కలుషితమవుతాయని, అదే మట్టి విగ్రహాలను పూజించి నిమజ్జనం చేస్తే ప్రకృతి సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందని పేర్కొన్నారు. ఇళ్లలోని చెత్తను తగ్గించి పరిసరాల పరిశుభ్రతను కాపాడటంతో పాటు పర్యావరణహిత వినాయక చవితిని జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వంజివాక వెంకటసుబ్బయ్యకు వైకాపా నాయకుడు పాపారెడ్డి రాజశేఖర్ రెడ్డి నివాళి

### మృతుని కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం

ప్రజా భూమి ప్రతినిధి, వాకాడు
వాకాడు దళితవాడకు చెందిన వంజివాక వెంకటసుబ్బయ్య మృతి చెందడంతో వైకాపా నాయకుడు పాపారెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆయన భౌతికాయానికి నివాళులర్పించారు.అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు.అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, మనోధైర్యంగా ఉండాలని కోరారు.

# గూడూరులో సీనియర్, జూనియర్ జిల్లా స్థాయి ఆర్చరీ ఎంపిక పోటీలు విజయవంతం

### -రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రతిభావంతులైన క్రీడాకారుల ఎంపిక







ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,
ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్, జూనియర్ విభాగాల జిల్లా స్థాయి ఆర్చరీ ఎంపిక పోటీలు శనివారం గూడూరులోని ఎస్ఎస్ స్పోర్ట్స్ అకాడమీ, దివ్య ఫంక్షన్ హాల్ సమీపంలో, గూడూరు బైపాస్ వద్ద ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. రానున్న రాష్ట్ర స్థాయి ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా తరఫున ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేయడం ఈ పోటీల ప్రధాన ఉద్దే శ్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రగతి సేవా సమితి అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను అభినందించారు. క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో నిరంతరం సాధన చేస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరచాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో వరాహి విద్యా వికాస్ కరస్పాండెంట్ పీ. మౌనీష్, లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్, నెల్లూరు కరస్పాండెంట్ రాజేష్ పాల్గొని క్రీడాకారులను అభినందించారు. జిల్లా కార్యదర్శి పావురాల వేణు ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహించగా, ఎస్ఎస్ స్పోర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు, సీనియర్ కోచ్ టీ. శివశంకర్ కార్యక్రమ నిర్వహణలో కీలకంగా సహకరించారు. జిల్లా స్థాయి పోటీలను టెక్నికల్ కమిటీ సభ్యులు విజయ భారద్వాజ్ పర్యవేక్షించారు. క్రీడాకారులకు సాంకేతిక సూచనలు, శిక్షణా సహకారం అందించడంలో కోచ్‌లు జయశంకర్, వెంకటేశ్వరరావు, చాముండేశ్వరి, రాజశేఖర్, హారతి, జీత్ రాయ్ కీలక పాత్ర పోషించారు.

## ప్రముఖ సిద్ధాంత వేత్త కామ్రేడ్ సీతారామ్ ఏచూరి



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,
కామ్రేడ్ సీతారాం ఏచూరి భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రముఖ సిద్ధాంత వేత్త,కమ్యూనిస్టు దిగ్గజం, భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు మాజీ అఖిలభారత కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి కార్యక్రమం శనివారం రోజు గూడూరులోని సి.పి.ఎం పార్టీ కార్యాలయంలో శాఖ కార్యదర్శి జోగి.శివకుమార్ అధ్యక్షతన జరిగింది. నాయకులు కామ్రేడ్ సీతారాశీ ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించడం జరిగింది. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రజల కోసం.. ప్రజలతో పాటు..జీవిత మంతా పోరాటమే లక్ష్యంగా, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో వ్యక్తిగత సంబంధాలు కొనసాగిస్తూ, రాజకీయ విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించడానికి ప్రయత్నించే నాయకుడిగా ఆయనకు గుర్తింపు వచ్చిందని, సీతారాశీ ఏచూరి కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదని మార్క్సిజం,సామాజిక వాదం, మతతత్వం,భారత రాజకీయాలపై రచనలు చేయడం జరిగిందని, సీతారాం ఏచూరి1952 ఆగస్టు 12వ తేదీ మద్రాస్ లో జన్మించారని, 2024 ఆగస్టులో ఆయన ఢిల్లీలోని ఎయిమ్స్ లో చేరడం జరిగిందని, శ్వాస కోస సంబంధిత తీవ్రమైన అనారోగ్యంతో చికిత్స పొందుతూ 2024 సెప్టెంబర్ 12వ తేదీన మరణించడం జరిగిందని,ఆయన వయస్సు 72 సంవత్సరాలు ఆయన కుటుంబ సభ్యుల నిర్ణయంతో ఆయన భౌతిక కాయాన్ని ఎయిమ్స్ కు వైద్య,విద్య, పరిశోధన కోసం దానం చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.వెంకటరామిరెడ్డి,పుట్టా శంకరయ్య,పామంజి మణి,బి.వి.రమణయ్య, అడపాల ప్రసాద్,ఎంబేటి చంద్రయ్య,ఎస్.డి.రఫీ, గండికోట మధు, ధారా కోటేశ్వరరావు బి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## జె.వి.వి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు వాడండి అను పోస్టల్ విడుదల చేసిన మున్సిపల్ కమిషనర్



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు
నెల్లూరు జిల్లా గూడూరు స్థానిక టవర్ సెంటర్ నందు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహా లు వాడండి- పర్యావరణాన్ని కాపా డండి అనే గోడపత్రికలను విడుదల చేసి, పూల కుండీలో వినాయక ప్రతిమను నిమజ్జనం చేసిన గూడూరు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ రావు. కమిషనర్ గారు మాట్లాడుతూ జే.వి.వి ఆధ్వర్యంలో వినాయక చవితి నాడు మట్టి వినాయక విగ్రహాలను వాడండి మీ ఇంటి ఆవరణలో లేదా పూల కుండీలో విగ్రహాన్ని నిమజ్జనం చేయాలని వారు చేసి చూపించిన కార్యక్రమం చాలా వినూత్నంగా ఉందని ప్రతి ఒక్కరూ కూడా పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వాడొద్దని వాటి ద్వారా నీరు కలుషితమై నీటిలో ఉండే జీవరాసులు, చేపలు చనిపోవడమే కాకుండా ఆ నీరు ప్రజలు కూడా తాగి అనారోగ్యం పాలు అవుతున్నారని అందువలన విజ్ఞులైన ప్రజలు కూడా ఆలోచించి మట్టి వినాయక విగ్రహాలను వాడాలని తద్వారా మన ఇంటి పెరటి ఆవరణంలో గానీ పూల కుండీలో గాని ఆ మట్టి వినాయక ప్రతిమను నిమజ్జనం చేసి పూల మొక్క నాటాలని తెలియజేసిన జె.వి.వి సభ్యులందరినీ అభినందిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జె.వి.వి అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, జనసేన నాయకులు మునిగిరీష్, నాగరాజు, చెంచు నారాయణ, రజనీకాంత్, రామమోహన్, ప్రభాకర్,జగదీష్, సుమన్ రెడ్డి, అరుణ్ కుమార్, డివిడి కుమార్, శ్రీనివాసాచారి, సాయికిరణ్, పసల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి

### -కుటుంబ పెద్దను కోల్పోయిన భార్య, ఇద్దరు చిన్నారులు -గతంలోనూ ఇదే నిర్మాణ ప్రదేశంలో విద్యుత్ ప్రమాదం

### -భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు -బాధిత కుటుంబానికి సాయం కోసం ఎదురుచూపులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్
ఆలయం నిర్మిస్తున్న చేతులే.. ఆ ఆలయంలోనే సమాధి కావాల్సిన దుస్థితి. కుటుంబం కోసం రెక్కలు ముక్కలు చేసుకుంటూ పెయింటింగ్ పని చేసుకునే ఓ కార్మికుడు.. ఎప్పటిలాగే పనికి వెళ్లి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. తండ్రి వస్తాడని ఎదురు చూసిన ఇద్దరు చిన్నారులకు ఇక ఆ ఎదురుచూపులే మిగిలాయి. భర్తను కోల్పోయిన భార్యకు కన్నీళ్లు, కడుపు నింపుకోవాల్సిన బాధ్యత తప్ప మరే ఆధారం లేదు. హిందూపురం పట్టణంలో నిర్మాణ దశలో ఉన్న ఇస్కాన్ ఆలయంలో శనివారం జరిగిన విద్యుత్ ప్రమాదం ఓ నిరుపేద కుటుంబాన్ని రోడ్డున పడేసింది. కొట్నూరు గ్రామానికి చెందిన పెయింటర్ నాగార్జున విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు.

కొట్నూరుకు చెందిన నాగార్జున పెయింటింగ్ కూలి పనులు చేసుకుంటూ భార్య నాగేశ్వరి, ఇద్దరు చిన్నారులను పోషించుకుంటున్నాడు. రోజూ పని చేస్తేనే ఆ కుటుంబానికి పూట గడిచే పరిస్థితి. ఎప్పటిలాగే శనివారం కూడా ఇంటి నుంచి ఇస్కాన్ ఆలయ నిర్మాణ పనులకు వెళ్లాడు. అక్కడ పెయింటింగ్ పనులు చేస్తుండగా కింద పడిన విద్యుత్ వైరు తగలడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలిపోయాడు. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే నాగార్జునను హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఒక్క ప్రమాదం కుటుంబం మొత్తం చీకట్లోకి..

నాగార్జున మరణవార్తతో కొట్నూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. రోజూ ఉదయం పనికి వెళ్లి సాయంత్రానికి ఇంటికి చేరుకునే వ్యక్తి.. ఇక ఎప్పటికీ తిరిగి రాడన్న నిజాన్ని భార్య నాగేశ్వరి జీర్ణించుకోలేకపోతోంది. చిన్న వయసులోనే భర్తను కోల్పోయిన ఆమెకు ఇద్దరు చిన్నారుల బాధ్యత ఇప్పుడు ఒంటరిగా మిగిలింది. తండ్రి సంపాదనపై ఆధారపడి జీవిస్తున్న పిల్లలకు భవిష్యత్తు ఎలా అన్న ప్రశ్న తలెత్తుతోంది. నిన్నటి వరకు కుటుంబానికి అండగా ఉన్న వ్యక్తి ఒక్కసారిగా దూరం కావడంతో ఆ ఇంట్లో విషాదం నెలకొంది.

గతంలోనూ విద్యుత్ ప్రమాదం

ఇస్కాన్ ఆలయ నిర్మాణ ప్రదేశంలో గతంలోనూ విద్యుత్ ఘాతంతో ఒకరు మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. అదే తరహాలో తాజాగా మరో కార్మికుడు విద్యుత్ షాక్‌తో ప్రాణాలు కోల్పోవడం నిర్మాణ ప్రదేశంలో భద్రతా ఏర్పాట్లపై తీవ్రఖ సందేహాలను కలిగిస్తోంది. గత ప్రమాదం తర్వాత నిర్మాణ ప్రదేశంలో విద్యుత్ భద్రతకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకున్నారు, విద్యుత్ వైర్లను సురక్షితంగా ఏర్పాటు చేశారా, కార్మికులకు రక్షణ పరికరాలు అందిస్తున్నారా, ప్రమాదకర పరిస్థితులను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకుంటున్నారా అన్న ప్రశ్నలకు సమాధానాలు కావాల్సి ఉంది. నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశాల్లో విద్యుత్ వైర్లు, పరికరాలు ఏమాత్రం నిర్లక్ష్యానికి గురైనా ప్రాణాలు బలయ్యే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా రోజువారీ కూలీలుగా పనిచేసే కార్మికులకు భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించడం, రక్షణ పరికరాలు అందించడం, విద్యుత్ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించడం అత్యవసరం. ఒకసారి ప్రమాదం జరిగిన తర్వాత కూడా అదే తరహాలో మరో ప్రమాదం చోటుచేసుకుంటే.. భద్రతా చర్యలు ఎంతవరకు అమలవుతున్నాయన్నది సహజంగానే ప్రశ్నార్థకమవుతుంది.



ఇస్కాన్ స్పందించాల్సిన సమయం

ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మిక సంస్థగా గుర్తింపు పొందిన ఇస్కాన్ ఆధ్వర్యంలో హిందూపురంలో ఆలయ నిర్మాణం జరుగుతోంది. భక్తుల కోసం నిర్మిస్తున్న ఈ ఆలయం ఎంతో గొప్పదిగా ఉండాలని అందరూ కోరుకుంటారు. అయితే ఆ ఆలయ నిర్మాణంలో పనిచేస్తున్న కార్మికుల ప్రాణాలకు కూడా అంతే విలువ ఉండాలి. ఆలయ నిర్మాణంలో ఇటుకలు, సిమెంటు, రంగులతో పాటు కార్మికుల శ్రమ కూడా ముడిపడి ఉంటుంది. ఆ శ్రమ వెనుక వారి కుటుంబాల జీవితం ఉంటుంది. అలాంటి కుటుంబానికి చెందిన ఓ వ్యక్తి నిర్మాణ ప్రదేశంలో ప్రాణాలు కోల్పోయినప్పుడు సంస్థ మానవీయంగా స్పందించాల్సిన అవసరం ఉంది. నాగార్జున కుటుంబానికి సంస్థ తరఫున కనీస ఆర్థిక సాయం అందించాలని కుటుంబ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు. సంస్థ ప్రతినిధులు బాధిత కుటుంబాన్నిఖ పరామర్శించి, ఇద్దరు చిన్నారుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా సహాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇది ఎవరి మీద నిందలు వేయడానికి సంబంధించిన అంశం కాదని, ఒక కార్మికుడి ప్రాణానికి.. అతని కుటుంబ భవిష్యత్తుకు విలువ ఇవ్వాల్సిన మానవీయ బాధ్యత అని పలువురు పేర్కొంటున్నారు.

ప్రమాదానికి బాధ్యులెవరు..

నాగార్జున మృతికి అసలు కారణాలు ఏమిటి, విద్యుత్ వైరు ఎందుకు కిందపడింది, నిర్మాణ ప్రదేశంలో విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటించారా, కార్మికుల రక్షణకు అవసరమైన చర్యలు ఉన్నాయా, గతంలో జరిగిన ప్రమాదం తర్వాత ఏం చర్యలు తీసుకున్నారు. అనే అంశాలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉంది. ప్రమాదానికి కారణమైన నిర్లక్ష్యం ఏదైనా ఉంటే దానిని గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అయితే విచారణ, బాధ్యత, చర్యలు అన్నీ ఒకవైపు.. ఈలోగా నాగార్జున కుటుంబం మాత్రం ఆధారం కోల్పోయి కన్నీటిలో మునిగిపోయింది. ఆలయ నిర్మాణం కొనసాగుతుంది, పనులు కొనసాగుతాయి, కానీ నాగార్జున మాత్రం తిరిగి రాడు. అతని పిల్లలకు తండ్రి ప్రేమ తిరిగి రాదు. భార్య నాగేశ్వరి జీవితంలో ఖాళీని ఎవరూ పూడ్చలేరు. అందుకే ఇప్పటికైనా ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు స్పందించి నాగార్జున కుటుంబానికి అండగా నిలవాలి. ఇద్దరు చిన్నారుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలి. నిర్మాణ పనుల్లో పనిచేసే ప్రతి కార్మికుడి భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టాలి. ఆలయం భక్తులకు ఆధ్యాత్మిక ప్రశాంతతను ఇవ్వాలంటే.. దాని నిర్మాణంలో పనిచేసే కార్మికుల కుటుంబాల్లో మాత్రం కన్నీళ్లు మిగలకూడదు.

# సాలకట్ల బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలి- దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు.సచివాలయంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోం శాఖ మంత్రి శ్రీమతి వంగలపూడి అనిత, దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కన్నబాబు లతో కలిసి సాలకట్ల బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఈ నెల 15వ తేదీన శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించే కార్యక్రమం, ధ్వజారోహణం, వాహన సేవలు, చక్రస్నానం తదితర ప్రధాన కార్యక్రమాల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై సమగ్రంగా చర్చించారు.



భక్తులకు సౌకర్యవంతమైన దర్శనానికి ప్రత్యేక చర్యలు: మంత్రి ఆనం

బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున క్యూలైన్లు, దర్శన ఏర్పాట్లు, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్యం, వైద్య సేవలు, అత్యవసర సేవలు, వసతి, రవాణా, లగేజీ నిర్వహణ వంటి అన్ని అంశాలపై అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని మంత్రి ఆనం సూచించారు. భక్తులకు ఎక్కడా ఇబ్బంది పడకుండా, అవసరమైన చోట్ల అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి, రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సులభమైన, సురక్షితమైన దర్శనం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 15వ తేదీన ముఖ్యమంత్రి పట్టువస్త్రాలు సమర్పించే కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఉందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా, ముఖ్యమంత్రి కార్యక్రమం మరియు సాధారణ భక్తుల దర్శనాలు సమన్వయంతో సజావుగా జరిగేలా భద్రతా, ట్రాఫిక్, క్యూలైన్ తదితర ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని సూచించారు. ప్రధాన కార్యక్రమాల సమయంలో పోలీస్, విజిలెన్స్, టీటీడీ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సమయంలో సోషల్ మీడియాలో కొందరు అసత్య ప్రచారం, వదంతులు వ్యాప్తి చేసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. వాస్తవ సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు, భక్తులకు చేరవేసేలా అధికారిక సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని, తప్పుడు ప్రచారాన్ని వెంటనే గుర్తించి తగిన విధంగా ఖండించాలని అధికారులకు సూచించారు. మీడియా కూడా భక్తులకు సరైన సమాచారం అందించడంలో సహకరించాలని, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, దర్శన సమయాలు, రద్దీ పరిస్థితులు, రవాణా, వసతి తదితర అంశాలపై నిరంతరం వాస్తవ సమాచారాన్ని ప్రజలకు అందించాలని మంత్రి కోరారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదం, వసతి, తాగునీరు, వైద్య సేవలు, పారిశుధ్యం వంటి ప్రాథమిక సౌకర్యాల్లో ఎలాంటి కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆనం ఆదేశించారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రసాదాల లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని, అన్నప్రసాద కేంద్రాల్లో రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

## ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పోషకాహారమే పునాది



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు
ఆరోగ్య కరమైన సమాజ నిర్మాణానికి పోషక ఆహారమే పునాది అని గూడూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని విందూరు సెక్టార్ సూపర్వైజర్ బి హైమవతి అన్నారు. గూడూరు మండలం గోగినేని పురం అంగన్వాడీ కేంద్రంలో శనివారం 9వ జాతీయ పోషణ మాసం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ఆహార వైవిధ్యం మరియు తగినంత ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాలపై అవగాహన కల్పించారు. అంగన్వాడి కేంద్రాలలో ఆరోగ్యకరమైన ప్లేట్ కుటుంబానికి అందుబాటులో ఉండే పప్పులు, చిరుధాన్యాలు ఆకుకూరలు కూరగాయలు పండ్లు పాలు గుడ్లు వాటిలో ప్లేట్ తయారీ కార్యక్రమం చేసి గర్భవతులకు బాలింతలకు కిషోర్ బాలికలకు తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్త పి రమణకుమారి, ఆయా పి స్వాతి, గర్భవతులు బాలింతలు తల్లులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలి- కమిషనర్



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు
వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రజలందరూ మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజించాలని పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని గూడూరు పురపాలక సంఘ కమిషనర్ మల్లికార్జున వెల్లడించారు. గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో ప్రతి ఒక్కరు వినాయక చవితి జరుపుకుంటారని పర్యావరణం కలుషితం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి మన ఇంటిలోని పూల కుండీలలో నిమజ్జనం చేయడం వల్ల పర్యావరణం కాలుష్యం కాకుండా ఉంటుందని అన్నారు మనం జరుపుకునే పండుగ ఇతరులకు ఇబ్బంది కలగకూడదని జన విజ్ఞాన వేదిక ప్రజలను చైతన్యం చేస్తు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు ఈ కార్యక్రమంలో వేగూరు రాజేంద్ర ,ముని గిరీష్ ,చెంచు నారాయణ,రామ్మోహన్ రావు ,సుమన్ ,అరుణ్ ,ప్రభాకర్ ,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యధిక ల్యాబ్ ప్రారంభం

### - ప్రారంభించిన ఎమ్మెల్యే సునీల్ కుమార్



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు
టిడిపి ప్రభుత్వంలోనే గూడూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో అనేక వసతులు కల్పించడం జరిగిందని నేడు అత్యాధునిక ల్యాబ్ ప్రారంభించడం సంతోషంగా ఉందని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో ఒక కోటి 25 లక్షల రూపాయల తో ఏర్పాటు చేసిన సమగ్ర ప్రజా ఆరోగ్య పరీక్ష కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆర్డీఓ అరుణకుమారి హాజరయ్యారు. ఎమ్మెల్యే ఆర్డీవో మరియు కమిటీ సభ్యులు పరీక్షా కేంద్రాలను ప్రారంభించి నిర్వహించే పరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలోనే అభివృద్ధి జరిగిందని ప్రభుత్వ హాస్పిటల్ లో సిటీ స్కాన్ డయాలసిస్ యూనిట్ గల్ల పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామని గుర్తు చేశారు నేడు రాష్ట్రవ్యాప్తంగా 22 కేంద్రాల్లో అత్యాధునిక వసతులతో ల్యాబ్ లో ప్రారంభించడం జరిగిందని దానిలో గూడూరు కూడా ఉండడం సంతోషంగా ఉందని తెలిపారు ఈ ల్యాబ్‌లో ఇప్పటివరకు లేనటువంటి థైరాయిడ్ ,క్యాన్సర్ ,ఇంకా అనేక పరీక్షలు చేస్తారని అసంపూర్తిగా నిలిచిపోయిన హాస్పిటల్ నూతన భవన నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు .ఆర్డీవో అరుణకుమారి మాట్లాడుతూ ఆధునిక వసతులతో ప్రజలకు ప్రభుత్వం ల్యాబ్ సౌకర్యం ఏర్పాటు చేసిందని ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునరావు ,నాయకులు కిరణ్ కుమార్ ,బిల్లు చెంచురామయ్య ,మట్టం శ్రావణి ,భారతి ,సూపర్డెంట్ షరీనా, ఆర్ఎంఓ ప్రసన్న, పలువురు వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

## నేషనల్ లోక్ అదాలత్ లో కక్షిదారులు రాజీ మార్గం ద్వారా త్వరితగతిన కేసులు పరిష్కారం....పాకాల జూనియర్ సివిల్ కోర్టు జడ్జి పి.పూర్ణిమ దేవి ..!

**సుదీర్ఘ విచారణ లేకుండా రాజీమార్గం ద్వారా సమయం,డబ్బు ఆదా చేసుకోవచ్చు....**
**505 కేసుల పరిష్కారం ద్వారా రూ.20,80,503 రూపాయలు.....**

ప్రజా భూమిప్రతినిధి, పాకాల: (చంద్రగిరి )
తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం పాకాల జూనియర్ సివిల్ కోర్టులో నేషనల్ లోక్ అదాలత్ ను పాకాల మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్,పాకాల జూనియర్ సివిల్ కోర్టు జడ్జి పి.పూర్ణిమ దేవి ఆధ్వర్యంలో కమిటీ సభ్యుల సమక్షంలో శనివారం నిర్వహించారు.నేషనల్ లోక్ అదాలత్ లో కక్షిదారులు రాజీ మార్గం ద్వారా త్వరితగతిన కేసులు పరిష్కరించు కోవచ్చని అన్నారు.ప్రత్యేకించి క్రిమినల్ కేసులు,సివిల్ కేసులు,ప్రీలిటిగేషన్ కేసులు,ప్రాపర్టీ టాక్స్,బిల్డింగ్ ప్లాన్స్,కుటుంబ తగాదాలు,పది లీటర్ల లోపు నాటుసారా కేసులు తదితర కేసులను ఇరుపక్షాల రాజీపూర్వక అంగీకారంతో పరిష్కరించుకోవచ్చని సూచించారు.సివిల్ 12 కేసుల,క్రిమినల్ 29,పెట్టి కేసులు 464,మొత్తం 505 కేసుల పరిష్కారం ద్వారా రూ.20,80,503 రూపాయలు వచ్చిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జి.గురుస్వామి నాయుడు,డి.సుబ్రహ్మణ్యం రెడ్డి,బి.చిన్న రెడ్డప్ప నాయుడు,జె.యం.గౌరీ శంకర్ రాజు,ఎస్.ఎన్.ఎం సలీం,జి.చంద్రమోహన్,జె.సి.సాయి తేజ ముని,ఎన్.ప్రవీణ్ ప్రకాష్,మధుసూదన్ రెడ్డి,ప్రేమ్ సాగర్,సునీల్, రాజా శ్రీనివాస్,అసిస్టెంట్ గవర్నమెంట్ ఫీడర్ కె.మురళి,కోర్టు సిబ్బంది మీన,మధు,పాకాల సి.ఐ టి.చిన్న గోవిందు,ఎస్ఐ సి.తరుణ్,కల్లూరు పోలీస్ అధికారులు,ఎక్సైజ్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



# గండి క్షేత్రం నిత్యాన్నదాన పథకానికి విరాళం - 275 గ్రాముల వెండి కిరీటం సమర్పణ

ప్రజాభూమి, చక్రాయపేట



రాయలసీమ జిల్లాలలోనే ప్రసిద్ధి చెందిన గండి క్షేత్రంలోని శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న శ్రీ స్వామివారి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి కడప వాస్తవ్యులు మూలే రామసుబ్బారెడ్డి ధర్మపత్ని కౌసల్యాదేవి రూ.50,116 నగదు విరాళంగా అందజేశారని, అలాగే మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెందినఎనమల సుబ్బారెడ్డి ధర్మపత్ని సరస్వతి శ్రీ వీరాంజనేయస్వామివారికి 275 గ్రాముల వెండి కిరీటాన్నిసమర్పించారని ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి సి. విశ్వనాథ్, ఆలయ పాలకమండలి చైర్మన్ కె. వెంకటస్వామి తెలిపారు.దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# సీతారాం ఏచూరి ఆశయాల సాధనకు కృషి చేయాలి

**ంభగత్‌సింగ్ ఆటో యూనియన్ నాయకుల పిలుపు**

ప్రజాభూమి, హిందూపురం టౌన్



సిపిఎం జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, భారత కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనేత, శ్రామిక వర్గ పోరాట యోధుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి ద్వితీయ వర్ధంతి సందర్భంగా భగత్‌సింగ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ అధ్యక్షులు అత్తర్ బాబా మాట్లాడుతూ, సీతారాం ఏచూరి తన జీవితాంతం పీడిత ప్రజలు, కార్మికులు, కర్షకుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహానేత అని కొనియాడారు. పార్లమెంట్‌లోనూ, వెలుపలనూ కార్మికులు, సామాన్య ప్రజల గొంతుకగా నిలిచారని తెలిపారు. దేశంలో సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, లౌకిక విలువల పరిరక్షణ కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. కార్మిక వర్గ సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లడంలో, హక్కుల సాధన కోసం ఉద్యమాలను నిర్మించడంలో సీతారాం ఏచూరి కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నరసింహప్ప పాల్గొని సీతారాం ఏచూరి సేవలను స్మరించుకున్నారు. ఆటో యూనియన్ నాయకులు లక్ష్మీపతి, మూర్తి, చంద్ర, సోము, చంద్రబాబు, నారాయణతో పాటు పలువురు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# భార్యాభర్తల నడుమ గొడవ

**-భర్త మృతి, భార్యే హత్య చేసిందంటూ మృతుడి అక్క ఫిర్యాదు**
**-కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణంలోని కంసలపేటలో భార్యాభర్తల మధ్య జరిగిన గొడవలో రవికుమార్ (40) మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. భర్తను భార్యే హత్య చేసిందంటూ మృతుడి అక్క టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే రవికుమార్ మృతికి అసలు కారణం ఏమిటన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కంసలపేటలో నివాసముంటున్న రవికుమార్‌కు, ఆయన భార్యకు మధ్య శనివారం గొడవ జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో రవికుమార్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనపై మృతుడి అక్క టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేస్తూ.. తన తమ్ముడిని అతని భార్యే హత్య చేసిందని ఆరోపించింది. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి ఘటనపై వివిధ కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదికతో పాటు ఘటనకు ముందు భార్యాభర్తల మధ్య జరిగిన గొడవకు గల కారణాలు, వారి మధ్య నెలకొన్న పరిస్థితులు, రవికుమార్ మృతికి దారితీసిన పరిణామాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు అక్కడి పరిస్థితులను నమోదు చేసుకున్నట్లు తెలిసింది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులను కూడా విచారించి వివరాలు సేకరిస్తున్నారు. మృతుడి అక్క చేసిన ఆరోపణలపై కూడా పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు. రవికుమార్ మృతికి హత్యే కారణమా లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అన్నది పోస్టుమార్టం నివేదిక, పోలీసుల దర్యాప్తులో వెల్లడికానుంది. ప్రస్తుతం ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి.

# క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేద్దాం

**నాయకులు--కార్యకర్తల ఐక్యతే పార్టీకి బలం... ప్రజలతో మమేకమే విజయానికి మార్గం**

**- మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్**

ప్రజా భూమి శింగనమల

శింగనమల మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల విస్తృత సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడం, నాయకులు--కార్యకర్తల మధ్య సమన్వయం పెంచడం, క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై మరింత చురుగ్గా పనిచేయడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు ప్రతి గ్రామంలో పార్టీ శ్రేణులు ఐక్యంగా అడుగులు వేయాలి ప్రతి కుటుంబంతో మమేకం కావాలి ప్రతి ప్రజా సమస్యపై పోరాడాలి. వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా సమన్వయంతో, క్రమశిక్షణతో పనిచేస్తే శింగనమల లో పార్టీ మరింత బలమైన ప్రజా శక్తిగా ఎదుగుతుందని శైలజానాథ్ అన్నారు.ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, గుంతకల్ మాజీ ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, పార్లమెంట్ అబ్జర్వర్ నరేష్ కుమార్ రెడ్డి, అసెంబ్లీ అబ్జర్వర్ ఎల్.ఎం. మోహన్ రెడ్డి, జిల్లా రైతు విభాగ అధ్యక్షులు వై నారాయణ రెడ్డి ,రైతు విభాగం నాయకులు శ్రీరామ్ రెడ్డి, తరిమెల వంశీ గోకుల్ రెడ్డి, యువ నాయకులు సాకే రుత్విక్,జడ్పీటీసీలు బోగాతి ప్రతాపరెడ్డి, నీలం భాస్కర్,వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి గువ్వల శ్రీకాంత్ రెడ్డి, బండ్లపల్లి ప్రతాపరెడ్డి ఆయా మండల కన్వీనర్లు, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.




# బీసీల ఆత్మగౌరవం పెంచేలా చంద్రబాబు పాలన

**ఆత్మగౌరవం పెంచేలా రక్షణ చట్టానికి మెరుగులు- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

ప్రజాభూమి, విజయవాడ



: బీసీల ఆత్మగౌరవం పెంచేలా సీఎం చంద్రబాబునాయుడు పాలిస్తున్నారని, ప్రజల్లోని కూటమి నాయకులు, కార్యకర్తలు గర్వంతో తలెత్తుకుని వెళుతున్నారని, రాబోయే స్థానిక ఎన్నికల్లో తమదే విజయమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ధీమా వ్యక్తంచేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి తీరుతామని స్పష్టంచేశారు. జగన్ లో మరో ఓటమి భయం కనిపిస్తోందన్నారు. కోర్టుల్లో నిలబడేలా బీసీ రక్షణ చట్టాన్ని రూపొందిస్తున్నామన్నారు. విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్ లో వివిధ బీసీ కార్పొరేషన్ చైర్మన్లతో శనివారం బీసీ రక్షణ చట్టంపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బీసీలంటేనే టీడీపీ అని స్పష్టంచేశారు. బీసీల ఆత్మగౌరవం పెంచేలా సీఎం చంద్రబాబునాయుడు పాలిస్తున్నారన్నారు. గత ఎన్నికల ముందు మంత్రి నారా లోకేష్ నిర్వహించిన పాదయాత్రలో బీసీ రక్షణ చట్టం అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, బీసీ రక్షణ చట్టం అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోర్టుల్లో బలంగా నిలబడేలా ఈ చట్టానికి తుదిమెరుగులు దిద్దుతున్నామన్నారు. దీనిలో భాగంగా మంత్రివర్గ ఉప సంఘంతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో సమావేశాలు నిర్వహించామన్నారు. బీసీలను కులం, వృత్తుల పేరుతో దూషించినా, సంఘ బహిష్కరణలు చేసినా చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామన్నారు. జిల్లాల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తామని, రెండు నెలల్లో కేసుల దర్యాప్తు పూర్తి చేసేలా నిబంధనలు రూపొందించామని తెలిపారు. బీసీ రక్షణ చట్టాన్ని కోర్టుల్లో నిలబడేలా రూపొందిస్తున్నామన్నారు. ఇప్పుడు 156 బీసీ కులాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కార్పొరేషన్ల చైర్మన్ల నుంచి అభిప్రాయాలు తీసుకున్నామని తెలిపారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా ఏపీలోనే బీసీ రక్షణ చట్టం అమలుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సవిత తెలిపారు.

**బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసి తీరుతాం...**

స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని మంత్రి సవిత స్పష్టం చేశారు. 19987 అన్న ఎన్టీఆర్ తొలిసారిగా బీసీలకు రిజర్వేషన్లకు అమలు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు బీసీలకు 34 శాతానికి రిజర్వేషన్లు పెంచారన్నారు. 2019 తరవాత అధికారంలోకి వచ్చిన జగన్ ...బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి కుదించారన్నారు. గొడ్డలి పార్టీ చర్యతో బీసీలకు రాజకీయంగా తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. మరోసారి 34 శాతం రిజర్వేషన్ల కల్పనకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి సవిత తెలిపారు.

**ధైర్యంగా ప్రజల్లోకి వెళుతున్నాం**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన 26 నెలల్లో ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేశామని మంత్రి సవిత తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాల్లో అత్యధికంగా బీసీలే లబ్ధిపొందుతున్నారన్నారు. ఒకవైపు సంక్షేమ పథకాలు, మరో వైపు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం చంద్రబాబునాయుడు చేపడుతున్నారన్నారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు. అన్ని ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రజల్లోకి ధైర్యంగా కూటమి నాయకులు, కార్యకర్తలు వెళ్లేలా సీఎం చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారని కొనియాడారు. త్వరలో ఆదరణ 3.0ను అమలు చేస్తామని మంత్రి సవిత తెలిపారు.

**జగన్ కు ఓటమి భయం**

సీఎం చంద్రబాబునాయుడు పాలనపై ప్రజల్లో సానుకూలత వ్యక్తమవుతోందని మంత్రి సవిత తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానిదే విజయమని ధీమా వ్యక్తంచేశారు. జగన్ లో మరో ఓటమి భయం కనిపిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీసీ కార్పొరేషన్ల చైర్మన్లకు మంత్రి సవిత దిశానిర్దేశం చేశారు. బీసీ రక్షణ చట్టంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలుకు కృషి చేస్తున్న సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు, మంత్రి నారా లోకేష్ కు, మంత్రి సవితకు వివిధ కార్పొరేషన్ చైర్మన్లు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి సవితకు ఘనంగా సత్కరించారు. అంతకు ముందు మంత్రి సవిత... అన్న ఎన్టీఆర్, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, పలు బీసీ సంక్షేమ శాఖ కార్పొరేషన్ చైర్మన్లు వీరంకి వెంకట్ గురుమూర్తి, నందం అబద్ధయ్య, పేరేపి ఈశ్వరరావు, నర్సింహాయాదవ్, మల్లెల ఈశ్వర్, దేవేంద్రప్ప, చిలకలపూడి పాపారావు, కొల్లు పెద్దిరాజు, సీఆర్ రాజన్, రుద్రకోటి సదాశివ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇది కదా మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ అంటే

**- జగన్ హయాంలో మార్కెట్ ఇంటర్వెన్షన్ ఎక్కడ? రైతులకు చేసిన సాయం ఎంత?**
**- వ్యవసాయ శాఖ మంత్రి కింజారాపు అచ్చెన్నాయుడు వెల్లడి**

ప్రజాభూమి, అమరావతి,

రైతు పండించిన పంటకు మార్కెట్‌లో కనీస మద్దతు ధర కంటే తక్కువ ధర లభించి నష్టపోయే పరిస్థితి ఏర్పడినప్పుడు, రైతుకు అండగా నిలిచి ధరకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం మార్కెట్‌లో జోక్యం చేసుకోవడమే మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు మార్కెట్ ఇంటర్వెన్షన్ పేరుతో పెద్దగా ప్రయోజనం కల్పించకపోయినా, భారీగా నిధులు ఖర్చు చేసినట్లు ప్రచారం చేసుకున్నారని మంత్రి విమర్శించారు. బడ్జెట్‌లో కేటాయింపులు చూపించడం, వాస్తవంగా రైతులకు నిధులు అందించడం మధ్య భారీ వ్యత్యాసం ఉందని ఎద్దేవా చేశారు. రైతుల పంటలకు ధరలు పడిపోయినప్పుడు జగన్ ప్రభుత్వం ఎక్కడ ఉంది? రైతులకు ఎంత సాయం చేసింది? అని మంత్రి ప్రశ్నించారు. 2025--26 ఆర్థిక సంవత్సరానికి మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద ప్రభుత్వం రైతును ఆదుకునేందుకు చిత్తశుద్ధితో పనిచేసిందని మంత్రి తెలిపారు. వివిధ పంటలకు మద్దతు ధరల కోసం సుమారు రూ.800 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. అందులో భాగంగా పొగాకు -- రూ.271 కోట్లు, మామిడి -- రూ.261 కోట్లు, ఉల్లి -- రూ.125 కోట్లు, కోకో -- రూ.14 కోట్లు, టమాటా -- రూ.12 కోట్లు ఖర్చు చేసామని తెలిపారు. ఈ ఏడాది కూడా తోతాపూరి మామిడి, పొగాకు రైతులకు అండగా నిలిచామని వెల్లడించారు. మార్కెట్‌లో తోతాపురి మామిడి ధరలు పడిపోవడంతో రైతులకు అండగా నిలిచిన కూటమి ప్రభుత్వం కిలోకు రూ.4 చొప్పున ధర లోటు భర్తీ చేసిందని మంత్రి తెలిపారు. చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి, కడప జిల్లాల్లోని రైతులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం కల్పించామని చెప్పారు. మొత్తం 7.03 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి ఉత్పత్తికి కిలోకు రూ.4 చొప్పున ధర లోటు చెల్లింపు చేసినట్లు మంత్రి వివరించారు. ఆఫ్-స్టైల్, లో-గ్రేడ్ పొగాకు రకాలను సాగు చేస్తున్న రైతులను ఆదుకునేందుకు కిలోకు రూ.10 చొప్పున ప్రోత్సాహకం అందించామని మంత్రి తెలిపారు. మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతున్న వేలాది మంది పొగాకు రైతులకు ఈ నిర్ణయం గణనీయమైన ఆర్థిక ప్రయోజనం కల్పిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

**వైసీపీ హయాంలో రైతులను గాలికొదిలేశారు**

రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. రైతుల పేరుతో ప్రచారం చేసుకోవడం తప్ప, పంటలకు ధరలు పడిపోయినప్పుడు వారికి అండగా నిలిచిన దాఖలాలు ఆ ప్రభుత్వానికి లేవు



అని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా విమర్శించారు. 2020లో మార్కెట్ ధర సుమారు రూ.12,000గా ఉన్నప్పటికీ కేవలం రూ.7,000 మద్దతు ధర ప్రకటించి, దానిని అమలు చేయడానికి అవసరమైన నిధులను కూడా మంజూరు చేయలేదని ఆరోపించారు. రైతులకు నిజంగా ఎంత సాయం చేశారో చెప్పకుండా, కాగితాలపై భారీ మొత్తాలు చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వ 5 ఏళ్ల కాలంలో మార్కెట్ ఇంటర్వెన్షన్‌కు రూ.2,140 కోట్లు బడ్జెట్ కేటాయించినట్లు చూపించి, వాస్తవంగా కేవలం రూ.1,475 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని మంత్రి తెలిపారు. అయితే రూ.7,700 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రచారం చేసుకోవడం వైసీపీ ప్రభుత్వ అసమర్థతకు, రైతుల పట్ల దాని నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. కూటమి ప్రభుత్వం 2025-2026 ఏడాదిలోనే 800 కోట్లకు పైగా రైతులకు ఖర్చు చేసామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రైతులను మాటలతో మోసం చేస్తే.. కూటమి ప్రభుత్వం చేతల్లో అండగా నిలుస్తోంది. వైసీపీ హయాంలో కాగితాలపై కేటాయింపులు, ప్రచారంలో వేల కోట్లు.. కూటమి ప్రభుత్వంలో రైతుల ఖాతాల్లోకి వాస్తవంగా సాయం. ఇదే రెండు ప్రభుత్వాల మధ్య ఉన్న తేడా అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. పంట ధరలు పడిపోయిన ప్రతిసారీ రైతు మార్కెట్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి లేకుండా మార్కెట్ ఇంటర్వెన్షన్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని మంత్రి తెలిపారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం, అవసరమైన సమయంలో ప్రభుత్వమే మార్కెట్‌లో జోక్యం చేసుకుని రైతును ఆదుకోవడం కూటమి ప్రభుత్వ విధానమని చెప్పారు. రైతు కష్టపడి పండించిన పంటకు ధర రాకుండా పోతే కూటమి ప్రభుత్వం చూస్తూ చేతులు ముడుచుకుని కూర్చోదు. రైతు నష్టపోకుండా అవసరమైన ప్రతి సందర్భంలో మార్కెట్‌లో జోక్యం చేసుకుంటాం. నిధులు అవసరమైతే మరిన్ని నిధులు సమకూరుస్తాం. రైతు సంక్షేమమే మా ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# అమరావతి క్వాంటం బయో వ్యాలీకి కేంద్ర సహకారం

**సాంకేతిక బృందాన్ని అమరావతికి పంపుతాం -జాతీయ స్థాయిలో సంజీవని అమలును పరిశీలిస్తాం**
**సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏపీ సేఫ్ హ్యాండ్స్ లో ఉందన్న కేంద్ర ఆరోగ్య మంత్రి**

ప్రజాభూమి, విజయవాడ

అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటం బయో వ్యాలీకి జాతీయ స్థాయిలో గుర్తింపు కల్పించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా సానుకూలంగా స్పందించారు. క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటుకు కేంద్రం నుంచి సహకారం అందిస్తామని ప్రకటించారు. ఈ అంశంపై చర్చించేందుకు కేంద్రం నుంచి సాంకేతిక బృందాన్ని అమరావతికి పంపనున్నట్లు తెలిపారు. క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన బాగుందని, ఆయన చేసిన వివిధ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. శనివారం విజయవాడలో వైద్యారోగ్య శాఖకు చెందిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబుతో కలిసి పాల్గొన్న కేంద్రమంత్రి నడ్డా ఈ మేరకు ప్రకటన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సంజీవని కార్యక్రమంపైనా నడ్డా ప్రశంసలు కురిపించారు. సంజీవని కార్యక్రమం అద్భుతంగా ఉందని పేర్కొంటూ, దాన్ని జాతీయ స్థాయిలో అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ప్రజలకు ముందస్తుగా వ్యాధులను గుర్తించడం, నివారణ, మెరుగైన చికిత్సతో పాటు అందుబాటు ధరల్లో వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు కేంద్రం నుంచి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు.

**చంద్రబాబు విజన్‌పై నడ్డా ప్రశంసలు**

ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ సురక్షితమైన చేతుల్లో ఉందని కేంద్ర మంత్రి జేపీ నడ్డా అన్నారు. చంద్రబాబు విజన్, నిబద్ధత కలిగిన నాయకుడని ప్రశంసించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, విభజిత ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో చంద్రబాబు పోషించిన పాత్రను మరువలేమని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబు చేస్తున్న కృషిని కొనియాడారు. వైద్యారోగ్య రంగానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని నడ్డా తెలిపారు.

రాష్ట్రంలో ఆరోగ్య మౌలిక సదుపాయాల అభివృద్ధికి చేపడుతున్న చర్యలను ప్రశంసించారు. కేంద్రం, రాష్ట్రం కలిసి పనిచేయడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన వంటిల్లే ఫార్మసీ--ఆహారమే ఔషధం అనే విషయాన్ని కేంద్ర మంత్రి జేపీ నడ్డా తన ప్రసంగంలో వివిధ సందర్భాల్లో ప్రస్తావించారు. చంద్రబాబు చెప్పిన మాటలు నూటికి నూరు శాతం నిజమని అన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఇదే మూల సూత్రమని పేర్కొన్నారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, జీవన విధానం ద్వారా వ్యాధులను నివారించుకోవడంపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

**సాగునీటి ప్రాజెక్టులపై చంద్రబాబు చిత్తశుద్ధి**

ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చూపుతున్న చిత్తశుద్ధిని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి అభినందించారు. పోలవరం ఎడమ కాలువ, వెలిగొండ, హంద్రీ--నీవా వంటి ప్రాజెక్టులను ప్రారంభించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సాగునీరు కీలకమని, నీటి వనరులను సమర్థంగా వినియోగించుకునేలా చేపడుతున్న ప్రాజెక్టులు రాష్ట్ర ప్రగతికి దోహదపడతాయని పేర్కొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాల నివారణకు డ్రోన్ నిఘా

**- జూదం, మట్కా, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై పర్యవేక్షణ- సీఐ టి. నరసింహులు**

ప్రజాభూమి, వేంపల్లె



స్థానిక పట్టణంలో అసాంఘిక కార్యకలాపాల నివారణకు పోలీసులు డ్రోన్ నిఘా చేపట్టారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు సీఐ టి. నరసింహులు ఆధ్వర్యంలో విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా డ్రోన్ నిఘా నిర్వహించారు. కుప్పాలపల్లి రోడ్డు, వివేకానంద పాఠశాల ప్రాంతం, నందిపల్లి వాటర్ ట్యాంక్ ప్రాంతం, రాజీవ్‌నగర్ కాలనీ పరిసరాల్లో డ్రోన్ కెమెరాలతో ప్రత్యేకంగా పర్యవేక్షించారు. జూదం, మట్కా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, ఇతర అసాంఘిక కార్యకలాపాల నివారణకు డ్రోన్ నిఘా కొనసాగిస్తున్నట్లు సీఐ నరసింహులు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నరసింహులు హెచ్చరించారు.

# కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ

## విద్యార్థులకు మెరుగైన విద్య, వసతులు అందేలా చర్యలు.. అధికారులకు ఆదేశాలు-ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

ప్రజా భూమి శింగనమల

శింగనమల మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల పాఠశాలను ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, వంటగది, టాయిలెట్లు, విద్యార్థుల వసతి సౌకర్యాలు, పరిసర ప్రాంతాలను పరిశీలించి, విద్యార్థులు మరియు పాఠశాల సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య, భోజనంపై విద్యార్థుల నుంచి సంతృప్తికరమైన ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులను మరింత మెరుగు పరిచేందుకు కంప్యూటర్ రూమ్ నిర్మాణానికి రూ.18.50 లక్షలు అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. పాఠశాల మేజర్ రిపేర్స్ కోసం రూ.8.94 లక్షలు అంచనా వ్యయంతో పనులు చేపట్టేందుకు చర్యలు





తీసుకుంటున్నారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి అవసరమైన కెమిస్ట్రీ ల్యాబ్‌కు రూ.23.10 లక్షలు, ఫిజిక్స్ ల్యాబ్‌కు రూ.23.10 లక్షలు అంచనా వ్యయంతో ప్రతిపాదనలు ఉన్నాయి. పాఠశాలలో నీటి సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పంచాయతీ నీటి కనెక్షన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. పాఠశాల అవసరాల కోసం రూ.2 లక్షల అంచనా వ్యయంతో సంపు నిర్మాణం చేపడుతున్నామని, రెండు రోజుల్లో పనులు పూర్తి చేస్తామని అధికారులు ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ కి తెలిపారు. కేజీబీవీకి నీటి కనెక్షన్ ఇవ్వడం వల్ల గ్రామంలో నీటి కొరత ఏర్పడుతుందని గ్రామస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పగటి సమయంలో గ్రామస్తులు నీటిని వినియోగించుకునేలా, రాత్రి సమయంలో కేజీబీవీ పాఠశాల అవసరాలకు సంపులో నీటిని నింపుకుని వినియోగించుకునేలా అధికారులు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పులు, వాటి ప్రభావం, పర్యావరణంపై పడుతున్న ప్రభావం గురించి ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉన్న వాస్తవ పరిస్థితులను అధికారులు మరింత స్పష్టంగా వివరించి, అపోహలు మరియు అనవసర ఆందోళనలకు తావులేకుండా చూడాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఆర్డబ్ల్యూఎస్ మండల విద్యాశాఖ అధికారులు మరియు సంబంధిత అధికారులను ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని, కేజీబీవీలో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ తెలిపారు.

# కరువు కన్నీళ్ల మధ్య అన్నదాత ఆక్రందన

- వర్షం కోసం ప్రార్థనలు - పంటల కోసం రైతుల పోరాటాలు
- బోర్లలో నీరున్నా.. తక్కువ వోల్టేజీతో పంటలకు అందని సాగునీరు
- తొమ్మిది గంటలు కాదు.. రెండు షిఫ్టులు కావాలి

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఒక వైపు వాన కోసం చెరువుల్లో ప్రార్థనలు.. మరోవైపు పంటను బతికించుకునేందుకు కరెంటు కోసం రైతుల పోరాటం.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కరువు తీవ్రతకు ఇవే నిదర్శనాలు. ఆకాశం కరుణించక.. భూగర్భ జలాలు ఆదుకోక.. విద్యుత్ కూడా నాణ్యతగా అందకపోతే అన్నదాత పరిస్థితి ఏమిటన్న ఆందోళన వ్యక్తమవుతోంది. రైతు కళ్లలో మళ్లీ ఆశ చిగురించాలంటే వాన కురవాలి. వాన వచ్చేంత వరకు పంటను నిలబెట్టాలంటే నాణ్యమైన కరెంటు అందాలి. ప్రభుత్వం కరువు పరిస్థితిని అత్యవసరంగా పరిగణించి స్పందించాలని, విద్యుత్ శాఖ అధికారులు తక్కువ వోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, రైతుల డిమాండ్ మేరకు ఉదయం, సాయంత్రం రెండు షిఫ్టుల్లో 10 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని అన్నదాతలు కోరుతున్నారు. ఆకాశం వైపు ఆశగా చూస్తున్న అన్నదాతకు అడుగడుగునా నిరాశే ఎదురవుతోంది. ఒకవైపు వర్షాలు ముఖం చాటేయడంతో పొలాలు ఎండిపోతూ, భూగర్భ జలాలు అడుగంటిపోతుండగా మరోవైపు ఉన్న కొద్దిపాటి నీటితో పంటలను కాపాడుకుందామంటే విద్యుత్ సమస్య వెంటాడుతోంది. వాన కోసం ముస్లింలు చెరువుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసే దుస్థితి నెలకొంటే బోరుబావుల నీటితో పంటలను బతికించుకునేందుకు రైతులు విద్యుత్ శాఖ అధికారుల వద్ద మొరపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు కరువు తీవ్రతకు అద్దం పడుతున్నాయి. పంటలు కళ్లముందే



ఎండిపోతుంటే ప్రకృతి కరుణ కోసం ప్రార్థనలు, అందుబాటులో ఉన్న నీటిని పంటలకు అందించేందుకు రైతుల పోరాటాలు సాగుతున్నాయి.

### వాన కోసం ప్రార్థనలు..

వర్షాలు సకాలంలో కురవకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతోంది. చెరువులు, కుంటలు నిండకపోవడం, భూగర్భ జలమట్టాలు పడిపోవడంతో సాగునీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ హిందూపురం మండలం చౌలూరు గ్రామంలోని జామియా మసీదు ఆధ్వర్యంలో, అనంతపురం జిల్లా నార్పల లో ముస్లిం సోదరులు ముతవల్లి ఇక్బాల్ భాషా ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు చెరువులో సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అల్లా దయుదలచి వర్షాలు కురిపించాలని, చెరువులు, కుంటలు నిండాలని, ఎండిపోతున్న పంటలకు ప్రాణం పోయాలని ప్రార్థించారు. వర్షాభావ ప్రభావం పంటలకే పరిమితం కాలేదని, నీరు, మేత అందక పశువులు, పక్షులు, ఇతర మూగజీవాలు సైతం ఇబ్బందులు పడుతున్నాయని మత పెద్దలు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క మంచి వర్షం కురిస్తే పొలాల్లో పచ్చదనం పరుచుకుని రైతు కుటుంబాల్లో మళ్లీ ఆశలు చిగురిస్తాయని ఆకాంక్షించారు.

### బోర్లలో నీరున్నా.. కరెంటు కష్టమే

వర్షాలు లేక భూగర్భ జలాలు తగ్గిపోతున్న సమయంలో బోరుబావులపై ఆధారపడిఖ సాగు చేస్తున్న రైతులకు విద్యుత్ సరఫరా మరో పెద్ద సమస్యగా మారింది. తూమకుంట చెరువు కింద పంటలు సాగు చేస్తున్న రైతులు తక్కువ వోల్టేజీ సమస్యతో పంటలకు సక్రమంగా నీరు అందడం లేదని విద్యుత్ శాఖ డీఈ చంద్రనాయక్ దృష్టికిఖ తీసుకెళ్లారు. విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ తక్కువ వోల్టేజీ కారణంగా మోటార్లు పూర్తిస్థాయిలో పనిచేయడం లేదని తెలిపారు. మోటార్లు తిరుగుతున్నా నీరు మాత్రం సక్రమంగా రావడం



లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పొలాల్లో తేమ పూర్తిగాఖ తగ్గిపోతోందని, పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని రైతులు తెలిపారు. ఇప్పటికే బోర్లలో నీటిమట్టం పడిపోవడంతో పరిమితంగా లభిస్తున్న నీటిని కూడా సక్రమంగా పంటలకు అందించుకోలేకపోతున్నామని వాపోయారు. ఇలాంటి కీలక సమయంలో విద్యుత్ సరఫరా నాణ్యతగా లేకపోతే పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలను ఎలా కాపాడుకోవాలని ప్రశ్నించారు.

### తొమ్మిది గంటల కరెంటు.. రైతుకు ఎంత ఉపయోగం...

అధికారులు తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని రైతులు పేర్కొన్నారు. సుమారు నాలుగు గంటలపాటు మాత్రమే విద్యుత్ కొంతమేర ఉపయోగపడుతోందని, మిగిలిన సమయంలో తక్కువ వోల్టేజీ కారణంగా మోటార్లు తిరిగినా నీరు సరిగా రావడం లేదన్నారు. దీంతో గంటల తరబడి విద్యుత్ కోసం ఎదురుచూసినా పంటలకు అవసరమైన సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కరువు పరిస్థితుల్లో ఒకేసారి తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేయడం కంటే ఉదయం, సాయంత్రం రెండు షిఫ్టులుగా నాణ్యమైన విద్యుత్ అందిస్తే రైతులకు మరింత ప్రయోజనం ఉంటుందని తెలిపారు. ఉదయం ఒక షిఫ్టు, సాయంత్రం మరో షిఫ్టుగా మొత్తం 10 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలా చేస్తే బోర్లలో అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటిని కూడా సమర్థవంతంగా వినియోగించుకుని పంటలను కాపాడుకునే అవకాశం ఉంది.

### పంటలు ఎండుతుంటే.. తక్షణ చర్యలేవీ....

తక్కువ వోల్టేజీ సమస్యను తక్షణమే పరిష్కరించి మోటార్లు పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరా పరిస్థితిని పరిశీలించి సమస్య ఎక్కడ ఉందో గుర్తించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వర్షాలు లేకపోవడం ఒక సమస్య అయితే.. ఉన్న నీటిని పంటలకు అందించుకునే సమయంలో విద్యుత్ నాణ్యత లేకపోవడం మరో సమస్యగా మారిందన్నారు. దీనిని కేవలం సాంకేతిక సమస్యగా కాకుండా రైతుల జీవనోపాధికి సంబంధించిన అత్యవసర సమస్యగా అధికారులు పరిగణించాలని కోరారు. పంటలు ఎండిపోయిన తర్వాత పరిహారం కోసం ఎదురుచూడటంకంటే.. ప్రస్తుతం పంటలనుకాపాడే చర్యలే అవసరమని పేర్కొన్నారు.

### వాన కోసం ప్రార్థనలు, వంట కోసం పోరాటాలు

ఒకవైపు వాన కురవాలి, చెరువులు నిండాలి, పంటలు బతకాలి అంటూ ప్రార్థనలు జరుగుతుంటే మరోవైపు ఉన్న నీటితో నైనా పంటలను కాపాడుకునేందుకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి అంటూ రైతులు అధికారులను కోరుతున్నారు. ఆకాశం వైపు రైతు చూపులు, చెరువు వైపు ప్రార్థనలు, బోరుబావుల వైపు ఆశలు, విద్యుత్ శాఖ వైపు వేడుకోళ్లు, ఇలా అన్నదాతకు కరువు కాలం కన్నీళ్లనే మిగులుస్తోంది. ప్రభుత్వం ఉమ్మడి అనంతపురం జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను తీవ్రంగా పరిగణించి పంటల పరిస్థితిపై క్షేత్రస్థాయి సమీక్ష నిర్వహించాలని రైతులు కోరుతున్నారు. తక్కువ వోల్టేజీ సమస్యను పరిష్కరించి, ఉదయం, సాయంత్రం విడతలుగా 10 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని డిమాండ్ చేస్తున్నారు. వర్షాలు కురిసి చెరువులు నిండి, భూగర్భ జలాలు పెరిగి, పంటలు పచ్చగా కళకళలాడే రోజులు రావాలని అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# ప్రైవేటీకరణ చర్యలు ఆపి ఆర్టీసీని బలోపేతం చేయాలి

## -కరపత్రాల పంపిణీలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ప్రజలకు సేవలందిస్తున్న ఆర్టీసీని మరింత బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా ప్రైవేటీకరణ వైపు అడుగులు వేయడం దారుణమని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు విమర్శించారు. విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేటు సంస్థలకు అప్పగించే రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హిందూపురం ఆర్టీసీ డిపోలో కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వ విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు విఆర్ రాముతో కలిసి ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీని ప్రైవేటీకరించే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం 2024లో పుణేకు చెందిన పినాకిల్ సంస్థతో ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. ఈ ఒప్పందాన్ని అమలు చేసేందుకు ఇటీవల చర్యలను వేగవంతం చేసిందన్నారు. ఇప్పటికే నాలుగు ఆర్టీసీ డిపోలను ఖాళీ చేయించారని, మరో ఎనిమిది డిపోలను ఖాళీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. సుమారు 750 విద్యుత్ బస్సులను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు చర్యలు జరుగుతున్నాయని, మరో 300 బస్సులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారని పేర్కొన్నారు. కేంద్ర



ప్రభుత్వం విద్యుత్ బస్సులకు ఒక్కో బస్సుకు రూ.40 లక్షల చొప్పున సబ్సిడీ అందిస్తున్నప్పటికీ ఆ ప్రయోజనాన్ని ఆర్టీసీకి కాకుండా ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. పినాకిల్ సంస్థతో కుదిరిన ఒప్పందం ప్రకారం ఒక్కో కిలోమీటరుకు రూ.72.55 చెల్లించాల్సి వస్తుందని, ప్రస్తుతం ఆర్టీసీకి కిలోమీటరుకు సుమారు రూ.16.80 మాత్రమే ఆదాయం వస్తోందన్నారు. ప్రజాధనాన్ని ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టే విధానాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీకి ప్రభుత్వం నుంచి రూ.కోట్లలో బకాయిలు రావాల్సి ఉందని, ఆ నిధులను విడుదల చేసి సంస్థను బలోపేతం చేయకుండా ప్రైవేటు సంస్థలకు అవకాశాలు కల్పించడం సరికాదన్నారు. ఆర్టీసీ వద్ద నిధులు లేకపోవడం వల్లే కొత్త బస్సులు కొనుగోలు చేయలేకపోతున్న పరిస్థితిని ప్రభుత్వం సృష్టించిందని విమర్శించారు. సంస్థలో ఏళ్ల తరబడి సుమారు 12 వేల ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడం కూడా ఆర్టీసీని బలహీనపరిచే చర్యల్లో భాగమేనని ఆరోపించారు. విద్యుత్ బస్సులకు సీఐటీయూ వ్యతిరేకం కాదని, విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేటు సంస్థలకు అప్పగించడాన్నే వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీకి సుమారు 1,950 ఎకరాల భూములు ఉన్నాయని, నగరాలు, పట్టణాల్లో విలువైన డిపోలు, వర్క్‌షాప్‌లు, బస్టాండ్లు ఉన్నాయని తెలిపారు. ప్రజా ఆస్తులుగా ఉన్న వీటిని ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే భవిష్యత్తులో ఆర్టీసీకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. ఆర్టీసీ ప్రైవేటీకరణ జరిగితే ప్రస్తుతం ప్రజలకు అందుతున్న రాయితీలు, ముఖ్యంగా మహిళలకు కల్పిస్తున్న ఉచిత ప్రయాణం వంటి ప్రజా ప్రయోజన పథకాలపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను లాభాపేక్షతో నడిచే ప్రైవేటు సంస్థల చేతుల్లో పెడితే సామాన్య ప్రజలపై భారం పెరుగుతుందని పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తూ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, కొత్త బస్సులు కొనుగోలు చేసి సేవలను విస్తరించాలని, సంస్థకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రైవేటీకరించే ఏ ప్రయత్నాన్నైనా సీఐటీయూ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

# తోపుదుర్తి భాస్కర్ రెడ్డికి ఘన నివాళులు అర్పించిన వెన్నపూస రవీంద్రారెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

రాప్తాడు నియోజకవర్గం లోని తోపుదుర్తి గ్రామంలో శనివారం వైయస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఉమ్మడి అనంతపురం జిల్లా మాజీ జెడ్పీ చైర్ పర్సన్ తోపుదుర్తి కవితమ్మ భర్త స్వర్గీయ తోపుదుర్తి భాస్కర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా తోపుదుర్తి గ్రామం భాస్కర్ రెడ్డి తోట నందు భాస్కర్ రెడ్డి ఘాట్ వద్ద తోపుదుర్తి కుటుంబ సభ్యులు, అభిమానులతో కలిసి నివాళులర్పించిన పంచాయితీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రా రెడ్డి. ఈ కార్యక్రమంలో ప్రజా భూమి ప్రతినిధి డి రాజా హెన్నూర్, డాక్టర్ చంద్రశేఖర్, స్టార్ యార్డ్స్ కుల్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.



# చెరువు లో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన తల్లి ఇద్దరు పిల్లలు

## వారి కుటుంబ సభ్యులకు అప్పజెప్పిన ఎస్సై కే ప్రసాద్

ప్రజా భూమి శింగనమల

శింగనమల మండల పరిధి మరువకుమ్మ క్రాస్ లో శ్రీ రంగరాయల చెరువు వైపు వెళ్తున్న ఆత్మహత్యం చేసుకోవడానికి మహిళ పిల్లలు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు అక్కడే ఉన్న కొందరు ప్రయాణికులు రోడ్డు పనులు చేసేవారు. మహిళను ఇద్దరు పిల్లలను కాపాడారు. 100 డయల్ ఫోన్ ద్వారా శింగనమల పోలీస్ వారికి సమాచారం రావడంతో పోలీసులు వారు ఏ ఎస్ ఐ అశోక్ కుమార్, కానిస్టేబుల్, సంపత్, జింకల భాష సిబ్బంది హుటా హుటేనా ఘటన స్థలానికి చేరుకొని మహిళను ఇద్దరు పిల్లలను స్థానిక పోలీస్ స్టేషన్ కి తరలించారు.



# ఉపకారాగారాన్ని తనిఖీ చేసిన అదనపు జిల్లా న్యాయమూర్తి



ప్రజాభూమి, హిందూపురం టౌన్

పట్టణంలోని ఉపకారాగారాన్ని అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్వరరావు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీలతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటినుండి కారాగారంలో ఉంటున్నారు, న్యాయవాదులు ఉన్నారా, బెయిల్ మంజూరు అయిందా, ఎలాంటి తప్పులు చేసి కరాగారానికి వచ్చారు అన్న విషయాలను న్యాయమూర్తి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉపకారాగారంలో కారాగార సిబ్బంది ఏమైనా ఇబ్బందులకు గురి చేస్తున్నారా, వైద్యం, భోజన సౌకర్యాలను సక్రమంగా కల్పిస్తున్నారా లేదా అన్న విషయాలపై ఆరా తీశారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ, కారాగారం నుండి బయటకు వెళ్లిన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. కారాగారాలకు రావడం వల్ల ఆర్థికంగా దెబ్బ తినడంతో పాటు గౌరవ ప్రతిష్టలు ఉండవన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రిమాండ్ ఖైదీలు దరఖాస్తు చేసుకుంటే అర్హత ఉన్న వారికి ఉచిత న్యాయ సహాయం అందజేస్తామన్నారు. అనంతరం న్యాయమూర్తి నిత్యావసరాలు, కూరగాయలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపకారాగార అధికారి హనుమన్న, లోక్ అదాలత్ సిబ్బంది రాజా తదితరులు పాల్గొన్నారు.

# సుల్తాన్ పేట గ్రామ ప్రజల దాహం తీర్చిన చింతా లక్ష్మీ దేవి

ప్రజా భూమి నార్పల

సుల్తాన్ పేట గ్రామ ప్రజలు తాగునీటి సమస్యను వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కాపీ పొడిరాజు వ్యవసాయ బోరు నుంచి తాగునీటి కోసం కనెక్షన్ ఇచ్చి, గ్రామ ప్రజల దాహం తీర్చేందుకు ముందుకు వచ్చారు. గ్రామ ప్రజల సమస్యను అడిగిన వెంటనే స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించిన కాపీ పొడిరాజు కి సుల్తాన్ పేట గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యే తన సమస్యగా భావించి వెంటనే స్పందించిన నార్పల సత్యనారాయణ రెడ్డికి కూడా గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.



# మట్టి వినాయక విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి

## డాక్టర్ సాయి కిషోర్ సేవలను అభినందించిన పోలీసు అధికారులు

ప్రజాభూమి, పులివెందుల:

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాలను ఉపయోగించి పూజా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా కాలుష్య నివారణకు తమ వంతు సహకారం అందించాలని పులివెందుల డీఎస్పీ బి. మురళీ నాయక్, అర్బన్ సీఐ పురుషోత్తమ రాజు, ట్రాఫిక్ సీఐ జి. ప్రసాద్ రావు, రూరల్ సీఐ శాంతిలాల్ పిలుపునిచ్చారు. శనివారం శ్రీరామ్ హాల్ రోడ్డులోని శ్రీ సాయి ఫిజియోథెరపీ సెంటర్ ఆధ్వర్యంలో డాక్టర్ సాయి కిషోర్ పోలీసు



అధికారులను, సిబ్బందిని కలిసి మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో సుమారు 1,000 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం విశేషం. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని డాక్టర్ సాయి కిషోర్ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ముందుకు రావడం అభినందనీయమ న్నారు. మట్టి విగ్రహాలను పంపిణీ చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణపై మంచి సందేశాన్ని అందించారని ప్రశంసించారు. మట్టి విగ్రహాలతో వినాయకుడిని పూజించడం వల్ల పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు కూడా మట్టి విగ్రహాలను వినియోగించి పర్యావరణ హితమైన వినాయక చవితి వేడుకలు నిర్వహించాలని, కాలుష్య నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మధుసూదన్ రెడ్డి, ఏఎస్సైలు, పోలీసు సిబ్బందితో పాటు నాయకులు కొంగనపల్లి శ్రీనివాసులు, ఆకుల ప్రసాద్, బొల్లు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

జనరల్

ఆదివారం, సెప్టెంబర్ 13, 2026




# క్యాసినో నడుపుకునే గుట్కా నానికి లోకేష్ గురించి మాట్లాడే అర్హత లేదు

### కొడాలి నాని ఏడో తరగతి ఫెయిలై, లారీ క్లీనర్‌గా పనిచేసిన చరిత్ర కలిగిన వ్యక్తి

### –కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:

క్యాసినోలు నడుపుకునే గుట్కా కొడాలి నానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారి గురించి మాట్లాడే కనీస అర్హత, స్థాయి లేవని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నేడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...చదువు సంస్కారం లేని కొడాలి నాని ఏడో తరగతి ఫెయిలై, లారీ క్లీనర్‌గా పనిచేసిన చరిత్ర కలిగిన వ్యక్తి అని ఎద్దేవా చేశారు. విద్యావంతుడైన లోకేష్ గారిపై నోటికొచ్చినట్లు ఏకవచనంతో పిచ్చి కూతలు కూస్తే సహించేది లేదని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ పెట్టిన రాజకీయ భిక్షతో ఎమ్మెల్యే అయిన విషయాన్ని మరిచిపోయి, వెన్ను పోటు పొడిచి సైకో జగన్ పంచన చేరి బూతుల పంచాంగం అందుకున్నారని మండిపడ్డారు. ప్రజల సమస్యలపై నిలదీసే దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని, సభకు రాకుండా తాడేపల్లి ప్యాలెస్‌లో దాక్కుంటూ ప్రెస్ మీట్లు పెట్టి అవాకులు చెవాకులు పేలడం సిగ్గుచేటని మంత్రి విమర్శించారు. ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని తమ అధినేత జగన్ కోసం వకాల్తా పుచ్చుకుని మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క సమీక్ష నిర్వహించని చేతకాని మంత్రులు నేడు నీతులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు దావోస్ వెళ్లిన వైసీపీ కోడిగుడ్డు మంత్రులు, చిడతల బ్యాచ్ చలికి తట్టుకోలేక హోటల్ గదుల్లో దుప్పట్లు కప్పుకుని పడుకున్నారని ఎద్దేవా చేశారు. అదే నారా లోకేష్ గారు దావోస్ పర్యటన ద్వారా గూగుల్ డేటా సెంటర్‌కు సంబంధించి రూ. 1.50 లక్షల కోట్లు, రిలయన్స్ ద్వారా రూ. 2 లక్షల కోట్లతో పాటు ఐటీ శాఖకు దాదాపు రూ. 10 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను రాష్ట్రానికి రప్పించి చరిత్ర సృష్టించారని గుర్తుచేశారు. నియోజ కవర్గాల్లో కొల్లగొట్టే పందికొక్కుల్లా తయా రైన వల్లభనేని వంశీ, పేర్ని నాని లాంటి దోపిడీదారులకు గుట్కా నాని నిజాయితీపరులుగా కనిపిస్తున్నారని సుభాష్ దుయ్యబట్టారు. లారీ క్లీనర్‌గా పనిచేసిన అనుభవంతో మట్టి తోలితే రూ. 1,200, ఇసుక తోలితే రూ. 10,000 వస్తుందనే దోపిడీ లెక్కలు కొడాలి నానికి బాగా తెలుసని, అందుకే ఆ దోపిడీ ముఠాకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలైన సంపూర్ణ మద్యపాన నిషేధం, ఏటా జాబ్ క్యాలెండర్, అమ్మఒడి ప్రతి బిడ్డకూ వర్తింపు, ప్రత్యేక హోదా, సన్నబియ్యం, వారంలో సీపీఎస్ రద్దు వంటివన్నీ పచ్చి అబద్ధాలుగా మిగిలిపోయాయని గుర్తుచేశారు. "మంచి చేస్తేనే ఓటు వేయండి" అని ప్రచారం చేసుకున్న జగన్‌కు ప్రజలు 11 సీట్లు ఇచ్చి దేశంలోనే అత్యంత ఘోరమైన పరాభవాన్ని మిగిల్చారని తెలిపారు. బీసీల రిజర్వేషన్ల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి అసలే లేదని మంత్రి తేల్చిచెప్పారు. 2013లో నాటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి సుప్రీంకోర్టులో సమర్థవంతంగా న్యాయపోరాటం చేసి బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు నిలబెట్టారని వివరించారు. అయితే 2022లో వైసీపీ ప్రభుత్వ అశ్రద్ధ, చేతగానితనం వల్లే బీసీ రిజర్వేషన్లు 34 శాతం నుంచి 24 శాతానికి పడిపోయాయని, తమ అనుకూల సంక్షేమ సంఘాల ద్వారా కోర్టులో పిటిషన్లు వేయించి 16 వేలకు పైగా స్థానిక సంస్థల పదవులను బీసీలు కోల్పోయేలా చేసిన ద్రోహి జగన్మోహన్ రెడ్డి అని ధ్వజమెత్తారు. కోర్టుల్లో బీసీల తరఫున సమర్థంగా వాదించకుండా రిజర్వేషన్లను గాలికొదిలేసిన వైసీపీ, నేడు కోర్టులకు వెళ్తున్న కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటూ డీఎస్సీని అడ్డుకోవడానికి హైకోర్టు, సుప్రీంకోర్టులకు వెళ్లిన వైసీపీకి న్యాయస్థానాలు మొట్టికాయలు వేసి పక్కకెళ్లి ఆడుకోమని చెప్పినా బుద్ధి రాలేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఒక్క జాబ్ క్యాలెండర్ కూడా ఇవ్వని జగన్ బ్యాచ్, నేడు ప్రతిభావంతులకు ఉద్యోగాలు వస్తుంటే విషం కక్కుతోందన్నారు. రానున్న కాలంలో కూటమి ప్రభుత్వం మూడు డీఎస్సీలను విజయవంతంగా నిర్వహించబోతోందని స్పష్టం చేశారు. కొడాలి నాని ఇప్పటికైనా తన దురద నాలుకను అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, హద్దులు దాటి బూతులు మాట్లాడితే అదే రీతిలో తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర హెచ్చరికలు చేశారు.

# కృష్ణా జిల్లాలో 135 మద్యం షాపుల రెన్యూవల్

ప్రజాభూమి ప్రతినిధి,మచిలీపట్నం:

కృష్ణా జిల్లాలోని 135 మద్యం షాపుల లైసెన్సులను మరో ఏడాది పాటు రెన్యూవల్ చేసుకునేందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందు లో 123 జనరల్ షాపులు, 12 గీత కులాలకు రిజర్వు చేసిన షాపులు ఉన్నాయి. 2026 అక్టోబర్ 1 నుంచి 2027 సెప్టెంబర్ 30 వరకు లైసెన్సుల కాలపరిమితిని పొడిగిస్తూ 2026–27 ఎక్సైజ్ పాలసీ మార్గదర్శకాలను ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.కె. మీనా విడుదల చేశారు.ప్రస్తుత లైసెన్సుదారులు రెన్యూవల్ కోసం లైసెన్స్ ఫీజులో 38 శాతం మేర రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (ఆర్.ఈ.టి.) చెల్లించాల్సి ఉంటుంది. 50 వేల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.23 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.27.20 లక్షలు, 5 లక్షలకు పైగా జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.35.50 లక్షలుగా రెన్యూవల్ ఫీజును నిర్ణ యించారు. ఈ మొత్తాన్ని ప్రారంభ దశలోనే ఒకేసారి చెల్లించాల్సి ఉంటుందని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.గీత కులాలకు రిజర్వు చేసిన షాపులకు లైసెన్స్ ఫీజులో 50 శాతం చెల్లించాల్సి ఉంటుంది. జనాభా ఆధారంగా 50 వేల వరకు ఉన్న ప్రాంతాల్లో ఏడాదికి రూ.60.50 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల వరకు ఉన్న ప్రాంతాల్లో రూ.71.50 లక్షలు, 5 లక్షలకు పైగా జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.93.50 లక్ష లుగా లైసెన్స్ ఫీజును నిర్ణయించారు. ఈ లైసెన్స్ ఫీజును నాలుగు విడతల్లో చెల్లించుకునే అవకాశం కల్పించారు.పర్మిట్ రూమ్ ఫీజును 50 వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.5 లక్షలుగా, అంత కంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.7.50 లక్షలుగా నిర్ణయించారు. నిర్దేశించిన రుసుము లను చెల్లించి ప్రతి లైసెన్సుదారుడు తమ షాపులను రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. రెన్యూవల్ దరఖాస్తులను సెప్టెంబర్ 12 నుంచి సెప్టెంబర్ 21, 2026 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో లేదా కృష్ణా జిల్లా మద్య నిషేధ, ఎక్సైజ్ కార్యాలయం (బైపాస్ రోడ్)లో సమర్పించుకోవచ్చు. రెన్యూవల్ కాని షాపులకు సెప్టెంబర్ 22 నుంచి సెప్టెంబర్ 29, 2026 వరకు కొత్త దరఖాస్తులను స్వీకరించనున్నారు.కొత్త షాపులకు ప్రతి దరఖాస్తుకు రూ.3 లక్షల దరఖాస్తు రుసుము చెల్లించాలి. ఒక షాపుకు కనీసం నాలుగు దరఖాస్తులు వచ్చినట్లయితే లాటరీ ద్వారా లైసెన్సుదారుని ఎంపిక చేయనున్నారు. రెన్యూవల్ షాపుల దరఖాస్తుల ప్రాసెసింగ్ ఫీజుగా రూ.5,000, కొత్త షాపుల దరఖాస్తులకు రూ.1,000 చెల్లించాల్సి ఉంటుంది.రెన్యూవల్ కాని షాపులకు సంబంధించిన లాటరీ వివరాలు, ఇతర సమాచారాన్ని సెప్టెంబర్ 30, 2026న కృష్ణా జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో లేదా సంబంధిత ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లలో తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు. మరింత సమాచారం కోసం 8466981837 నంబరులో సంప్రదించాలని సూచించారు.

# వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి

### మతసామరస్యానికి భంగం కలిగించే చర్యలను సహించం

### నిమజ్జనానికి గిలకలదిండి పోర్ట్ ఏరియాలో ప్రత్యేక పాయింట్



ప్రజాభూమి ప్రతినిధి,మచిలీపట్నం :

మచిలీపట్నం సబ్ డివిజన్ పరిధిలో వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో, శాంతి యు త వాతావరణంలో నిర్వహించుకోవాలని బందరు డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు సూచిం చారు. అన్ని వర్గాల ప్రజల మధ్య సోదరభావం, సామరస్యాన్ని కాపా డేలా ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఆయన కోరారు.జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, ఆదే శాల మేరకు బందరు డీఎస్పీ ఆవుల శ్రీని వాసరావు వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి విగ్రహాల ఏర్పా టు, పూజా కార్యక్రమాలు, ఊరేగింపులు, నిమజ్జనం తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే ముందు పోలీస్, మున్సిపల్ లేదా స్థానిక సంస్థలు, విద్యుత్, అగ్నిమాపక, ట్రాఫిక్ తదితర సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు తప్పనిసరిగా పొందాలని సూచించారు. విగ్రహ మండపాల వద్ద ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బం దులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు.మండపాల్లో విద్యుత్ వైరింగ్, జనరేటర్లు, దీపాలంకరణ తదితర ఏర్పాట్లలో భద్రతా ప్రమాణాలను పాటించాలని, షార్ట్‌సర్క్యూట్, అగ్నిప్రమాదాలకు అవకా శం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర సమ యంలో అగ్నిమాపక వాహనాలు చేరుకునే మార్గాలను ఖాళీగా ఉంచాలని స్పష్టం చేశారు.పూజలు, సాంస్కృతిక కార్యక్ర మాల సందర్భంగా మతం, కులం, వర్గాల మధ్య విభేదాలు లేదా ఉద్రిక్తతలు తలెత్తేలా పాట లు, ప్రసం గాలు, నినాదాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించరాదని హెచ్చరించారు. అనుమతించిన పరిమి తికి మించి శబ్ద కాలుష్యం కలిగించేలా డీజేలు, సౌండ్ సిస్టమ్స్, లౌడ్‌స్పీకర్లను వినియోగించరాదని, అమలులో ఉన్న సమయ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఇతర మతాల ప్రార్థనా స్థలాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, ప్రజలకు ఇబ్బంది కలిగే ప్రాంతాల సమీపంలో అధిక శబ్దం చేయకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఊరేగింపులకు సంబంధించి మార్గం, సమయం, వాహనాల వివరాలను ముందుగానే పోలీసులకు అందించి అనుమతులు పొం దాలని తెలిపారు.ఊరేగింపుల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచ నలు పాటించాలని, అత్యవసర వాహనాలకు మార్గం కల్పించాలని చెప్పారు. మద్యం సేవించి ఊరేగిం పుల్లో పాల్గొనడం, అసభ్యకర ప్రవర్తన, గొడవలు, బహిరంగంగా అశాంతికి కారణమయ్యే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.పటాకులు కాల్చే సమయంలో సంబంధిత నిబంధనలు పాటించాలని, ప్రజలు, వాహనాలు, విద్యుత్ లైన్లు, మండపా లకు ప్రమా దం కలిగేలా పటాకులు కాల్చరాదని సూచించారు. మచిలీపట్నం ప్రాంతంలో గతంలో అనేక వినా యక విగ్రహాలను మంగినపూడి బీచ్ వద్ద నిమజ్జనం చేసేవారు. అయితే ఈ ఏడాది గిలకలదిండి పోర్ట్ ఏరియా సమీపంలో నిమజ్జనం కోసం ప్రత్యేక పాయింట్‌ను నిర్ణయించినట్లు పోలీసులు తెలిపారు. మచిలీపట్నం పట్టణ ప్రజలు, వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఈ విషయాన్ని గమనించి, పోలీస్, సంబంధిత శాఖల సూచనల మేరకు నిర్ణయించిన నిమజ్జన పాయింట్‌లోనే విగ్రహాలను నిమజ్జనం చేయాలని సూచించారు.నిమజ్జనానికి వచ్చే వాహనాలు నిర్దేశించిన మార్గాలు, సమ యాలను పాటించాలని, నిమజ్జన ప్రదేశంలో పోలీసుల సూచనలకు అనుగుణంగా క్రమశిక్షణతో వ్యవహరించాలని కోరారు.ఉత్సవ కమిటీ నిర్వాహకులు అన్ని శాఖల నుంచి అవసరమైన అనుమతులను ముందుగానే పొందడంతో పాటు ఆయా శాఖలు విధించే నిబంధనలను పూర్తిగా పాటించాలని డీఎస్పీ సూచించారు. మతసామరస్యానికి భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ వినాయక చవితి వేడుకలను విజయవంతంగా నిర్వహించుకోవాలని ఆయన కోరారు.

# జనసంద్రమైన అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం





ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా అవనిగడ్డలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం జనసంద్రమైంది.నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద శనివారం విక్కుర్తి శ్రీనివాస్ జన్మదిన వేడుకలను పండగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. తొలుత అవనిగడ్డ మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో భూపతి వారి ఇలవేల్పుగా పూజలు అందుకుంటున్న శ్రీ రేణుకమ్మ అమ్మవారిని విక్కుర్తి దర్శించుకున్నారు. అలాగే అవనిగడ్డ గ్రామ దేవత శ్రీ లంకమ్మ అమ్మవారిని, శ్రీ రాజశేఖర స్వామి వారిని, రాజీవ్ గాంధీ సెంటర్లోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి వార్లను విక్కుర్తి శ్రీనివాస్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావుతో కలిసి విక్కుర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి యువకులు తరలివచ్చి, తమ అభిమాన నేత జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారందరికీ సర్టిఫికెట్ తో పాటు జ్ఞాపికలను విక్కుర్తి రాంబాబు అందజేశారు. 200 మంది రక్తదానం చేసినట్లు విక్కుర్తి రాంబాబు తెలిపారు. రక్తదానం చేసిన వారందరికీ ఈ సందర్భంగా రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు.అవనిగడ్డ నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విక్కుర్తికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు పూల బొకేలు, జ్ఞాపికలు అందించి, దుశాలువాలతో ఘనంగా సత్కరించారు.తొలుత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు ప్రతిమకు, విక్కుర్తి వీర రాఘవయ్య విగ్రహాలకు విక్కుర్తి శ్రీనివాస్ పూలమాలలతో శ్రద్ధాంజలి ఘటించారు.అవనిగడ్డ నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో విక్కుర్తికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడానికి అవనిగడ్డలోని ఒకటవ వార్డులో గల నియోజకవర్గ పార్టీ కార్యాలయానికి తరలిరావడంతో ఆ ప్రాంతమంతా ప్రజలతో కిక్కిరిసింది. అవనిగడ్డ పంచాయతీలోని 3, 6 వార్డులలో గల నాయీ బ్రాహ్మణ వీధిలో శనివారం సాయంత్రం విక్కుర్తి పుట్టినరోజు వేడుకలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాస్ కేకును కట్ చేయగా, పలువురు నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు విక్కుర్తికి కేకును తినిపించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా విక్కుర్తిని ఘనంగా సత్కరించారు.



## మొక్కల పంపిణీతో ఘనంగా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి విక్కుర్తి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను మేక శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి శ్రీనివాసరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించేలా 100 చామంతి పూల మొక్కలను శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు.పుట్టినరోజు వేడుకలను పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంతో నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. మొక్కలను నాటి వాటిని సంరక్షించడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించాలని ఈ సందర్భంగా నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపారు.



# వినాయక ఊరేగింపుల్లో డీజేలకు నో

ప్రజాభూమి ప్రతినిధి,మచిలీపట్నం:

వినాయక నవరాత్రుల సందర్భంగా ఊరేగింపులు, కార్యక్రమాల్లో డీజేల వినియోగానికి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మచిలీపట్నం మాచవరం ప్రాంతంలోని వినాయక మండపం ఎదురుగా ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన లైటింగ్, ఇతర ఏర్పాట్లను ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు తొలగించారు.ట్రాఫిక్ సీఐతో పాటు సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐ నబి సంఘటనా స్థలానికి చేరుకుని ఏర్పాట్లను పరిశీలించి తొలగించారు.

కాగా, ఇటీవల కోనేరు సెంటర్‌లో వినాయక ఊరేగింపులో డీజే వినియోగించడంపై ప్రజల్లో చర్చ జరుగుతోంది. దీంతో డీజేలకు అనుమతి ఉందనే భావనతో మాచవరంలోనూ ఏర్పాట్లు చేశారు. దీనిని పోలీసులు అడ్డుకున్నారు.





# సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కానుకగా నాగాభరణం

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

కృష్ణాజిల్లా, మోపిదేవి మండలం, మోపిదేవి గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి బంగారపు నాగాభరణాన్ని కానుకగా మాజీ రాజ్యసభ సభ్యులు, సుప్రీంకోర్టులో అదనపు సొలిసిటర్ జనరల్ గా విధులు నిర్వహిస్తున్న కనకమేడల రవీంద్ర కుమార్ సోదరి తుమ్మల లక్ష్మి సుజాత, వారి కుమారులు శ్రీనివాస కిరణ్, శివ తరుణ్ గార్ల పేరుమీద స్వామివారికి 220 గ్రాముల బరువు కలిగిన బంగారపు నాగపడగను ( సుమారు రూ.35 లక్షల విలువైన ) కానుకగా, ఆలయ సూపరింటెండెంట్ మధుసూదన్ రావు టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా దాతలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో దాతలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రావి దుర్గావాణి, మండల పార్టీ అధ్యక్షులు నడకుదుటి జనార్దన్, నాయకులు, రావి నాగేశ్వరరావు, మోర్ల జయలక్ష్మి, మాతంగి వెంకటేశ్వరమ్మ, రత్నగిరి, గవిని శివరామకృష్ణ, చందన రంగారావు, డోకిపర్తి బాల కోటేశ్వరరావు బల్లా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు .



# జనార్ధనబాబు సేవలు చిరస్మరణీయం

### జనార్దన్ బాబుకు ఎమ్మెల్యే నివాళులు



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తుమ్మల జనార్ధనబాబు సేవలు చిరస్మరణీయమని అవని గడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఘంట సాల మండల పరిధిలోని కొడాలి గ్రామం లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి కళ్యాణ మండపంలో శనివారం జనార్ధనబాబు సంస్మ రణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జనార్ధనబాబు చిత్రపటానికి ఎమ్మెల్యే బుద్ధప్ర సాద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ ప్రాంత పెద్దగా, కొడాలి పరిసర గ్రామాల అభివృద్ధికి, కొడాలి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షునిగా రైతుల సంక్షేమానికి, మార్కెట్ యార్డ్ అభివృద్ధికి జనార్ధనబాబు కృషి మరువలేనిది అన్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన జనార్ధనబాబు మృతి బాధాకరమని తెలిపారు.ఈ సందర్భంగా జనార్ధన బాబు చిత్రపటానికి లిఖిత ఇన్ఫ్రాస్ట్రక్చర్ అధినేత గడ్డిపాటి శ్రీనివాసరావు, నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్, నియోజకవర్గ ప్రముఖులు శీలం అశ్విన్ కుమార్, పీఏసీఎస్ అధ్యక్షులు బండి పరాత్పరరావు, కృష్ణా మిల్క్ యూనియన్ కార్యవర్గ సభ్యులు వేమూరి సాయి వెంకటరమణ, కోనేరు బలరాం, నివాళులు అర్పించారు. టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు తదితరులు పాల్గొన్నారు.

Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at Y.S.R. and published at D.No.30-251, WARD NO.4, BUDDAYAPALLE VILLAGE, CHINNACHOWK editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1220.cell:9502116677.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్సీపీ విజయమే లక్ష్యం

- కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి.
- స్థానిక ఎన్నికల్లో పార్టీ శ్రేణులకు దిశనిర్దేశం.
- మాజీ రాజ్యసభ సభ్యులు సుభాష్ చంద్రబోస్.



ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి పార్టీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మాజీ రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ వైఎస్ఆర్సిపి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, మాజీ రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ ఆయన తనయుడు రామచంద్రపురం నియోజకవర్గ ఇన్చార్జ్ పిల్లి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మున్సిపాలిటీ , స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పార్టీ సమన్వయం, భవిష్యత్ కార్యాచరణ, గ్రామ-వార్డు స్థాయిలో పార్టీ బలోపేతంపై పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశించారు . అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఐడి కార్డులను మండల, గ్రామ స్థాయిలో సమావేశాలు నిర్వహించి, వాటిని కార్యకర్తలకు అందజేయడం జరుగుతుందని ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ తెలిపారు.ఈకార్యక్రమానికి నియోజకవర్గ పరిశీలకులు కర్రి నాగిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రత్యర్థి పార్టీల రాజకీయ వ్యూహాలు, ఎన్నికల సమయంలో ఎదురయ్యే పరిణామాలపై జాగ్రత్తగా వ్యవహరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్సీపీ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఒకసారి గుర్తు చేసుకోవాలని బోస్ సూచించారు. రెండున్నర ఏళ్ళు గడిచిన తర్వాత ప్రస్తుత పెన్షన్లు ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారని అయితే మన నాయకుడు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పెన్షన్లు మించి ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వలేరని ఆయన స్పష్టం చేశారు. గత రెండున్నర ఏళ్ల కాలంలో చనిపోయిన వారి పెన్షన్లు భర్తీ చేయకుండా ఇప్పుడు అవే పెన్షన్లు ఇచ్చేందుకు సిద్ధపడుతుందని బోస్ స్పష్టం చేశారు. ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలు, ఎరువుల ధరల పెరుగుదల, వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ఆయన ప్రస్తావించారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అమలు చేసిన మద్యం విధానంతో పాటు ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అంశాల్లో ప్రభుత్వ వైఖరిని ప్రజలు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మండలాల కన్వీనర్లు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపాలెం నుండి జనసేన యువనేత నాగేంద్ర బారీ బైక్ ర్యాలీ.

-భారీగా తరలివెళ్లిన జనసైనికులు.



ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు.

రామచంద్రపురం నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కమిటి సమావేశం జరగనున్న నేపథ్యంలో కాజులూరు మండలం గొల్లపాలెంలో గల తిరుమల ఫంక్షన్ హాల్ నుండి జనసేన యువనేత డాక్టర్ దేగల నాగేంద్ర ఆధ్వర్యంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీతో జనసేన శ్రేణులు రామచంద్రపురం తరలి వెళ్లారు. రామచంద్రపురంలో చందమామ గ్రాండ్ నందు జరిగింది. ఈ సందర్భంగా తొలిత రామచంద్రపురంలో పలుచోట్ల జనసేన స్తూపాలను ఏర్పాటు చేసి జనసేన జెండాలను తాడేపల్లిగూడెం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ అమలాపురం పార్లమెంటరీ స్థానిక సంస్థల సమన్వయ కమిటీ ఇన్చార్జి బొలిశెట్టి శ్రీనివాస్ ఆవిష్కరించారు. దీంతో గొల్లపాలెం నుండి జన సైనికులతో బయలుదేరిన బయలుదేరిన ఆర్యాలీ ఇక్కడ ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. కార్యక్రమానికి భారీ స్థాయిలో జనసేన శ్రేణులు హాజరయ్యారు.

# ప్రేమ దయ క్షమ సేవకు ప్రతిరూపమే యేసుక్రీస్తు.

- ఏసుక్రీస్తు చూపిన సేవా మార్గంలో నడుద్దాం.
- రాక్ చర్చి ఉపవాస ప్రార్ధనల ముగింపు సమావేశంలో సత్యం.



ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.

ప్రేమ, దయ ,క్షమ , సేవకు ప్రతిరూపమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం అన్నారు. ఈ మేరకు శనివారం రామచంద్రపురం మండలం ఆదివారపుపేటలో గల రాక్ చర్చి ప్రాంగణంలో బిషప్ కె. ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఉపవాస ప్రార్థనల ముగింపు సమావేశంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమ, దయ, క్షమ, త్యాగం వంటి గొప్ప విలువలను ప్రపంచానికి అందించిన మహోన్నతుడు యేసుక్రీస్తు అని కొనియాడారు. యేసు తనను ప్రేమించిన వారినే కాదు, తనను హింసించిన వారిని సైతం ప్రేమించి క్షమించిన గొప్ప వ్యక్తిత్వమని పేర్కొన్నారు.సిలువపై బాధలు అనుభవిస్తూ కూడా తండ్రీ, వీరిని క్షమించుము వీరు ఏమి చేయుచున్నారో వీరికి తెలియదు అని ప్రార్థించిన యేసుక్రీస్తు క్షమాగుణానికి ప్రపంచంలోనే అత్యున్నత ఉదాహరణగా నిలిచారని పేర్కొన్నారు. పేదలు, బలహీనులు, అనాథలు, బాధితుల పట్ల యేసు చూపిన కరుణ ప్రతి ఒక్కరికీ ఆదర్శమని చెప్పారు. సమాజంలో వెనుకబడిన వారిని ఆదుకోవడం, అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం నిజమైన మానవత్వమని తెలిపారు. సేవే నిజమైన నాయకత్వమని యేసు తన జీవితంతో నిరూపించారని, ప్రతి ప్రజాప్రతినిధి, ప్రతి నాయకుడు ఆయన బోధనలను ఆచరించాలని సూచించారు. జీవితంలో ఎన్నో కష్టాలు, పరీక్షలు ఎదురైనా విశ్వాసాన్ని కోల్పోకుండా ముందుకు సాగాలని యేసుక్రీస్తు బోధించారని పేర్కొన్నారు. ప్రేమ, దయ, క్షమ, సేవ, త్యాగం వంటి విలువలు మన జీవితాల్లో చోటు చేసుకున్నప్పుడే సమాజం మరింత శాంతియుతంగా, సుభిక్షంగా మారుతుందని అన్నారు.అలాగే నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మరియు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రజల సంక్షేమమే తమ లక్ష్యమని, సామాజిక సేవ కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలకు సామాజిక, ఆర్థిక, సేవా కార్యక్రమాల ద్వారా నిరంతరం అండగా నిలుస్తున్న వాసంశెట్టి సత్యంను చర్చి నిర్వాహకులు, సంఘ పెద్దలు ఘనంగా సత్కరించి అభినందించారు.అనంతరం జరిగిన ప్రేమ విందు కార్యక్రమంలో సంఘ సభ్యులు, విశ్వాసులు నాయకులు, యువతతో కలిసి పాల్గొని ఆత్మీయంగా సత్యం మమేకమయ్యారు.

## లోక్ అదాలత్‌లో 176 కేసులు పరిష్కారం.



ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.

రామచంద్రపురం పట్టణంలోని 13వ అదనపు జిల్లా , సెషన్స్ కోర్టు ప్రాంగణంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 176 కేసులు పరిష్కారం అయ్యాయ ని 13వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు జడ్జి బి. హెచ్. వి. లక్ష్మీ కుమారి తెలిపారు. వీటిలో 27 సివిల్ కేసులు, 149 క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. వీటి విలువ రూ.కోటి ,69లక్షల,85వే ,117 రూపాయలు అన్నారు. తొలుత జడ్జి లక్ష్మీకుమారి కక్షిదారులు, న్యాయవాదులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనవసర వాయిదాలు కోర వద్దని రాజీమార్గమే మేలని తద్వారా కేసులు సత్వర పరిష్కారం కావడమే కాక వాది, ప్రతివాదులు కూడా ఈ రాజీమార్గం ద్వారా గెలిచిన ట్టేనని ఆమె అన్నారు. పట్టుదలకు పోకుండా ప్రశాంత వాతావరణంలో కేసులు పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. కోర్టులకు వచ్చిన కక్షిదారులకు మధ్యాహ్నం భోజన సదుపాయం ఆమె ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ ఎం. వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి ఎం. వంశీకృష్ణ, రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటిపల్లి లోవరాజు, లోక్ అదాలత్ ప్యానల్ న్యాయవాదులు బొడ్డపాటి సురేష్ కుమార్, బీ.వీ. కామేశ్వర రావు, కలిదిండి కిరణ్ కుమార్, లోక్ అదాలత్ సిబ్బంది టి సుభాషిని, పిల్లి వాసు, న్యాయవాదులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లపూడిలో విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభం




ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

గ్రామీణ ప్రజలకు స్థానికంగానే మెరుగైన ప్రాథమిక వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో తాళ్లపూడి, పెద్దేవం గ్రామంలో నూతనంగా నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రాథమిక వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టూమెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బారాయ చౌదరి, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, నామన పరమేష్, మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు, ఇందుగుల రామకృష్ణతో పాటు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సూరయ్యపేటలో తాగునీటి కష్టాలు

- 10 రోజులుగా నీటి కోసం ప్రజల అవస్థలు
- అధికారుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం



ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

తాళ్లపూడి మండలం అన్నదేవరపేట పంచాయతీ పరిధిలోని సూరయ్యపేట గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. గత పది రోజులుగా తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో పంచాయతీ అధికారులు రెండు రోజులకోసారి ఒక ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. అయితే గ్రామ అవసరాలకు సరిపడా నీరు అందకపోవడంతో ట్యాంకర్ వద్ద నీటి కోసం ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందన్నారు.ముఖ్యంగా వృద్ధులు, మహిళలు తాగునీటి కోసం బిందెలతో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. నీటి కోసం ప్రజలు ఒకేసారి ట్యాంకర్ వద్దకు చేరుకోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు.సూరయ్యపేటలో తాగునీటి సమస్యపై అధికారులు తక్షణమే స్పందించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. అప్పటి వరకు ప్రతిరోజూ ట్యాంకర్ల ద్వారా సరిపడా తాగునీటిని సరఫరా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సూరయ్యపేట ప్రజల తాగునీటి కష్టాలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై కార్యదర్శి శ్రీనివాస్ ను వివరణ కొరగా సూర్యాపేటలో నీటి కొరత తీర్చడానికి రోజుకు నాలుగు ట్యాంకులు పంపుతున్నామని అవసరమైతే అదనంగా కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. త్వరలో ఆ ఏరియాలో జియాలజీ అధికారులు వాటర్ పడే ప్రాంతాలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి కై బోరును ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

## మందేశ్వరస్వామికి విశేషంగా తైలాభిషేకాలు

ఆలయానికి రూ.2,59 లక్షల ఆదాయం.

తైలాభిషేకాలు, ప్రత్యేక పూజల్లో భక్తుల విశేష భాగస్వామ్యం.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలోని ప్రసిద్ధ శ్రీమందేశ్వరస్వామి ( శనేశ్వర) దేవస్థానానికి శనివారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు శనిదోష నివారణకు ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని దేవస్థానం కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్ దారపురెడ్డి సురేష్ బాబు, ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో దేవస్థానానికి వివిధ పూజలు, సేవలు, విరాళాల ద్వారా రూ. 2,59,062 ఆదాయం సమకూరింది. ముఖ మండపం తైలాభిషేకం, ఏకాదశ రుద్ర తైలాభిషేకం, మహాన్యాస పూర్వక తైలాభిషేకం, తైలం సమర్పించి దర్శనం, తిలదానం, స్వయం జపం హోమం, కేశఖండనం, మాస కళ్యాణం తదితర సేవల ద్వారా రూ. 1,56,430 ప్రత్యక్ష ఆదాయం లభించిందని ఈవో సురేష్ బాబు తెలిపారు. అదేవిధంగా ఆన్లైన్ ద్వారా నిర్వహించిన పరోక్ష పూజల ద్వారా రూ. 72,400 ఆదాయం సమకూరగా, అన్న ప్రసాదం విరాళాల రూపంలో రూ. 30,232 అందాయి. దీంతో మొత్తం ఆదాయం రూ. 2,59,062 చేరినట్టు వెల్లడించారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

ర్యాలి జగన్మోహని కేశవ స్వామి ఆలయంలో ఉచితంగా పర్యావరణహిత మట్టి గణపతి ప్రతిమల పంపిణీ.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ జగన్మోహిని కేశవ ఉ గోపాల స్వామివారి దేవస్థానంలో వినాయక చవితి సందర్భంగా భక్తులకు పర్యావరణహిత మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ మట్టి గణపతి ప్రతిమలను వినియోగించాలని భక్తులకు అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని ఆలయ అధికారులు నిర్వహించారు. భక్తులు ఉత్సాహంగా ప్రతిమలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు, అర్చకులు, వేదపండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆలయ అధికారులు పిలుపునిచ్చారు.

## వినాయక నిమజ్జనోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

-ఉత్సవ కమిటీలు, అధికారులతో రావులపాలెంలో శాంతి కమిటీ సమావేశం.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

వినాయక చవితి నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు రావులపాలెంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఎంపీడీవో, ఎమ్మార్వో, రావులపాలెం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. రమేష్‌బాబు ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా రాబోయే వినాయక నిమజ్జనోత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీలు తప్పనిసరిగా పాటించాల్సిన నియమ నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను సభ్యులకు అధికారులు వివరించారు. నిమజ్జన ఊరేగింపులను క్రమశిక్షణతో నిర్వహించాలని, పోలీసు శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఐ కే. దుర్గా శ్రీనివాస్, సిబ్బంది, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వినాయక విగ్రహాల ఉత్సవ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఏరియా ఆసుపత్రిలో నిరసన.

-నోటికి నల్ల బ్యాడ్జీలు కట్టుకుని బ్లాక్ బెలూన్స్‌తో నిరసన వ్యక్తం.

ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం .

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని , తమ డిమాండ్ల సాధన కోసం రోజుకో వినూత్న రీతిలో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. దాసిల్వారీగా చేస్తున్న ఈ నిరసనలో భాగంగా నోటికి నల్ల రిబ్బన్స్ కట్టుకుని బ్లాకు బెలూన్స్ ఎగరేసి తమ నిరసన వ్యక్తం చేశారు. దీంతో తమ డిమాండ్ల కోసం ప్రతి రోజు ఏదో ఒక రకంగా తమ నిరసన ప్రభుత్వానికి తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్లో పని చేస్తున్న షకీనా , విజయ్ , శ్రీనివాసు, రాంబాబు,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

ర్యాలి జగన్మోహని కేశవ స్వామి ఆలయంలో ఉచితంగా పర్యావరణహిత మట్టి గణపతి ప్రతిమల పంపిణీ.

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ జగన్మోహిని కేశవ ఉ గోపాల స్వామివారి దేవస్థానంలో వినాయక చవితి సందర్భంగా భక్తులకు పర్యావరణహిత మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ మట్టి గణపతి ప్రతిమలను వినియోగించాలని భక్తులకు అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని ఆలయ అధికారులు నిర్వహించారు. భక్తులు ఉత్సాహంగా ప్రతిమలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు, అర్చకులు, వేదపండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆలయ అధికారులు పిలుపునిచ్చారు.

ప్రజాభూమి

జనరల్ 14

ఆదివారం 13 సెప్టెంబరు 2026

## దాతృత్వం వారి స్వంతం, గెడ్డం సాయి బాబా అభినంద నీయులు

– ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి

విద్య, వైద్య కోసం కూటమి ప్రభుత్వం కూటమి ఆవిరల కృషి చేస్తోందనీ, అటువంటి సమయం లో పెద్దేవం గ్రామంలో దాతృత్వానికి చిరునామాగా వున్నా గెడ్డం వారి కుటుంభ సభ్యులు సాయిబాబా వైరంతో విలువైన స్థలాన్ని విరాళం గా ఇవ్వడం యేంతో అభినంద నీయం అని కొవ్వూరు ఏమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామం లో నూతనంగా 42 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ ను కొవ్వూరు ఏమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందుబాటులో వుంటాయన్నారు. పెద్దేవం లో గెడ్డం కుటుంభం లో మూడవ తరం వారసులు సాయిబాబా విలువైన స్థలం ఆస్పత్రి కి ఇవ్వటం పట్ల అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భం లోనే దాత గెడ్డం సాయిబాబా మాట్లాడుతూ పెద్దేవం గ్రామాన్ని అభివృద్ధి వైపు నడ పాలని, తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టుమెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కొవ్వూరు ఏ.ఎం.సి చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, కూటమి నాయకులు నామన చిన్న బూరయ్య, మాజీ ఏమ్మెల్యే శ్రీనివాస నాయుడు, డా. అన్నపూర్ణ, డా.సుచరిత, తహసీల్దార్ లక్ష్మి లావణ్య, ఎస్సై రామకృష్ణలను శాలువా లతో సత్కరించారు. డి.ఈ రవి, ఏ. ఈ. ప్రసాద్, కార్యదర్శి కామేశ్వరి, టీడీపీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## మీర్జాపురం వీఆర్వో సంతకం ఫోర్జరీ

-పోలీసులకు ఫిర్యాదు చేసిన వైనం



ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

నూజివీడు నియోజకవర్గం లోని నూజివీడు మండలం మీర్జాపురం గ్రామాల్లో రెవిన్యూ గ్రామ స్థాయి అధికారి సంతకం ఫోర్జరీ జరిగింది. దీనిపై గ్రామంలో ఒక్కసారిగా కలకలం రేగింది. బ్యాంక్ అధికారులు వీఆర్వో సంతకం ఫోర్జరీ అయి నట్లుగా నిర్ధారణ చేశారు. ఒక వ్యక్తి బ్యాంకు రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఈ క్రమంలో బ్యాంక్ అధికారులు వీఆర్వో సంతకం విషయమై నిర్ధారణ కోసం మీర్జాపురం వీఆర్వో కు ఫోన్ చేశారు. తాను బ్యాంకు రుణం కోసం సదరు వ్యక్తికి సంతకం చేయలేదని బ్యాంక్ అధికారులకు విఆర్వో తేల్చి చెప్పినట్లుగా సమాచారం. దీనిపై అప్రమత్తమైన రెవెన్యూ శాఖ అధికారులు నూజివీడు తహసీల్దార్ ఆదేశాల మేరకు మీర్జాపురం వీఆర్వో తన సంతకం ఫోర్జరీ అయినట్లుగా పోలీసుల కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు శనివారం నూజివీడు తహసీల్దార్ మీడియా సమావేశంలో వివరణ ఇచ్చారు.

## ఏలూరు జిల్లా యోగాసన పోటీలకు ఆగిరిపల్లి వేదిక

ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి



ఏలూరు జిల్లా యోగాసన ఛాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 20వ తేదీన ఆగిరిపల్లిలో నిర్వ హించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటలకు శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలోని శ్రీ మదుపల్లి రామ నాగలక్ష్మి నారాయణరావు–కస్తూరి కళ్యాణ మండపంలో పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 8 సంవత్సరాల వయస్సు నుంచి 60 ఏళ్లు పైబడిన స్త్రీ, పురుషులు ఈ పోటీల్లో పాల్గొన వచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 17వ తేదీలోపు రూ.100 ప్రవేశ రుసుము చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9490335122, 9133402255, 9985193890 నంబర్లను సంప్రదిం చాలని పోటీల అధ్యక్షుడు యండూరు నరసింహమూర్తి, కార్యదర్శి బొద్దూరు సాంబశివరావు కోరారు.

## ఏపీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నున్నే పవన్ తేజ నాయుడు ప్రమాణ స్వీకారం



ప్రజా భూమి ప్రతినిధి–ఏలూరు

ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా నున్నే పవన్ తేజ నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు.గుంటూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతీయ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మనీష్ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.కార్యక్రమానికి యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి నాగ మధు యాదవ్,ఏపీ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ లెనిన్ ప్రసాత్,కో–ఇన్‌చార్జ్ మమత నాగిరెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏలూరు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొల్లి రామసూరి రెడ్డి,ఏలూరు సిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బురదగుంట లెవిన్ క్రిస్టియన్ నూతన రాష్ట్ర అధ్యక్షుడిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం జరిగిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో యూత్ కాంగ్రెస్‌ను రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేయడం, యువత సమస్యలపై పోరాటాలను విస్తృతం చేయడం తదితర అంశాలపై చర్చించారు.ఏలూరు జిల్లా,సిటీ యూత్ కాంగ్రెస్ తరపున నూతన రాష్ట్ర అధ్యక్షుడికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని కొల్లి రామసూరి రెడ్డి, బురదగుంట లెవిన్ క్రిస్టియన్ తెలిపారు.యువతను కాంగ్రెస్ వైపు ఆకర్షిస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

# మోడీ సేవా సంకల్ప్ అభియాన్ మాసోత్సవాలను విజయవంతం చేయండి

### బీజేపీ మండల సమావేశంలో యువనేత పాలూరి జయప్రకాశ్ నారాయణ పిలుపు.



ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహించనున్న 'సేవా సంకల్ప్ అభియాన్' మాసోత్సవాలను దిగ్విజయం చేయాలని బీజేపీ యువనేత, మాసోత్సవాల కన్వీనర్ పాలూరి జయప్రకాశ్ నారాయణ పిలుపునిచ్చారు. కొత్తపేట మండల అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు అధ్యక్షతన వానపల్లిలో నిర్వహించిన బీజేపీ మండల సమావేశానికి ఎస్‌ఐఆర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పాలూరి సత్యానందం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాలూరి సత్యానందం మాట్లాడుతూ, సేవా సంకల్ప్ అభియాన్ నిర్వహణ కోసం కొత్తపేట మండల కమిటీని నియమించినట్లు తెలిపారు. పాలూరి జయప్రకాశ్ నారాయణ కన్వీనర్‌గా, కోటిపల్లి దామోదర్, పేకేటి కామేశ్వరి దివ్య కో–కన్వీనర్లుగా బాధ్యతలు చేపట్టారని పేర్కొన్నారు. పాలూరి జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ, మోడీ జన్మదినం సందర్భంగా నెల రోజుల పాటు రక్తదాన శిబిరాలు, స్వచ్ఛతా కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రత్యేక శిబిరాలు, విద్యార్థులకు 'మేరే సప్నో కా భారత్' పేరుతో చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 17న రాత్రి 7 గంటలకు ప్రతి బూత్, ఇంటి వద్ద దీపాలు వెలిగించి కృతజ్ఞతలు తెలిపే 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. అక్టోబర్ 17న సుశాసన్ సేవా సంవాద్'తో మాసోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అయినవిల్లి సత్తిబాబు గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోలకోటి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు అన్యం సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శులు కోటిపల్లి వెంకట సుబ్రహ్మణ్యం, బళ్ల మూలస్వామి, వివిధ మోర్చాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నూజివీడు శ్రీ శారద ఇంగ్లీష్ మీడియం స్కూల్లో

## ఘనంగా జాతీయ హిందీ దివస్ వేడుకలు




ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

నూజివీడు శ్రీ శారద ఇంగ్లీష్ మీడియం స్కూల్లో జాతీయ హిందీ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో హిందీ భాషపై ఆసక్తి, అభిమానం పెంపొందించేలా కార్యక్రమాలను ఎంతో ఉత్సాహభరితంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు హిందీ ప్రసంగాలు, పద్యాలు, పాటలు, బేనర్ల ప్రదర్శన, భాషా ప్రతిభా ప్రదర్శనలు మరియు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ హిందీ అధ్యాపకురాలు బి. బాలమణి మరియు ప్రైమరీ హిందీ టీచర్ నవుడు సత్యవాణి ముఖ్యపాత్ర పోషించారు. వారి సేవలను అభినందిస్తూ పాఠశాల చైర్మన్ కుప్పాల శంకర రావు గారు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కే. రాధిక మరియు చైర్మన్ కుప్పాల శంకర రావు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు జాతీయ హిందీ దివస్ శుభాకాంక్షలు తెలిపారు.చైర్మన్ కుప్పాల శంకర రావు మాట్లాడుతూ, "మన మాతృభాష మన సంస్కృతి, మన గుర్తింపుకు ప్రతీక. ఇంగ్లీష్ అంతర్జాతీయ భాషగా ప్రపంచంతో మనలను అనుసంధానిస్తే, హిందీ భారతదేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలను కలిపే ముఖ్యమైన భాషగా నిలుస్తోంది. అందువల్ల ప్రతి విద్యార్థి తన మాతృభాషతో పాటు హిందీ, ఇంగ్లీష్ భాషలను కూడా సమర్థవంతంగా నేర్చుకోవాలి" అని అన్నారు.హిందీని కేవలం ఒక పాఠ్యాంశంగా కాకుండా, దేశ ప్రజలను అనుసంధానించే భాషగా భావించి, ప్రతి విద్యార్థి హిందీపై పట్టు సాధించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. విద్యార్థుల ఉత్సాహభరితమైన పాల్గొనడంతో జాతీయ హిందీ దివస్ వేడుకలు పాఠశాలలో స్ఫూర్తిదాయకంగా, ఆహ్లాదకరంగా మరియు వైభవంగా జరిగాయి.

## ఏలూరు జిల్లాలో 155 మద్యం షాపుల రెన్యూవల్‌కు గెజిట్ నోటిఫికేషన్



ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు

జిల్లాలో 2026–27 సంవత్సరానికి 155 మద్యం షాపుల రెన్యూవల్‌కు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా మద్యనిషేధ, ఆబ్కారీ అధికారి ఏ.ఆవులయ్య తెలిపారు. లైసెన్సుదారులు సెప్టెంబర్ 21 సాయంత్రం 5 గంటల్లోగా షాపులను రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు.మొత్తం 155 షాపుల్లో 141 ఓపెన్ కేటగిరీ,14 రిజర్వ్ కేటగిరీ షాపులు ఉన్నాయని తెలిపారు.రెన్యూవల్ రిటైల్ ఎక్సైజ్ ఫీజును ప్రభుత్వం 38 శాతంగా నిర్ణయించిందన్నారు.ప్రతి షాపుకు పర్మిట్ రూమ్ తప్పనిసరి చేస్తూ,దానికి సంబంధించిన ఫీజును కూడా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.రెన్యూవల్ ప్రాసెసింగ్ ఫీజుగా ప్రతి లైసెన్సుదారుడు రూ.5,000 చెల్లించాలన్నారు. 2026–27లో ప్రభుత్వానికి సుమారు రూ.153.23 కోట్ల ఆదాయం సమకూరుతుందని తెలిపారు.గడువులోగా రెన్యూవల్ చేసుకోని షాపులకు తిరిగి లాటరీ నిర్వహిస్తామని చెప్పారు.గత బకాయిలు ఉన్న లైసెన్సుదారులు రెన్యూవల్‌కు అనర్హులవుతారని ఆవులయ్యా స్పష్టం చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సమాయత్తం

### ఉంగుటూరు నియోజకవర్గంలో విస్తృత స్థాయి సమావేశం



ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సమాయత్తం కావాలని నాయకులు పిలుపునిచ్చారు.ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఉంగుటూరు నియోజకవర్గంలో టీడీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి,ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఏలూరు పార్లమెంట్ ఎన్నికల పరిశీలకురాలు,ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ఉంగుటూరు నియోజకవర్గ పరిశీలకులు కొత్తపల్లి ఆశిష్ లాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను సమష్టిగా ఎదుర్కొని కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. పార్టీ శ్రేణులంతా ఒక కుటుంబంలా ఐక్యంగా పనిచేస్తూ,క్షేత్రస్థాయిలో ప్రజలను కలుపుకొని ముందుకు సాగాలని అన్నారు.కూటమి తరపున ఎవరు పోటీ చేసినా, అభ్యర్థి గెలుపే లక్ష్యంగా నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఎన్నికలకు ముందుగానే గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం, బూత్ స్థాయిలో సమన్వయం,కార్యకర్తల భాగస్వామ్యంపై సమావేశంలో చర్చించారు.పార్టీ నాయకులు, ఇన్‌చార్జులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కూటమి విజయానికి కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు,క్లస్టర్ ఇన్‌చార్జులు,యూనిట్ ఇన్‌చార్జులు,బూత్ ఇన్‌చార్జులు,ముఖ్య నాయకులు,సొసైటీ అధ్యక్షులు,నీటి సంఘాల అధ్యక్షులు,రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, టీడీపీ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తోటపల్లి కమిటీ హాల్ వద్ద డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

తోటపల్లి గ్రామ శివారులోని కమిటీ హాల్ వద్ద చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ సమస్యపై గ్రామస్తులు ఆగిరిపల్లి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బెజవాడ రాంబాబు, ఆయన కుమారుడు శ్రీహర్షను కలిసి పరిష్కారం చూపాలని కోరారు. దీనిపై వెంటనే స్పందించిన రాంబాబు సుమారు రూ.4 లక్షల సొంత నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశారు. దీంతో కమిటీ హాల్ పరిసరాల్లో మురుగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. సమస్యను పరిష్కరించిన బెజవాడ రాంబాబు, శ్రీహర్షకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## రూ.52 లక్షల విలువైన బంగారు అభరణాల చోరీ కేసు చేదించిన పోలీసులు

### సీఐ, ఎస్ ఐ ల రివార్డు కొరకు ఎస్పీ సిఫార్సు



ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

బంగారు ఆభరణాలు చోరీ కేసులో చాకచక్యంగా వ్యవహరించి, చోరీకి గురైన రూ. 52. 65 లక్షల విలువైన 405 గ్రాముల బంగారు ఆభరణాల కేసును చేదించిన సిఐ ఏ రఘు, ఎస్సై ఎస్.ఎన్ ముత్యాలరావు, ప్రేమ్ రాజ్, హెచ్ సి.వేణుగోపాలరావు, కానిస్టేబుల్ రాజేష్ లను ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అభినందనలు తెలిపి రివార్డుల కొరకు సిఫార్సు చేశారు. ఈ మేరకు కేసు వివరాలను డీఎస్పీ మేక సుధాకర్ రావు తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం నరసాపురంలోని జైన్ జ్యుయల్ పార్క్ బంగారు ఆభరణాల షాపు లో గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న షేక్ లాల్ సాహెబ్ విడతల వారీగా 45 గ్రాముల బంగారాన్ని దుకాణం నుండి చోరీ చేసినట్లు యజమాని రాజేంద్ర కుమార్ జైన్ ఫిర్యాదు చేశారు. ఈ కేసును 24 గంటలు తిరగకుండా చేదించిన పోలీసులు పోలీసు వర్గాలకు స్ఫూర్తిగా నిలవడంతో పట్టణ,పరిసర ప్రాంత ప్రజల నుంచి అభినందనలు వెల్లు వెత్తాయి.

# ఏఎస్ఆర్ జిల్లాలో భారీ వర్షాలు, వరదలపై ప్రజల్ని అప్రమత్తం చేయండి

- వాగులు పొంగుతున్న వేళ ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించండి
- అవసరం ఉన్న చోట తక్షణం పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాలి
- జిల్లా యంత్రాంగం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులకు పవన్ కళ్యాణ్ సూచనలు



ప్రజాభూమి ప్రతినిధి–అమరావతి

అల్లూరి సీతారామరాజు జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగి పొర్లుతున్న క్రమంలో ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో నెలకొన్న పరిస్థితులపై జిల్లా కలెక్టర్‌తోపాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో పవన్ కళ్యాణ్ సమీక్షించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో వాగులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయని, కొన్ని గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు అధికారులు వివరించారు. అధికారులు అందించిన సమాచారం ప్రకారం, జీకే వీధి మండలం గంగవరం సమీపంలో ఆంధ్రప్రదేశ్–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన వరద ప్రవాహానికి కొట్టుకుపోవడంతో సుమారు 15 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోగా, ఆ ప్రాంతంలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఉప ముఖ్యమంత్రివర్యులు దిశా నిర్దేశం చేశారు.వర్షాలు తగ్గే వరకు ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా బయటకు రావద్దని విస్తృతంగా అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు, ప్రమాదకర ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అవసరం ఉన్న చోట తక్షణమే పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసి బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. వర్షాల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని, అత్యవసర సేవల సిబ్బంది సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ప్రజలు కూడా అధికారుల సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అల్పపీడనం ప్రభావంతో ఉత్తరాంధ్ర ప్రాంతానికి భారీ వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, పార్వతీపురం మన్యం, అనకాపల్లి జిల్లాల అధికారులను కూడా అప్రమత్తం చేశారు.